అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 27-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 147 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



కోల్‌కత తీన్‌మార్

- ఐపీఎల్ 2024 టైటిల్ నైట్‌రైడర్స్ వశం
- టైటిల్ పోరులో సన్‌రైజర్స్‌కు భంగపాటు
- హైదరాబాద్ బ్యాటర్ల అనూహ్య వైఫల్యం
- హైదరాబాద్ 113/10, కోల్‌కత 114/2

వివరాలు ఆటలో

నిన్న గుజరాత్..ఇపుడు ఢిల్లీ

ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం.. ఏడుగురు నవజాత శిశువులు మృతి



న్యూఢిల్లీ: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో గేమింగ్ జోన్‌లో అగ్నిప్రమాద ఘటన మరువక ముందే.. దేశ రాజధాని ఢిల్లీలోని ఒక పిల్లల ఆస్పత్రిలోనూ భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఏడుగురు నవజాత శిశువులు మృతి చెందారు. మరో ఐదుగురు శిశువులు గాయపడ్డారు. తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్‌లో ఉన్న బేబీ కేర్ న్యూ బోర్న్ ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందిన వెంటనే అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపులోకి తెచ్చారు. మంటలు చెలరేగడానికి గల కారణం ...13లో



గుట్కా, పాన్ మసాలాలపై
నిషేధం

- ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రాష్ట్రంలో పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ దాసరి హరిచందన ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీటి తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, అమ్మకాలపై పూర్తి స్థాయిలో నిషేధం విధించినట్టు ఆమె పేర్కొన్నారు. సాచెట్స్, పౌచెస్, కంటేనర్స్ తదితర ఏ రూపాల్లో ప్యాక్ చేసినవైనా సరే... వీటిపై ఏడాది కాలంపాటు నిషేధం ...13లో

నాడు అచ్చేదిన్.. నేడు..?

లోక్‌సభ ఎన్నికలు ముగింపుకొచ్చాయి. ఏడు దశల్లో కేవలం చివరి దశ మాత్రమే మిగిలి ఉన్నది. ఒకపక్క కాంగ్రెస్‌కు రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'ల పరంపర కొత్త ఉత్తేజాన్ని తీసుకొచ్చింది. కానీ బీజేపీకి మాత్రం సరైన 'థీమ్' దొరకలేదు. ప్రధాని మోడీ 'సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్' నినాదం ఎత్తుకోగానే ప్రతిపక్షాలు, ప్రజల నుంచి రాకెట్ స్పీడ్‌తో వస్తున్న ప్రశ్నలకు సమాధానాలు కరువై, సహనం నశించి తిట్ల దండకాన్ని ఎత్తుకుంటున్నారు. హిందుత్వ, పాకిస్థాన్, చైనా, దేశభక్తి వంటి అంశాలు ప్రస్తావిస్తే... ముందు దేశ ప్రజలకు మీరేం మేలు చేశారో చెప్పండంటూ నిలదీతలు ఎక్కువయ్యాయి. దీనితో మోడీ-మోడీ భజనపరుల నోళ్లు మూతపడి కిం...కర్తవ్యం అనే డైలమాలో పడ్డారు.

ప్రతిపక్ష దూషణే కాషాయపార్టీ టార్గెట్

- మోడీ ప్రసంగాలకు ప్రజల నుంచి లభించని స్పందన
- పూటకోమాటతో సర్వత్రా విమర్శలు
- దిక్కుతోచని స్థితిలో మోడీ బృందం
- భయంతో 2047 అంటూ కొత్త పల్లవి



న్యూఢిల్లీ : దేశంలో లోక్‌సభ ఎన్నికల్లో ఆరు దశలు ముగిశాయి. ఇక చివరి దశ మాత్రమే మిగిలి ఉన్నది. ఇప్పటికే ఎన్నికల ప్రచారాల్లో భాగంగా ఆయా పార్టీలు ఏదో దశలో తలమునకలై ఉన్నాయి. ముఖ్యంగా, కాంగ్రెస్, బీజేపీలు తమ మ్యానిఫెస్టోలను విడుదల చేసి ఎన్నికల రణక్షేత్రంలో తలపడుతున్నాయి. సాధారణంగా, ప్రతిపక్షానికి ఎన్నికల ప్రచారమనేది ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే అవుతుంది. కాబట్టి కాంగ్రెస్ అదే దారిలో పయనిస్తూ బీజేపీ వైఫల్యాలను ఎండగడుతు న్నది. గత పదేండ్లలో కేంద్రంలోని మోడీ పాలనలో దేశం తిరోగమనంలోకి వెళ్లిందనీ, అనేక వివాదాస్పద నిర్ణయాలు అమలులోకి వచ్చాయని హస్తం పార్టీ ఆరోపిస్తున్నది. ఒక విధంగా చూసుకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఒక అడుగు ముందే ఉన్నదనీ, ప్రజల్లో ఉంటూ తీవ్రంగా ప్రచారం చేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పదేండ్లపాటు అధికారంలో ఉన్న పార్టీ.. తన పాలనలో సాధించిన ...3లో

ఆరు విడతలైనా 'థీమ్' దొరకక బీజేపీ సతమతం



ఈదురుగాలులతో అతలాకుతలం

పలుచోట్ల భారీ వర్షం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గాలివాన బీభత్సానికి ఏడుగురు మృతి
- హైదరాబాద్‌లో చెట్టు పడి ఇద్దరు..
- రంగారెడ్డి, ములుగు జిల్లాల్లో గోడ కూలి నలుగురు...

నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో అతలాకుతలమయ్యాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో విద్యుత్‌కు, రవాణాకు అంతరాయం ఏర్పడింది. రేకుల షెడ్లు లేచిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో గోడకూలి నలుగురు, పిడుగుపాటుకు ఇద్దరు, చెట్టు పడి ఒకరు మృతిచెందారు. రంగారెడ్డి, ములుగు జిల్లాల్లో గోడ కూలి నలుగురు మరణించారు. హైదరాబాద్‌లో చెట్టు కూలి ఇద్దరు మృతిచెందారు.

వికారాబాద్ జిల్లా చౌడాపూర్, ధరూర్, దుద్యాల, బొంరాస్‌పేట్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం వర్షం కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. పాఠశాల ప్రహారిగోడపై భారీ వృక్షం పడటంతో గోడ కూలింది. ముందలితండాలో నిరుపేద రైతు బి.లింగనాయక్ ఇంటిపై రేకులు గాలికి ఎగిరిపడి ఇల్లు ధ్వంసమయింది. మోమిన్‌కుర్దు గ్రామంలో చాకలి నర్సింలు ఇంటి పైకప్పు గాలివానకి లేచిపోయి ఇంట్లో ఉన్న సామాన్లు చెల్లాచెదురయ్యాయి. పోలేపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ముందు భాగంలో ఉన్న ధ్వజస్తంభ శిఖరం విరిగింది. పల్లెగడ్డలో చెట్టు విరిగి, వైర్లపై పడటంతో రెండు స్తంభాలు నేలకొరిగాయి. తుంకిమెట్ల గ్రామంలో చెట్టు విరిగి ఓ ఇంటిపై పడటంతో రేకులు కూలి, ఇంట్లో ఉన్న వస్తువులు దెబ్బతిన్నాయి. కామారెడ్డి జిల్లా రుద్రూర్ మండలం అంబం గ్రామ శివారులోని అంబం-రుద్రూర్ రహదారిపైనున్న పోచమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఎన్నో ఏండ్ల ఊడల మర్రిచెట్టు నేలకొరిగింది. ఈదురుగాలులు, వర్షంతో చెట్టు కిందకు చేరుకున్న ఒక ఆటో, నాలుగు ద్విచక్ర వాహనదారులు చెట్టు కూలడం గమనించి అక్కడి నుంచి బయటపడ్డారు. దాంతో ఎలాంటి ప్రాణనష్టం ...6లో

పౌర సరఫరాలశాఖలో రూ.1100 కోట్ల కుంభకోణం

సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ప్రమేయం : కేటీఆర్

- హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలంటూ డిమాండ్
- అది కాంగ్రెస్ కాదు.. స్కాంగ్రెస్ పార్టీ అంటూ ఎద్దేవా
- కేంద్రం స్పందించకపోవటంపై అనుమానాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో రూ.1100 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. అందులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల ప్రమేయముందని ఆయన విమర్శించారు. ఈ కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మెన్లు వాసుదేవరెడ్డి, రవీందర్‌సింగ్ తదితరులతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. సివిల్ సప్లయిస్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలనే పేరుతో రూ.750 కోట్లు, మధ్యాహ్న భోజన పథకం కింద 2.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కొనుగోలు ప్రక్రియలో మరో రూ.350 కోట్ల మేర ప్రభుత్వ పెద్దలు అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. ఈ రకంగా మొత్తం రూ.1,100 కోట్ల స్కామ్ రెండు భాగాలుగా జరిగిందని చెప్పారు. సంబంధిత ఆధారాలను, వివరాలను ఆయన ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేశారు. తమ పార్టీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పౌర సరఫరాల కార్పొరేషన్ మాజీ చైర్మెన్ రవీందర్ సింగ్ ఈ కుంభకోణాన్ని 15 రోజుల కిందే బయటపెట్టారనీ, అయినా ముఖ్యమంత్రి గానీ, మంత్రి ఉత్తమ్‌గానీ స్పందించలేదని విమర్శించారు. తమ ...13లో

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

కేటీఆర్, మహేశ్వరరెడ్డికి ఉత్తమ్ హెచ్చరిక

- కిషన్‌రెడ్డిని ఓవర్ టేక్ చేయాలనే ప్రయత్నంలో ఏలేటి
- ప్రతిపక్షాల విమర్శల్లో నయా పైస నిజం లేదు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోనంటూ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాజీ మంత్రి కేటీఆర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డిని హెచ్చరించారు. ఏలేటి బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డిని ఓవర్‌టేక్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అంత ఓవర్ స్పీడ్ పనికి రాదని ఏలేటిని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వరరెడ్డిని తామే పెంచి పోషించామని తెలిపారు. ఇప్పుడేమో అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి డబ్బులు పంపి ఫ్లోర్ లీడర్ పదవి కొనుక్కున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్, మహేశ్వరరెడ్డి తెలిసీతెలియకుండా ఇష్టమెచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నాయన్నారు. సివిల్ సప్లయ్ శాఖపై అబద్ధాలు, అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నయా పైసా నిజం లేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖలో రూ.58వేల కోట్లు అప్పులు చేసిందని తెలిపారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లోనూ రూ.11వేల కోట్ల అప్పులు చేసిందని వివరించారు. గత ప్రభుత్వం కంటే తామే ముందుగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎంఎస్పీ ధరకు కొనాలని రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. అకాల వర్షాలకు తడిసిన ...13లో



విద్యుత్ వినియోగం పెరిగింది

కరెంట్ అంతరాయం విపక్షాల దుష్ప్రచారమే : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వివరాలు 13లో

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

- మొత్తం ఓటర్లు 4,63,839,పోలింగ్ స్టేషన్లు 600
- జూన్ 5న ఓట్ల లెక్కింపు

వివరాలు 13లో



రోహిణి మొదలయ్యే.. ఎండలు ముదిరే..


- జగిత్యాల జిల్లా జైనలో 46.5 డిగ్రీల ఎండ
- తీవ్ర ఉక్కపోత.. పలుచోట్ల కురిసిన వర్షం
- మరో రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం

వివరాలు 2లో

వర్సిటీ వీసీల ఎంపికపై నిఘా

జెంటిల్‌మెన్ కోసం జల్లెడ

- షార్ట్ లిస్ట్‌లోని ఒక్కొక్కరి గురించి ప్రభుత్వ వర్గాల ఆరా
- జూన్ 10లోపు నియామకాలకు కసరత్తు..!





నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీల వీసీ ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ప్రొఫెసర్లలో జెంటిల్‌మెన్స్ కోసం జల్లెడ పడుతోంది. గత ప్రభుత్వం వీసీల నియామకాల్లో చేసిన లోపాలను గుర్తించి.. అలాంటి వారిని వీసీలుగా నియమించకుండా పారదర్శకంగా, నిజాయితీగా ఎంపిక చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది.

రాష్ట్ర వ్యాప్తంగా 318 మంది వివిధ యూనివర్సిటీల వీసీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో నుంచి సుమారు 55 నుంచి 80 మందితో షార్ట్ లిస్టు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఆ షార్ట్ లిస్టులో ఉన్న వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. 2 నుంచి 4 విభాగాలకు చెందిన నిఘా వర్గాలు.. షార్ట్ లిస్టులో ఉన్న ప్రొఫెసర్లలో ఒక్కొక్కరి వివరాలు, వారి గుణగణాలు సేకరిస్తున్నట్టు తెలిసింది.

ఇలా వివరాలు సేకరణ..

వీసీల కోసం సుమారు 15 నుంచి 18 అంశాలను ఒక టేబుల్‌గా తయారు చేసుకొని.. ఒక్కో ఆశావహుని డేటాను సేకరిస్తున్నారు. వారు విద్యార్థి దశలో ఎలా ఉన్నారు? వృత్తి పరంగా, గతంలో ఎలాంటి పదవులు నిర్వహించారు? అప్పుడు సమస్యలు ఎలా పరిష్కరించారు..? ఇలాంటి వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. అలాగే విద్యార్థులు ఉద్యోగులతో ఎలాంటి సంబంధాలు కలిగి ఉన్నారు. పాలన అనుభవం, సమయ స్ఫూర్తి, ఏవైనా ఆరోపణలు ఎదుర్కొంటున్నారా? గత పదవుల్లో ఏమైనా అవినీతికి పాల్పడ్డారా, ఆరోగ్య పరిస్థితి, సబ్జెక్ట్ నాలెడ్జ్, యూనివర్సిటీల యాక్ట్ నిబంధనలపై అవగాహన కలిగి ఉన్నారా? పరిపాలన, పరిశోధన అనుభవం ఎంత వరకు ఉంది.. వారి విద్యార్హతల సర్టిఫికెట్లు, పరిశోధన పేపర్లు ఇలాంటి వాటిపై పూర్తి స్థాయిలో సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికే ...13లో

కీరవాణి స్టూడియోకు సీఎం రేవంత్ ..

'జయ జయహే తెలంగాణ' గీతంలో స్వల్ప మార్పులు



హైదరాబాద్: రాయదుర్గంలోని ఎంఎం కీరవాణి స్టూడియోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించారు. 'జయ జయహే తెలంగాణ' గీతంలో స్వల్ప మార్పులు, చేర్పులు చేస్తున్నందున అందుకు సంబంధించి ప్రముఖ కవి అందెశ్రీ, సంగీతదర్శకులు కీరవాణితో చర్చించేందుకు సీఎం.. స్టూడియోకు వెళ్లారు. ఇప్పటి వరకు ఉన్న తెలంగాణ గీతంలో స్వల్ప మార్పులు.. చేర్పులు చేసే కార్యక్రమం కొనసాగుతోంది. అందులో జిల్లాల ప్రస్తావనతో పాటు మరికొన్ని అంశాలు ఉండటంతో వాటి స్థానంలో ఏయే అంశాలు ఉండాలి.. అన్నదానిపై చర్చించినట్టు తెలుస్తోంది. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి వెళ్లిన రేవంత్‌రెడ్డి.. ఆ పాటను ఒకటికి రెండు సార్లు విని.. అందులోని అంశాలపై చర్చించినట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండడంతో...గతంలో పది జిల్లాలు అన్నపదాన్నితొలగించినట్టు సమాచారం. ఆ స్థానంలో పద పద అన్నపదాన్ని చేర్చినట్టు తెలుస్తోంది.

సీఎంతో బాలకృష్ణ భేటీ




సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఎన్నికలయ్యాక ఏపీ,తెలంగాణలోని పలు రాజకీయ అంశాలతో పాటు సినిమా పరిశ్రమ తీరుతెన్నులను గురించి సీఎం వాకబు చేసినట్టు సమాచారం.

'ప్రయివేటు'లో ఉచిత విద్య..!

స్కూల్స్, కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశాలు

- బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ పథకం ద్వారా అవకాశం
- సద్వినియోగం చేసుకుంటే పేద విద్యార్థులకు లబ్ధి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గిరిజన తెగలకు చెందిన లంబాడా, ఎరుకల, ఇతర ఉప-కులాలు, పేద దళిత విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో 3వ తరగతి, 5వ తరగతి, 8వ తరగతి, పదో తరగతి వరకు, 'పది' పూర్తయిన వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఇంటర్‌లో కార్పొరేట్ కాలేజీల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే, వారికి ఉచితంగా ప్రయివేటు పాఠశాలల్లో 'పది' వరకు, కాలేజీల్లో ఇంటర్ వరకు ఉచితంగా చదువుకునేందుకు అవకాశం దక్కుతుంది.

సీట్ల కేటాయింపు ఇలా..

2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ పథకం ద్వారా ప్రవేశాలకు జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. జిల్లాకు మొత్తం 46 సీట్లు కేటాయించగా, అందులో 3వ తరగతిలో 22 సీట్లు, 5వ తరగతిలో 12 సీట్లు, 8వ తరగతిలో 12 సీట్లు ఉన్నాయి. దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంది. దరఖాస్తు ఫారాలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి.

దరఖాస్తులు ఇలా..

దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తుతోపాటు కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇతర వివరాలకు 9959159629 నెంబరులో సంప్రదించవచ్చు. ఇక 2024-25లో బెస్ట్ అవేలబుల్ స్కూల్ (డే స్కాలర్) పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం కోసం 5, 6 ఏండ్ల లోపు షెడ్యూల్డ్ కులాల బాల బాలికలను నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. 1వ తరగతిలో ప్రవేశాల కోసం చింతల్ లోని ఆర్ఎస్‌కే ఉన్నత పాఠశాల, కుషాయిగూడలోని బ్రిల్లియంట్ గ్రామర్ హై స్కూల్, కూకట్‌పల్లిలోని బ్రిల్లియంట్ గ్రామర్ హై స్కూల్, బోడుప్పల్‌లోని పద్మశ్రీ ఉన్నత పాఠశాలలో సీట్లు కేటాయించారు.

వీరు అర్హులు..

దరఖాస్తుదారులకు మీ-సేవా ద్వారా మేడ్చల్ నెటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. మల్కాజిగిరి జిల్లాకు చెందిన వారై ఉండాలి. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికైతే రూ.లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతాల వారికైతే రూ.2లక్షల లోపు ఉండాలి. ఒక్క కుటుంబం నుంచి ఒక్క విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుంది. విద్యార్థి వయస్సు 01-06-2014 నాటికి 5-6 ఏండ్లు కలిగి ఉండాలి. కులం, ఆదాయం మీ-సేవా ద్వారా పొంది ఉండాలి. ఈ నెల 18 నుంచి జూన్ 7వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి.

కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ కోసం..

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 7 జీపీఏకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీల్లో ఉచితంగా ఇంటర్మీడియట్ చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, కేజీబీవీ, నదోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవేలబుల్ పథకం కింద చదివిన వికలాంగ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీకి చెందిన విద్యార్థులకు అవకాశం కల్పించారు. కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ చదివే విద్యార్థుల ఫీజును ప్రభుత్వం ఆయాకాలేజీల యాజమాన్యా లకు చెల్లిస్తుంది.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

ఇంటర్ లో కార్పొరేట్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి వివరాలను, పదో తరగతిలో సాధించిన జీపీఏ, సెల్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ, కులం, ఆదాయం, నివాస, వికలాంగ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్ జతచేయాల్సి ఉంటుంది. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలలకు చెందిన బోనఫైడ్లు, ఫొటోను సైతం వెబ్‌సైట్‌లో అప్ లోడ్ చేయాలి. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 15వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నెల 30 వరకు గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తొలి జాబితాను జూన్ 3వ తేదీన ప్రకటించి, జూన్ 6వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేపడతారు. ఎంపికైన వారికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

పేద విద్యార్థులకు మంచి అవకాశం - వినోద్‌కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఈ బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ పథకాన్ని జిల్లాకు చెందిన పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి. మిగతా వివరాలకు కేటాయించిన ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి కనుక్కోవచ్చు. లక్కీ డ్రా, మార్కుల ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తాం.

జేఈఈ (ఐఐటీ, యన్‌ఐటీ) సీట్ అలాట్ మెంట్ బుక్ లెట్‌లు సిద్ధం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జేఈఈ (మెయిన్)2024లో అర్హత, ర్యాంకులు సాధించిన విద్యార్థుల అవగాహన కోసం జేఈఈ 2023 సీట్ అలాట్‌మెంట్ కౌన్సెలింగ్ బుక్‌లెట్‌లను సిద్ధం చేసినట్టు ఐఐటీ -జేఈఈ, నీట్ ఫోరం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 6 రౌండ్లుగా సాగే జేఈఈ కౌన్సిలింగ్ ర్యాంకులు, సీట్లు, రిజర్వేషన్, ఇంజినీరింగ్ బ్రాంచీలు, ఇతర వివరాలు పొందుపరిచినట్టు ఫోరం తెలిపింది. ఈ బుక్‌లెట్ల ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్ల కేటాయింపు, ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకులను తెలుసుకోవచ్చని తెలిపింది. ఆసక్తి గలవారు డిజిటల్ బుక్‌లెట్‌లను వాట్సాప్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నది. వివరాలకోసం జేఈఈబుక్‌లెట్ అని టైపు చేసి 9849016661 వాట్సాప్ మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

మళ్లీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ : ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడటం, ఆర్టికల్ 370 రద్దు గురించి చెప్పడం, అలాగే ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) అమలుపై మాట్లాడటం మత ఆధారిత ప్రచారం అయితే తాము చేసింది అదేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిస్సిగ్గుగా పునరుద్ఘాటించారు.ఎన్‌డిఎ మళ్లీ అధికారంలోకి రాగానే యుసిసిని దేశవ్యాప్తంగా అమల్జేస్తామన్నారు.మత ఆధారిత రిజర్వేషన్లకు తమ పార్టీ వ్యతిరేక మన్నారు.పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లోనూ బీజేపీ భారీ విజయం సాధిస్తున్నారు.బీజేపీ 400 స్థానాల్లో గెలిచితీరుతుందని,అలాగే ఒడిషా,ఆంధ్రప్రదేశ్,అరుణాచల్ ప్రదేశ్‌లోనూ ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఏర్పడుతాయని అమిత్ షా జోష్యం చెప్పారు. కేంద్రంలో ఈ దఫా తాము అధికారంలోకి రాగానే యుసిసి అమలు ప్రక్రియను చేపట్టి ఐదేళ్లలో దేశవ్యాప్తంగా అమల్జేసి తీరుతామని చెప్పారు.ఈ ఏడాది సెప్టెంబరులో జమ్ముకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఆ తర్వాత జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. 'ఎన్‌డిఎ మూడోసారి అధికారంలోకి వస్తే

పదిన్నర కేజీల పసిడి స్వాధీనం

- రూ.7.75 కోట్ల విలువ
- గుజరాత్ టు చెన్నై ముఠా గోల్డ్ దందా
- సిండికేట్ సభ్యుల అరెస్టు



అహ్మదాబాద్ : బంగారం ధర రోజురోజుకూ ఆకాశాన్నంటుతోంది. సామాన్యుడు కనీసం కొనాలనే ఆలోచన కూడా చేయలేని పరిస్థితి. అక్రమార్కులు మాత్రం విదేశాల నుంచి కిలోల కొద్దీ బంగారాన్ని దేశానికి తీసుకువస్తున్నారు. ఎన్ని నిఘాలు పెట్టినా వీరికి అడ్డుకట్ట వేయడం కష్టంగా మారుతోంది. దీనికి మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ వేదికగా మారింది. ఇక్కడి నుంచి మొన్నటి వరకు డ్రగ్స్ అక్రమ రవాణా జరిగేది. ఇప్పుడు బంగారం కూడా ఆ లెక్కలో చేరింది.

అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 10.32 కిలోల బంగారం పట్టుబడింది. కీలక సమాచారం అందుకున్న రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) అధికారులు ప్రయాణీకులను తనిఖీ చేశారు.పట్టుబడ్డ వారి నుంచి మరింత సమాచారం రాబట్టి వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించడంతో రూ. 7.75 కోట్లు విలువైన 24 క్యారెట్ల బంగారం పట్టుబడింది. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా, డీఆర్ఐ అధికారులు అబుదాబి నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఎస్వీపీఐ) లో పట్టుకున్నారు.వారు లోదుస్తుల్లో దాచిపెట్టిన 3596.36 గ్రాముల బంగారం పేస్టును స్వాధీనం చేసుకున్నారు.వారిని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన మరో ఇద్దరు వ్యక్తులను సైతం అదుపులోకి తీసుకున్నారు.వారిని విచారిస్తే సిండికేట్‌కు సంబంధించి గుట్టు రట్టయింది.ఈ సిండికేట్‌కు సంబంధించిన ఇతర సభ్యులు విమానాశ్రయానికి దగ్గర్లో బస చేసిన హోటల్లోనూ తనిఖీలు నిర్వహించారు. ఈ లోపే ఉదయం వచ్చిన మరో సిండికేట్ సభ్యుడు అక్రమంగా తీసుకువచ్చిన బంగారాన్ని.. అహ్మదాబాద్ నుంచి ముంబయికి రైలులో తరలిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అతన్ని కూడా బోరివలి స్టేషన్ వద్ద పట్టుకుని 2,551 గ్రాముల బంగారం పేస్టును స్వాధీనం చేసుకున్నారు. అదే సిండికేట్‌కు చెందిన మరో వ్యక్తి దుబాయ్ నుంచి వస్తున్నట్టు తెలియడంతో అతన్ని కూడా పట్టుకుని 5.5 కిలోల బంగారం పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ మొత్తం బంగారాన్ని అహ్మదాబాద్‌లో ఉన్న తమ గ్రూపు సభ్యుడికి అందజేయాల్సి ఉందని సమాచారం. మొత్తం ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న కీలక వ్యక్తితో సహా పది మందిని కస్టమ్స్ చట్టం కింద డీఆర్ఐ అరెస్టు చేసింది. వీరంతా తమిళనాడుకు చెందిన వేర్వేరు వ్యక్తుల ద్వారా విదేశాల నుంచి బంగారం పేస్టును అక్రమంగా రవాణా చేశారు. నాలుగు నెలలుగా కొనసాగుతున్న ఈ సిండికేట్‌లో ఒక వ్యక్తి విదేశాల నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని ముంబై, చెన్నైతో పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు డీఆర్ఐ విచారణలో వెల్లడైంది.

క్యాన్సర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రెనోవా సెంచరీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ శ్రీధర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రోజు రోజుకు గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని రెనోవా సెంచరీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ శ్రీధర్ సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించే పాప్‌స్మియర్ టెస్టులను ఉచితంగా నిర్వహించారు.ఈ క్యాన్సర్‌తో మహిళలు చిన్న వయస్సులోనే ప్రాణాలను కోల్పోతున్నారని హెచ్చరించారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా... మహిళలు పాప్ స్మియర్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు.ఈ పరీక్షలో క్యాన్సర్‌కు సంబంధించిన కణాలు ఏవైనా గర్భాశయ ముఖద్వారంలో ఉంటే వాటిని గుర్తించి హెచ్చరిస్తుందని తెలిపారు.రొమ్ము క్యాన్సర్‌ను మమోగ్రాఫ్‌తో గుర్తించవచ్చని తెలిపారు.

గుజరాత్ రిక్రూట్‌మెంట్ స్కామ్ మోడల్

● పదేండ్లలో 11 పేపర్లు లీక్ ● 201 మంది నిందితులపై కేసులు ● ఎలాంటి చర్యలూ తీసుకోని బీజేపీ సర్కారు ● కాంగ్రెస్, నిరుద్యోగుల ఆగ్రహం

న్యూఢిల్లీ : గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసుకొని బీజేపీ సర్కారు కేంద్రంలో కొలువు తీరింది. గుజరాత్ సీఎంగా ఉన్న మోడీ.. భారత ప్రధానిగా ఎదిగారు. అయితే, మోడీ స్వంత రాష్ట్రం గుజరాతే సాక్షాత్తూ రిక్రూట్‌మెంట్ స్కామ్‌లకు కేంద్ర బిందువుగా మారుతున్నది. దీంతో రాష్ట్రంలోని ఉద్యోగార్థులలో నిరాశ పెరుగుతున్నది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పరీక్షలపై వారికి నమ్మకం సన్నగిల్లుతున్నది. గుజరాత్‌లోని కాంగ్రెస్ యూనిట్.. ప్రభుత్వ సంబంధం లేకుండా రిక్రూట్‌మెంట్ స్కామ్‌లు సాధ్యం కాదని ఆరోపించింది. రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించిన వార్తలు రావటంతో ప్రముఖ బీజేపీ నాయకుడు, మోడీకి అత్యంత సన్నిహితుడైన అసిత్ వోరా గుజరాత్ సెకండరీ సర్వీస్ సెలక్షన్ బోర్డు చైర్మెన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. పేపర్ లీక్ వ్యవహారంలో వార్తల్లో నిలిచిన ప్రింటింగ్ ప్రెస్ ఒకప్పుడు మోడీ పుస్తకాన్ని ముద్రించింది.

'మోడీ కీ గ్యారెంటీ' పేరుతో బీజేపీ మ్యానిఫెస్టోలో మోడీ ఇచ్చిన హామీలలో ఒకటి. "దేశవ్యాప్తంగా రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో దుష్ప్రవర్తనను అరికట్టడానికి మేము ఇప్పటికే కఠినమైన చట్టాన్ని రూపొందించాం. యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని కఠినంగా శిక్షించేందుకు ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తాం" అని వివరించింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో.. కేంద్రం పబ్లిక్ ఎగ్జామినేషన్ (అన్యాయమైన మార్గాల నివారణ) బిల్లు, 2024ను ఆమోదించింది. దేశవ్యాప్తంగా యువతతో జరుగుతున్న మోసానికి ఈ చట్టం అడ్డం పడుతున్నదని విద్యావేత్తలు, నిపుణులు అంటున్నారు.

పేపర్ లీక్‌లతో పరీక్షలను రద్దు చేయటమే కాకుండా.. అసంఖ్యాక అభ్యర్థుల ఆశలు, ఆకాంక్షలు కూడా నీరుగారిపోతున్నా యని వారు చెప్తున్నారు. పేపర్ లీకేజీల కారణంగా గత ఐదేండ్లలో 15 రాష్ట్రాల్లో 41 రిక్రూట్‌మెంట్ పరీక్షలు రద్దయ్యాయనీ, ఫలితంగా 1.4 కోట్ల మంది దరఖాస్తుదారులకు భారీ నష్టం వాటిల్లిందని కొన్ని వార్త కథనాల సారాంశం.

ముఖ్యంగా, యూపీ, బీహార్ రాష్ట్రాలలో ఈ సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. అయితే, బీజేపీ 'మోడల్' రాష్ట్రమైన గుజరాత్‌లో పరిస్థితి అంత దారుణంగా ఉన్నది.

ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌లో జరుగుతున్న మోసాలపై అక్కడి యువత, నిరుద్యోగులు, ఉద్యోగార్థులు ఆందోళనలను వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది ఫిబ్రవరిలో గుజరాత్‌లోని బీజేపీ సర్కారు.. ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్షలలో పేపర్ లీక్‌లను నిరోధించటానికి ఒక బిల్లును ఆమోదించింది. పేపర్ లీకేజీకి సంబంధించిన 'వ్యవస్థీకృత నేరానికి' గరిష్టంగా పదేండ్ల జైలుశిక్ష, కనీసం కోటి రూపాయల జరిమానా విధించేలా చట్టంలో ఉన్నది. గత 11 ఏండ్లలో రాష్ట్రంలో 11 పేపర్ లీకేజీ కేసులు నమోదయ్యాయని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ తెలిపారు.

ఈ కేసులలో 201 మంది నిందితులపై 11 కేసులు నమోదయ్యాయి.

వీటిలో 10 కేసులలో ఛార్జిషీట్లు దాఖలు కావటం గమనార్హం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే, గుజరాత్‌లో పేపర్ లీక్ మూలాలు లోతుగా ఉన్నాయనీ, బీజేపీ పాలనతో సంబంధం ఉన్నదని చెప్తున్నాయి.



ఆ రెండు సంస్థల హస్తం

రిక్రూట్‌మెంట్ స్కామ్‌లో గుజరాత్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్(జీఎస్ఎస్ఎస్‌బీ) (ఇది అన్ని ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌లకు పరీక్షలను నిర్వహించే సంస్థ), అహ్మదాబాద్‌లోని సూర్య ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్ (ఇక్కడి నుంచే అనేక పేపర్లు లీక్ అయినట్టు ఆరోపణ లున్నాయి) అనే రెండు సంస్థల ప్రధాన హస్తం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. 2021 నాటి హెడ్ క్లర్క్ పరీక్ష పేపర్ లీక్ కేసు గత దశాబ్దంలో గుజరాత్‌లో జరిగిన అత్యంత అపఖ్యాతి పాలైన రిక్రూట్‌మెంట్ స్కామ్. ఇది ప్రభుత్వాన్ని కదిలించింది. రాష్ట్రవ్యాప్త నిరసనల తర్వాత అప్పటి జీఎస్ఎస్ఎస్‌బీ అధ్యక్షులు, బీజేపీ నాయకుడు అసిత్ వోరా రాజీనామా చేయవలసి వచ్చింది.

ఏమిటీ ఈ స్కామ్?

2021లో జీఎస్ఎస్ఎస్‌బీ 186 హెడ్ క్లర్క్ సీట్లకు రిక్రూట్‌మెంట్‌ను ప్రకటించింది. పరీక్ష అదే ఏడాది డిసెంబర్ 12న రాష్ట్రంలోని దాదాపు 700 కేంద్రాలలో నిర్వహించారు. ఇందులో 88,000 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. పరీక్షకు ముందే రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు ప్రశ్నపత్రాలు లీకయ్యాయని వార్తలు రావటంతో పరీక్షను రద్దు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ పేపర్ అహ్మదాబాద్‌లోని సూర్య ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి లీక్ అయింది. ఈ కేసులో గుజరాత్ పోలీసులు 30 మందికి పైగా వ్యక్తులను అరెస్టు చేసి 14,000 పేజీల ఛార్జిషీట్‌ను తర్వాతి ఏడాది మార్చిలో దాఖలు చేశారు. పోలీసులు ప్రింటింగ్ ప్రెస్ సూపర్‌వైజర్ కిషోర్ ఆచార్యను ప్రధాన నిందితుడిగా అభియోగాలు మోపారు. ఈ కేసులో ప్రింటింగ్ ప్రెస్ యజమాని ముద్రేష్ పురోహిత్‌ను కూడా విచారించారు. అయితే అతను డిసెంబర్ 2021లో ముందస్తు బెయిల్ పొందాడు. కుంభకోణానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త యువత, ఉద్యోగార్థులు, నిరుద్యోగులు ఉద్యమాన్ని నడిపారు. సూర్య ప్రింటింగ్ ప్రెస్ 'కోట లాంటి భవనం' నుంచి పరీక్షా పత్రాలు ఎలా బయటకు వస్తాయని వారు అనుమానాలు వ్యక్తం చేశారు. కాగా, ఈ వ్యవహారం ఇంకా కోర్టులో ఉన్నది. గతంలో పేపర్ లీక్‌లలో సూర్య ప్రెస్ ప్రమేయం ఉన్నట్టు తెలుస్తున్నది. దీంతో, గుజరాత్ యూనివర్సిటీ సూర్య ప్రెస్‌ని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్టు కూడా వార్తలు వచ్చాయి. ఈ ప్రెస్ ఐదు యూనివర్సిటీలకు సంబంధించిన పరీక్షా పత్రాలను ముద్రించేదని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ముద్రేష్ పురోహిత్‌కు ఆరెస్సెస్, బీజేపీతో సంబంధాలున్నాయని గుజరాత్ కాంగ్రెస్ ఆరోపించింది.



గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన 14 పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ దోషి ఆరోపించారు. జీపీఎస్సీ చీఫ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష (2013), తలతి రిక్రూట్‌మెంట్ పరీక్ష (2015), సురేంద్రనగర్ జిల్లాలోని గాంధీనగర్, మోడసాలో జిల్లా పంచాయతీ నిర్వహించిన తలతి రిక్రూట్‌మెంట్ పరీక్ష (2016), 2018లో నిర్వహించిన టీఏటీ–టీచర్ పరీక్ష, మెయిన్ సేవక్ పరీక్ష, నయాబ్ చిట్నీస్ పరీక్ష, లోక్ రక్షక్ దళ్, 2019లో జరిపిన నాన్–సెక్రటేరియట్ క్లర్క్, 2020లో జరిపిన ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్షలు (కరోనా కాలం), 2021లో నిర్వహించిన హెడ్ క్లర్క్, విద్యుత్ సహాయక్, సబ్ ఆడిటర్, 2022లో జరిపిన ఫారెస్ట్ గార్డ్, 2023లో జూనియర్ క్లర్క్ వంటి నియామక పరీక్షలు ఇందులో ఉన్నాయని వివరించారు.

ఈవీఎంను ధ్వంసం చేసిన బీజేపీ అభ్యర్థి..

● భువనేశ్వర్‌లో ఘటన.. అరెస్ట్ చేసిన పోలీసులు



భువనేశ్వర్ : ఇటీవల మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే ఓ పోలింగ్ బూత్‌లో ఈవీఎంను ధ్వంసం చేసిన కేసు గురించి తెలిసిందే. అటువంటిదే తాజాగా భువనేశ్వర్‌లో చోటుచేసుకుంది. ఓటు వేసే సందర్భంగా బీజేపీ అభ్యర్థి రెచ్చిపోయాడు. ఈవీఎంను ధ్వంసం చేశాడు. దీంతో పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది . అతనిపై ప్రిసైడింగ్ అధికారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాలోని ఖుర్దా జిల్లాలో చిలికా బీజేపీ ఎమ్మెల్యే ప్రశాంత్ జగ్‌దేవ్ ఖుర్దా అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేశారు. బెగునియా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కౌన్రిపట్నలో ఓటరుగా ఉన్నారు. కాగా, శనివారం ఆరో దశ పోలింగ్ సందర్భంగా ప్రశాంత్ జగ్‌దేవ్ తన భార్యతో కలిసి పోలింగ్ బూత్‌కు వెళ్లారు. ఈవీఎం మొరాయించడంతో ఓటు వేసేందుకు కొంత సమయం వేచి ఉండాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారి, ఆయన మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన ప్రశాంత్, టేబుల్‌పై ఉన్న ఈవీఎంను లాగడంతో అది కిందపడి పగిలింది. దీంతో పోలింగ్‌కు విఘాతం కలిగింది.మరోవైపు ఈవీఎంను ధ్వంసం చేసిన ఆయనపై ప్రిసైడింగ్ అధికారి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టంతో పాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో ఖుర్దా జైలుకు ఆయనను తరలించారు.

న్యాయవ్యవస్థలకు మించి మోడీ వ్యవహారశైలి

● అంతా నేనే అన్నట్టు ప్రధాని తీరు

● బీజేపీ హయాంలో దర్యాప్తు సంస్థల నిర్వీర్యం : తేజస్వి యాదవ్



పాట్నా : ప్రధాని మోడీ ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ నాశనం చేశారని బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం పాట్నాలో విలేకరులతో మాట్లాడారు. బీహార్‌కు వచ్చి ప్రధాని తమను జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారని అన్నారు. తాను న్యాయస్థానాల కంటే అధికమన్నట్టుగా మోడీ భావిస్తున్నారని వివరించారు. ఆయన వ్యవహారశైలిపై తేజస్వి అభ్యంతరం వ్యక్తం చేశారు. మోడీ కనుసన్నల్లోనే ప్రభుత్వ ఏజెన్సీలు నడుస్తున్నాయని స్పష్టమైందన్నారు. మోడీ హయాంలో దర్యాప్తు సంస్థలకు విలువ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని అరెస్ట్ చేయాలి.. వీరిని విడిచిపెట్టాలని చెప్పడమే ప్రధాని పనిలా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వ్యవస్థలను ప్రధాని మోడీ నీరుగారుస్తున్నారని ఆయన మండిపడ్డారు.

జూన్ 4 తీర్పు కోసం ఆత్రుత

● ఇండియా ఫోరం విజయం కోసం పాక్‌లో ప్రార్థనలు : ప్రధాని మోడీ



బన్స్‌గావ్ : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీ ఆదివారం యూపీలోని బన్స్‌గావ్‌లో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిం చారు. ఇండియా ఫోరం విజయం కోసం పాక్‌లో ప్రార్థనలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్పీ–కాంగ్రెస్ ఓటు జీహాద్‌కు పిలుపు ఇస్తున్నాయని ప్రధాని అన్నారు. పక్కా గృహాలు పొందనున్న 3 కోట్ల మంది పేదలు, రూ. 5 లక్షల వరకూ ఉచిత చికిత్స అందుకునే వృద్ధులు, ముద్ర పథకంతో రుణాలు పొందే కోట్లాది యువత, స్వయం ఉపాధి గ్రూపులకు చెందిన 3 కోట్ల మంది మహిళలు జూన్ 4న వెల్లడయ్యే తీర్పు కోసం వేచిచూస్తున్నారని మోడీ అన్నారు.

పేదల ముఖాల్లో వెలుగులు నింపుతాం

● ఇండియా ఫోరం అధికారంలోకి వస్తే పేద మహిళల ఖాతాల్లో రూ. లక్ష జమ : రాహుల్ గాంధీ



హిమాచల్‌ప్రదేశ్ : ఇండియా ఫోరం అధికారంలోకి రాగానే పేదల ముఖాల్లో వెలుగులు పూసేలా చర్యలు చేపడతామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో తమ ప్రభుత్వం కొలువుతీరిన వెంటనే దేశంలో పేదల జాబితాను రూపొందిస్తామని, ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళ పేరును ఎంపిక చేస్తామని చెప్పారు. జులై 5న దేశంలోని పేద మహిళలందరి బ్యాంక్ ఖాతాల్లో రూ. 8,500 జమ చేస్తామని అన్నారు. జులై నుంచి ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ ఇలా ప్రతి నెలా వారి ఖాతాల్లో వేస్తామని రాహుల్ గాంధీ వెల్లడించారు.

'ఇండియా' కు సానుకూల పవనాలు

● కాషాయ పార్టీ పట్ల ప్రజల్లో విముఖత : ప్రియాంక గాంధీ



పటియాలా : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సానుకూల వాతావరణం ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ప్రచారం కోసం తాను ఏ ప్రాంతానికి వెళ్లినా, ప్రజల నుంచి మెరుగైన స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం తాను గమనించానన్నారు. బీజేపీ పాలన పట్ల విసిగి వేసారిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ నేతలు నిజాయితీతో పనిచేయాలని కోరుకుంటున్నట్టు ఆమె వెల్లడించారు.

రాజ్‌కోట్‌పై అంతులేని నిర్లక్ష్యం

● మృతుల సంఖ్య కూడా వెల్లడించని యంత్రాంగం

● బీజేపీ ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం

● 33కు చేరిన మృతుల సంఖ్య

● సుమోటాగా స్వీకరించిన హైకోర్టు



రాజ్‌కోట్ : గుజరాత్‌లో రాజ్‌కోట్‌లోని గేమ్‌జోన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై బీజేపీ ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యంతో వ్యవహరించిందని, సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరిగిందని బాధితుల బంధువులు వాపోతున్నారు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగితే ఎంతమంది చనిపోయారన్న విషయాన్ని కానీ, ఎంత మంది గాయపడ్డారన్న వివరాలను కానీ ప్రభుత్వ యంత్రాంగం అధికారికంగా వెల్లడించపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. స్థానిక మీడియా మాత్రమే బాధితుల వివరాలను వెల్లడించింది. ఈ ఘోర ప్రమాదంలో 33 మంది సజీవ దహనమయ్యారని, మరో 15 మంది ఆచూకీ తెలియరాలేదని స్థానిక మీడియా పేర్కొంది. కాగా ఘటనా స్థలాన్ని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం పరిశీలించారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

ఎన్‌ఓసీకి కూడా దరఖాస్తు చేయలేదు : ఎఫ్ఐఆర్‌లో పోలీసులు

ఈ ప్రమాదానికి సంబంధించి ఆరుగురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. టీఆర్‌పి గేమ్‌జోన్ యజమాని యువ్‌రాజ్ సింగ్ సోలంకి, మేనేజర్ నితిన్ జైన్‌ను అరెస్టు చేశారు. ఆరుగురిపై ఐపీసీ సెక్షన్లు 304, 308, 336, 338, 114 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, వీరిలో ఇద్దరిని అరెస్టు చేశామని, ఇతరుల కోసం క్రైమ్ బ్రాంచ్ అన్వేషిస్తోందని రాజ్‌కోట్ పోలీసు కమిషనర్ రాజు భార్గవ తెలిపారు. ప్రమాదం చోటుచేసుకున్న గేమింగ్ జోన్ అమ్యూజ్‌మెంట్ పార్కు నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని, కనీసం ఎన్‌ఓసీకి కూడా దరఖాస్తు చేయలేదని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. దాదాపు 2000 చదరపు మీటర్ల ప్లాటులో నిర్మించిన మూడు అంతస్తుల భవనానికి కానీ, అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక టిన్ రూఫ్ నిర్మాణాలకు కానీ ఎటువంటి ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు కూడా లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందో ఎఫ్ఐఆర్‌లోని అంశాలు తెలియజేస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వం సీనియర్ పోలీస్ అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించిన సంగతి తెలిసిందే. ప్రమాదంపై 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని సిట్‌ను ఆదేశించింది.

దోషులను కఠినంగా శిక్షించాలి..

ఈ ఘోర ప్రమాదానికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని, ఎవ్వరినీ ఉపేక్షించరాదని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఒక చిన్నారి తండ్రి ప్రదీప్ సిన్హా చౌహాన్ డిమాండ్ చేశారు. దోషులకు మరణశిక్ష విధించాలని, ఎవ్వరికీ బెయిల్ మంజూరు చేయరాదని, ఒక వేళ బెయిల్ ఇస్తే తానే ఆ దుండగులను చంపేస్తానని ఆయన ఆక్రోషంతో అన్నారు.

ఈ ప్రమాదంలో ప్రదీప్ తనయుడుతో పాటు మరో నలుగురు కుటుంబ సభ్యులు కూడా ప్రాణాలు కోల్పోయారు.

మున్సిపల్ యంత్రాంగం ఏం చేస్తోంది..

ప్రయివేటు సంస్థ నిర్వహిస్తున్న ఈ క్రీడా ప్రాంగణం నాలుగేండ్ల కిందట నుంచి పని చేస్తోంది. అయితే ఇక్కడ అగ్ని ప్రమాదాల నివారణలకు సరైన ఏర్పాట్లు ఉన్నాయా? లేదా అనే విషయాన్ని స్థానిక అధికారులు ఎవ్వరూ నిర్ధారించడం లేదు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏం చేస్తున్నారు? దీనికి సంబంధించిన ఇతర ఏజెన్సీల మాటేమిటి? అని రాజ్‌కోట్‌కు చెందిన మరో నివాసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



మానవ తప్పిద విపత్తు : హైకోర్టు

ఈ ఘోర ఘటన మానవ తప్పిదం వల్ల జరిగిన విపత్తు అని గుజరాత్ హైకోర్టు ఆదివారం ఉదయం పేర్కొంది. ఈ ప్రమాద ఘటనపై హైకోర్టు సుమోటాగా విచారణకు స్వీకరించింది. ఈ నెల 27న దీనిపై జస్టిస్ బీరెన్ వైష్ణవ్, జస్టిస్ దేవన్ దేశాయితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇలాంటి అమ్యూజ్‌మెంట్, గేమింగ్ జోన్ సంస్థలు తప్పనిసరి ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ వంటి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఈ కేసును సుమోటాగా స్వీకరిస్తూ ధర్మాసనం పేర్కొంది.

ఈ సందర్భంగా అహ్మదాబాద్, వడోదర, సూరత్, రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన న్యాయవాదులు అందరూ తమ ముందు సోమవారం విచారణకు హాజరు కావాలని, ఇలాంటి సంస్థల నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఇచ్చారో తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది.

నాడు అచ్ఛేదిన్.. నేడు..?

(మొదటిపేజి తరువాయి)

విజయాలు, అభివృద్ధి, కార్యక్రమాలను చెప్పుకుంటూ ప్రచారం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ, మోడీ వాటిని పక్కనపెట్టేసి..ఇండియా ఫోరంను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. పాకిస్తాన్‌లో పార్థనలు చేస్తున్నారనో..ముజ్రాలు చేస్తున్నారంటూ ప్రధాని హెూదాను మరిచి చేస్తున్న వ్యాఖ్యలు ఓటర్లలో స్పందన రావటంలేదు. దీనికి తోడు బీజేపీ పాలనలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాల పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. 2014కు ముందు కేంద్రంలో అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. దానికి తోడు 'అచ్ఛేదిన్' అనే నినాదంతో ప్రధాని అభ్యర్థిగా మోడీ ప్రచారం చేశారు. అలాగే, '56 అంగుళాల ఛాతీ, పాకిస్తాన్ – చైనా వంటి దేశాలను శత్రు దేశాలుగా చిత్రీకరించి ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన పుల్వామా దాడి, ఆ తర్వాత బాలాకోట్‌పై భారత సైన్యంతో ఎదురుదాడి చేపించామని అప్పటి మోడీ సర్కారు తీవ్రంగా ప్రచారం కల్పించుకున్నది. 'జాతీయ భద్రత' అనే అంశం తెరపైకి వచ్చింది. దీనికి అధిక ప్రచారాన్ని కల్పించిన మోడీ సర్కారు.. ప్రజల్లో భావోద్వేగాన్ని రగిలించి కేంద్రంలో వరుసగా రెండోసారి అధికారాన్ని చేపట్టిందని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు అంటున్నారు. ఈసారి అలాంటి అవకాశాలేమీ లేకపోవడంతో ఏమి తోచని బీజేపీ.. ఎప్పటిలాగే కాంగ్రెస్‌పై ఎదురుదాడి, ఆ పార్టీలో గతంలో జరిగిన విషయాలను దేశానికి వ్యతిరేకంగా జరిగాయని చూపించటం, 'మోడీ కీ గ్యారెంటీ' అని చెప్పటంతోనే సరిపెట్టుకుంటున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా, నెహ్రూ, ఇందిరా గాంధీ ప్రధానులుగా ఉన్న సమయంలో తీవ్రమైన తప్పులు చేశారని మోడీ ఎదురుదాడికి దిగుతున్నారని గుర్తు చేస్తున్నారు.

ప్రధాని స్థాయిలో పూటకోమాటతో మోడీ చెబుతున్న తీరుపైనే సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడు పదుల వయస్సు దాటాక... చెప్పిందే మర్చిపోయే గుణం వస్తుందని, ఇప్పుడు మోడీ మీట్ ది ప్రెస్‌లో అదే చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మోడీకి భయం పట్టుకున్నదనీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందేమోనన్న అనుమానంతోనే ఆయన టార్గెట్ '2047' ను పెట్టుకున్నారని అంటున్నారు.

"ఇండియా" అధికారంలోకి రాగానే ఎంఎస్‌పీ

● ప్రభుత్వ రంగ సంస్థల్లో 30 లక్షల ఉద్యోగ ఖాళీలు

● పట్టించుకోని మోడీ, అమిత్ షా

● పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే పంటలకు చట్టబద్ధంగా కనీస మద్దతు ధరను కల్పిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భరోసానిచ్చారు. రాబోయే రోజుల్లో రైతుల కష్టానికి తగిన ఫలితముంటుందని తెలిపారు. ఆదివారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మొగ అసెంబ్లీ నియోజకవర్గంలోనిర్వహించిన పలు సభల్లో భట్టి విక్రమార్క మాట్లాడారు. బీజేపీ పాలనలో వరి, పత్తి, చెరకు పంటలకు మద్దతు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాని మోడీ రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి వారికి నష్టం చేయాలని చూశారనీ, కానీ రైతులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. దేశంలోని నిరుద్యోగ యువతకు అప్రెంటిషిప్ హక్కు కల్పిస్తూ...కొత్త చట్టాన్ని తీసుకొస్తామన్నారు. తద్వారా పట్టభద్రులు, డిప్లమా హోల్డర్లకు ప్రయోజనం చేకూరుతున్నదని చెప్పారు. దేశంలోని పబ్లిక్, ప్రయివేటు సంస్థల్లో సుమారు 30 లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయని చెప్పారు.

శేషేంద్ర ఒక ఉషస్త్సార



- ఆచార్య బన్న ఐలయ్య
919949106968

'గుంటూరు శేషేంద్ర శర్మ 21వ శతాబ్దపు ఉషస్త్సార' అని విమర్శకులు నిర్ధారించడం వెనక చాలా విషయాలు దాగి ఉన్నాయి. ఆధునిక తెలుగు కవిత్వం 20వ శతాబ్ది తొలిపాదంలో ప్రారంభమైంది. మూడు దశాబ్దాలు అది నవ్య కవిత్వంగా భావకవిత్వంగా మహోజ్వలంగా వెలిగింది. నూతన పదబంధాలు, నవ్యమైన భాష, అభివ్యక్తుల కొత్తదనంతో ఈ కాలపు కవిత్వం తెలుగు సాహితీ సీమను అలరించింది. క్షీణ ప్రబంధ గ్రీష్మం తెలుగు తోటలోకి ప్రవేశించాక ఆకులు రాలి, మొగ్గా, పువ్వు లేక తోట మొత్తం శోభను ఎలా కోల్పోతుందో, అట్లాగే ఆ కాలమంతా తెలుగు సాహితీ తోట కళావిహీనమై పోయింది. గురజాడ, రాయప్రోలుల రాకతో ఒకవైపు దృక్పథం, మరొకవైపు సౌందర్యవంతమైన విలక్షణ కవితా పార్శ్వాలు ఏకకాలంలో బయలుదేరాయి. దీంతో కాంతులు కోల్పోయిన తోట, బీడులు వారిన తెలుగు సాహితీనేల ఒక్కసారి పుష్పించి, ఫలించింది. ఈ తేజోవంతమైన నేల ఎందరెందరో కవులుగా సృష్టించింది.

శేషేంద్ర సూక్ష్మదృష్టి కలవారు. సులభగ్రాహ్యి. తన కాలంనాటి వర్తమాన కవులపై కొంచెం పెద్ద కవులపై వారు వెలిబుచ్చిన అభిప్రాయాలు సరియైనవే. వారి దృష్టిలో 'రాయప్రోలు' రెండవ నన్నయ్య; గురజాడ - గొప్ప ద్రష్ట, స్రష్ట, ప్రజాశ్రేయోభిలాషి; కృష్ణశాస్త్రి - రొమాంటిక్ కవి; తిలక్ కాలం నోట్లో పడకుండా మిగిలే చంద్రబింబం; శ్రీశ్రీ - అభ్యుదయ కవిత్వోద్యమ రూపు రేఖలు విస్పష్టంగా గీసినకవి; విశ్వనాథ - భావ కవిత్వాన్ని చాపగా చుట్టి సంప్రదాయక సముద్రంలో పడేసిన కవి. ఇంకా జాషువా, బోయిభీమన్న, కుందుర్తి, దాశరథి, ఆరుద్ర, సినారె, కాళోజి మొదలైన వాళ్ళ స్థానాలను నిర్ణయించాడు శేషేంద్ర. తెలుగు కవితా కన్య కిరీటంలో పొదిగిన మేలిమి రత్నాలే వీరి కవితలు. కాని బంగారాన్ని రత్నాన్ని విడదీసి వాటిని స్పష్టంగా తూకం వేసి దేని విలువను దానికే కట్టారు శేషేంద్ర.

ఈ దృష్టితో చూసినపుడు మిలీనియం తరువాత ఎంతమంది తెలుగు కవులుగా మిగులుతారు? అనే ప్రశ్న ఉదయించింది శేషేంద్రకి. ప్రాచీన సాహిత్యంలో ఒక అరడజను, ఆధునిక సాహిత్యంలో ఒకరిద్దరే మిగుల్తారనే ధ్వని వారి అభిప్రాయంలో గోచరిస్తుంది. ఈ ఒక్కరిద్దరికి మరొకరిని చేరిస్తే శేషేంద్రనే చేర్చవచ్చని ఆయనందించిన కవితా ప్రమాణాలే చెబుతాయి.

ఆయన నూతన కవితా సిద్ధాంతాన్ని చెప్పిన స్రష్ట. భారతీయ సాహిత్యానికి నూత్న దిగ్దర్శనం ప్రసాదించిన యుగప్రవర్తకుడని దేశమంతా ఆయన్ని గౌరవించింది. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ తరువాత ఆసియా ఖండంలో మరో సాహితీకారునికి నోబెల్ పురస్కారం లభించలేదు. కనీసం ప్రవేశం కూడా లభించలేదు. ఈ గౌరవం ఒక్క శేషేంద్రకే దక్కింది. ఇది తెలుగు సాహిత్యానికి దక్కిన అపూర్వ గౌరవమే. ఇది నూటికి నూరుపాళ్ళు సత్యం అనేది సాహితీ ప్రపంచం ఒప్పుకుంది. ఎందుకు శేషేంద్ర కవిత్వానికీ ప్రత్యేకత. ఆయన కవితా వస్తువు కొత్తదా? కాదు, పాతదే. ఆ వస్తువు అభ్యుదయ విప్లవ కవిత్వాల తానులోని ముక్కలే! వ్యాస, వాల్మీకి, కాళిదాసు, భవభూతి, బోదలేర్, మల్లార్మే వంటి వారే కాకుండా, అరిస్టాటిల్ ప్లేటో లాంటి ప్రాచీన గ్రీకు తాత్వికుల ప్రభావం శేషేంద్ర కవిత్వంపై వుంది. ఎమర్సన్, గోర్కి, మాయకోవస్కీల కమ్యూనిస్టు వివేచనుల; భామహుడు, అభినవగుప్తుల లాంటి భారతీయాలంకారికుల; 20 శతాబ్ది ఆర్థికవ్యవస్థపై, సాహిత్యంపై పెను ప్రభావం వేసిన కారల్‌మార్క్స్‌ల ప్రభావం శేషేంద్ర కవిత్వంపై ఉంది. ఇలా వారి కవిత్వంపై, విమర్శపై వీరందరి ప్రభావం ఉంది. తమకున్న పాండిత్యం, ప్రతిభ, అనుభవంలో వీటిని సర్వం రంగరించి కవితాగొంతులో పోసి ఒక విలక్షణ కావ్య మార్గానికి బంగారు వాకిళ్ళు తీసాడు శేషేంద్ర.

కమ్యూనిజాన్ని ఆదర్శంగా తీసుకున్నాడు. వర్గవ్యవస్థ నిర్మూలనకు మార్క్స్ చెప్పిందే పరిష్కారమన్నారు. ఈ సమాజంలో నిస్వార్థంగా మార్పును కోరుకునేవారు ముగ్గురే అన్నారు శేషేంద్ర. వారు ఋషి, తాత్వికుడు, కవి. శేషేంద్ర కవి, యుగకవి, యుగద్రష్ట, అందుకే ఈ యుగాన్ని ప్రభావితం చేసిన తన ఆధునిక మహాభారతం కావ్యాన్ని వ్యాసభారతంతో పోలుస్తూ ఇలా అన్నాడు. "వ్యాసభారతం ప్రాచీన ప్రజలకోసం పుట్టింది. ఇది ఉత్తరభారతదేశంలో పుట్టింది. ప్రాచీన భారతం పండిత భాషలో పుట్టితే, ఆధునిక భారతం ప్రజల భాషలో పుట్టింది. తొలుత వ్యాసభారతం ఎనిమిదివేల శ్లోకాలు గల 'జయం' అనే ఇతిహాసం. ఆధునిక భారతం ఎనిమిది సర్గలు గల 'నాదేశం - నా ప్రజలు' అనే ఇతిహాసంగా అంకురించింది. అది భూమికోసం జరిగిన యుద్ధమే. అక్కడ ఉన్నత కుటుంబాలు భూమిని హస్తగతం చేసుకోవడానికి యుద్ధం చేస్తే, ఇక్కడ ప్రజానీకం భూమిని హస్తగతం చేసికోవడానికి యుద్ధం చేస్తారు. వ్యాసభారతంలాగే ఇది కూడా క్రమంగా పెరిగి బృహద్గ్రంథం అయ్యింది. దానిలాగే ఇదీ ఒక ఇతిహాసము, పురాణం, మహాకావ్యము, పారాయణగ్రంథము, పుణ్యప్రదం, వర్గ చైతన్యం జ్వలింప చేయడమే ఇక్కడ కావ్య హృదయం" అని శేషేంద్ర స్పష్టం చేసారు. దీన్ని బట్టి నిస్సందేహంగా శేషేంద్ర కవిత్వం పేదల పక్షపాతని తేలింది.

"ఎవరు ఏడవగలరు/ మరొకడికోసం?/ నీకోసం ఏడ్చేవాడికి/ నువు ఋణగ్రస్తుడివి/ మార్క్సుకు ఈ శతాబ్దపు అన్నార్తులందరూ ఋణగ్రస్తులు?"

ఇలా మార్క్స్ గొప్పతనాన్ని, మాతృదేశ మహత్యాన్ని శేషేంద్ర గుర్తించాడు. 1940 నుండి శేషేంద్ర వరకు ఇలాంటి కవిత్వం రాసినవారులేరేమో!

శేషేంద్ర ప్యూర్ పోయెట్రీ కాన్సెప్ట్...

ప్యూర్ పోయెట్రీ కాన్సెప్ట్ శేషేంద్ర ప్రవేశపెట్టినప్పటి నుండే తెలుగు కవిత కొత్త శోభతో వెలుగొందింది. ఒకప్పుడు గురజాడ, రాయప్రోలు తరువాత శ్రీశ్రీ, ఆ తరువాత మళ్ళీ శేషేంద్రయే ఈ మార్గంలో వచ్చినట్లు కన్పిస్తుంది. వస్తువు ఎలాంటిదైనా పరవాలేదు దానిలో కవిత్వ భాష ఉండాలి. నినాద ప్రాయమైన కవిత్వాన్ని రాజీపడ్డట్టు కూడా కన్పించదు. కవిత్వంలో అయస్కాంత శబ్దాలుండాలి. అవి పాఠకుడిని ఆకట్టుకుంటాయి. పాఠకుడి హృదయంలోకి చొచ్చుకుపోయే భాష కవితలో ఉంటే ఆ కవిత్వం దీర్ఘకాలం మనగలుగు తుందంటాడాయన. ఇతరేతర కారణాల వల్ల ఆ కవిత్వానికి ఆదరణ లభించిన (అంటే వర్తమాన, రాజకీయ, సామాజిక శక్తుల బలం చేతిలో సాహిత్య శక్తి బలం పరాజితమైనా) తరువాత కాలంలో అది అస్తిత్వాన్ని కోల్పోతుందంటారు శేషేంద్ర. ఈ ప్యూర్ పొయెట్రీ భావన నిరుపయోగమైంది కాదు. సామాజిక నిబద్ధత కలిగిందే. సామాజిక నిబద్ధత కలిగిన కవిత్వానికి ఏ ప్రయోజనం ఉంటుందో దీనికీ అదే ప్రయోజనం ఉంటుంది. ఇది కేవలం ఆనందం కోసం కాదు. దీనికొక మహత్తర లక్ష్యం ఉంది. అది వ్యవస్థ మార్పు కోరుతుంది. సామాజిక బాధ్యత నుండి వైదొలగకుండానే, కవిత్వంలో సౌందర్యాత్మకమైన మార్పును కోరుతుంది. తన కవిత్వం గూర్చి శేషేంద్ర - నా కన్నుల మీద వాలిన సీతాకొకచిలుకలే నా కవితలు అని సౌందర్యవంతంగా చెబుతాడు. తన కవితా సంపుటాల్లోని ఏ పేజీని తెరిచినా ప్రతివాక్యం చాలా సౌందర్యాత్మకంగానే గోచరిస్తుంది. ఉదాహరణకు కొన్ని -

"కవిత్వం ఎర్రరంగులా వరుగెత్తుకు వస్తుంది/ రక్తంలో మునిగిన బాణంలా వీరుడి విడిచిన ప్రాణంలా-/ నేనొక చెమట బిందువుని కండల కొండల్లో/ ఉదయించే లోకబంధువుని/ వేళ్ళు కాళ్ళయి నడిచే చెట్టు మనిషి/ చెట్టుగా ఉంటే ఏదాదికొక వసంతమైనా దక్కేది/ మనిషినై పుట్టి అన్నీ వసంతాలు కోల్పోయాను."

ఇలాంటి సామాజిక ప్రయోజనం, సౌందర్యాత్మకమైన మేళవింపుతో ఉన్న వాక్యాలెన్నో వారి కవిత్వంలోంచి ఎత్తి చూపవచ్చు.

శేషేంద్ర కవితాభివ్యక్తి...

అభివ్యక్తిలో నవ్యత అంత హఠాత్తుగా రాదు. ఏ కవి అయినా తన సహజ ప్రతిభ చేత మాత్రమే గొప్పవాడు అవుతాడా? కాదు. కాలేదు. తన కాలం నాటి సాహిత్య ఉద్యమాల ప్రభావం, ప్రయోగాల మూలంగా కవి ఎదిగి వస్తాడు. శేషేంద్ర కూడా మండేసూర్యుడు, నాదేశం నా ప్రజలు, గొరిల్లా కాలం నాటి సాహిత్య ఉద్యమాల ప్రభావం చేతనే, ప్రయోగాల వల్లనే కవితలో నవ్యాభివ్యక్తి సాధించాడు. దీనికంటే పూర్వమే 'రాయప్రోలు తొలకరి ఉపమలు తెలుగు నేలమీద వెదజల్లిన రాగరాగిణుల్లో తడిసి తెలుగు కవిత్వభాషా స్వరూపమే మారిపోయింది" అని శేషేంద్ర నొక్కి చెప్పాడు. రాయప్రోలు సృష్టించిన ఐంద్రజాలిక రచనా ప్రపంచం తత్పూర్వం తెలుగులో లేదని ఘంటాపథంగా చెప్పాడు. రాయప్రోలు సృష్టించిన నవ్యపదాలు, పదబంధాలు నూతనాభివ్యక్తిలో భాగమే. రాయప్రోలు స్ఫూర్తితో స్వీయ ప్రతిభా వ్యుత్పత్తులతో అద్భుతమైన నవ్యాభివ్యక్తిలో కవిత్వం రాసిన వాళ్ళు లేకపోలేదు. ఆ తరువాత శ్రీశ్రీ రాకతో తెలుగులో కొత్త వస్తువు, దృక్పథం వచ్చి చేరాయి. శ్రీశ్రీ అభ్యుదయ, విప్లవ కవితల్లో దృక్పథాలను ఒకదాని తరువాత ఒకటిని ప్రవేశపెట్టి తన దృక్పథ నిబద్ధతను చాటుకున్నాడు. ఆయన విప్లవ కవితకు సరిపోయే భాషను అందించలేకపోయాడని విమర్శకులు గుర్తించారు. అభివ్యక్తిలో మాత్రం కొంత నూతనత్వం కన్పించింది. ఇంతకు కొంచెం ముందు నారాయణబాబు కవితాభివ్యక్తిలో నవ్యతను చూపించే ప్రయత్నం చేశారు.

కావ్యభాష పరిణామంలో కొన్ని పాతబడ్డ, అరిగిపోయిన పదాలను పరిహరించడం, కొత్తపదాలను సమకూర్చడంతో ప్రారంభమవుతుందనేది నిర్వివాదాంశం. ఈ పరిణామం దానికి హేతువైన ఉద్యమ శక్తిని, బలాన్ని ఆశ్రయించి నెమ్మదిగానో, వేగంగానో ప్రవర్తిస్తుంది. గతానుగతికంగా సాగుతున్నపుడు, తీవ్ర ఉద్యమ ప్రేరణ లేదనకుండా ఈ మార్పు చాలా నెమ్మదిగా సాగుతుంది. సాహిత్య వివేచనలో సుప్రసన్న గారు. అయితే ఈ మార్పుకు కారణం ఆ కాలంలోని ప్రతి కవి అనుకోకూడదు. సాహసవంతులైన కొద్దిమంది కవులు మాత్రమే ఇందుకు దోహదకారులవుతారు. ఆ కొద్దిమందిలో శేషేంద్ర ముందు వరుసలో ఉంటాడు. అయితే శేషేంద్ర నూతనాభివ్యక్తిని చూపుతూనే అనుభూతి సాంద్రత కోసం విశేషంగా ప్రయత్నించాడు. ఈ ప్రయత్నం మొగ్గ పువ్వులా వికసించినంత సహజంగా ఉంది. భావ పుష్కలత ఉన్న కవి కనకనే అనుభూతి సాంద్రత ఆయన కవిత్వంలో ఎక్కువగా ఉంది. 'అకవిత్వం' సాహితీ వీధుల్లో ఊరేగుతుంటే శేషేంద్ర మనస్తాపం చెంది-

"కవులు పాడుతున్నారు/ ఉపమానాల్ని పీడించి/ వీధులు ఏడుస్తున్నాయి/చేతులు జోడించి" - అన్నాడు.

కవిత్వం సతతం వర్ధిల్లాల్సిందే. కవులు ప్రజాచైతన్యం కోసం కృషి చెయ్యాల్సిందే; ఉత్తేజవంతులను చెయ్యాలి కూడా. తత్ కాలంలో ప్రజా సమస్యలే ఎజెండాగా కవిత్వం వచ్చినా, ఆకట్టుకునే కవిత్వం ఆవిర్భవించట్లేదని శేషేంద్ర బాధపడ్డారు. కవుల రచనా ఘోష కవులను చేరకపోతే దాని సార్థకత ఏమిటి? 'వీధులు ఏడుస్తున్నాయంటే' సమస్యలు సమస్యలుగానే ఉన్నాయన్నట్టేకదా! "నా కష్టసుఖాల బరువులు మోసుకుంటూ ఈ భూమి మీద వేసిన అడుగులన్నీ అన్వేషణ చేసిన తప్పటడుగులు, అభివ్యక్తికోసం చేసిన ప్రయత్నం" (సముద్రం) అంటాడు శేషేంద్ర. జీవించడానికి మనిషి ఎంత శ్రమ చేస్తాడో, అంతే శ్రమ ఫలితం అనుభవిస్తాడు వ్యక్తి. అంటే శ్రమను బట్టి ఫలితం. మంచి కవిత్వం కోసం 'సాధన-పరిశ్రమ' అవసరమే. కవి గొంతెత్తితే భూగోళం దద్దరిల్లాలి. కవి సృష్టించే శబ్దానికి వాక్యానికి అంత బలముండాలి.

"నదులు కవులు భూగోళపు రక్తనాళాలు/ నదులుం ప్రవహిస్తాయి కవితల్లా/ పశువుల కోసం పక్షుల కోసం మనుష్యుల కోసం"

ఒక దేశ సంస్కృతి నాగరికతల వికాసంలో కవిపాత్ర విస్మరింపరానిది. ఒక దేశపు జీవనంలో కవిపాత్ర పునాదిగతమైంది. అతను సృష్టించే భావ విద్యుత్పూరిత వాతావరణంలోంచే మానవీయకావ్యం పుడుతుంది.



ఆ మానవీయ కావ్యం ఇతిహాసమైనా ఆశ్చర్యం లేదు. "శేషేంద్ర పంక్తులు ఊహాశిల్పాలు కావు. అవి మనుష్యుల చేతనతో మునిగి ఉన్న నాగరికతలకు అభివ్యక్తులు" అన్నా అతిశయోక్తి లేదు.

కవికి, నదికి స్వార్థమెక్కడిది. నది ఇతరుల కోసం ప్రవహిస్తుంది. కవి సమాజహితం కోరి సృజన చేస్తాడు. మంచి కవిత్వం రాసే కవుల ప్రభావం సమాజంపై ఎంతో ఉంటుంది.

"ఒక అందమైన పోయెం అంటే/ దానికి ఒక గుండె ఉండాలి./ అది కన్నీరు కార్చాలి/ పీడితుల పక్షం వహించాలి"

పీడితులను చూసి స్పందించే కవికి గుండె నిండా ఆర్ద్రత ఉంటుంది. ఆర్ద్రత లేకపోతే కంట్లో కన్నీటి చుక్కకు స్థానమేది? ఆ కన్నీటి క్రోధమే బలహీనుడు బతకడానికి విశ్వాసాన్నిస్తుంది. విశ్వాసమున్న వాడే బతుకాటలో విజయఢంకా మోగించగలడు. సామాన్యుడిని మాన్యుడిని చేసే కవిత్వం సార్వకాలీనంగా, సార్వజనీనంగా మన గలుగుతుంది. ఇలాంటి కవిత్వం సృష్టించిన కవులే కాలాన్ని జయించారు. దేశకాలాల సరిహద్దుల్ని చెరిపేసి ఖండఖండాతరాలకు మధ్య మానవతా వంతెనలు నిర్మించి చిరంజీవులయ్యారు. లూషన్, హెూమర్, గోర్కి, కుప్రిన్, టాల్‌స్టాయ్, క్రిష్టోఫర్ కాల్డ్‌వెల్, మాయాకోవస్కీ, ఠాకూర్, ప్రేమ్‌చంద్, శ్రీశ్రీ శేషేంద్ర ల్లాంటి కవులకు సంకుచిత సరిహద్దులు, భాషాభేదాలున్నాయా? "మరణించేలోపుగా తనమాట చెప్పలేని నిస్సహాయ మానవుడి గొంతు పేరే కవి" - అని శేషేంద్ర అన్న మాటలు కవులందరి పక్షం వహించి పలికినట్లుగానే ఉన్నాయి. కవి మాత్రం తన వేళ్ళను ఇక్కడే ఉంచి విశ్వాంతరాల్లోకి దూసుకుపోతాడు శేషేంద్రలా!

కృషీవలుడు - కవి ఇద్దరూ సృష్టికర్తలే. శ్రమజీవులే. ఒకరి శ్రమ మన క్షుధ్బాధను తీరిస్తే, మరొకరి శ్రమ క్షోభను తీర్చి హృదయాన్ని జీవితాన్ని రాగరంజితం చేస్తుంది. వీరిద్దరు లేకపోతే ధరిత్రి ఎలా ఉంటుందో శేషేంద్రయే చెప్పాడు.

"ధరిత్రిని హలం దున్నితే/ అప్పుడు అవుతుంది./ అది ఒక దేశం/ ధరిత్రిని కలం దున్నితే/ అప్పుడు అవుతుంది ఒక ఇతిహాసం"

ఇలా హలం - కలం. కృషీవలుడు - కవి ఆశయాన్ని ఔన్నత్యాన్ని కవి విశేషంగా తీర్చిదిద్దారు.

"కాలాన్ని నా కాగితం చేసుకుంటూ/ దానిమీద లోకానికి ఒక స్వప్నం రాసి ఇస్తా/ దాన్ని ఒక మహత్తర శిల్పంగా చెక్కి భూమి మీద నిలబెడతా"

అన్న శేషేంద్ర ఆదర్శంలో సమాజ వికాసం, మానవతాపథంలో పరుగులు తీయాలన్న ధ్యేయం ప్రస్ఫుటమవుతుంది.

కవి అంటే ఎవడు? నీలా నాలా ఉన్నవాడే కవి. మనకు లాగే ఆకలి దప్పులున్న మనిషే. అందరి కాళ్ళకిందా భూమే ఉంది. అతడు ద్వంద్వాల కతీతుడేం కాదు. ఇలాంటి సామాన్యుడే భూగోళం పై నిలిచి కేకలేస్తే ధ్రువాలెందుకు అదిరిపడుతున్నాయ్ అదే కవి ప్రత్యేకత. ఆయన శబ్ద శక్తి, అర్థయుక్తి అట్లాంటిది.

"నేనింతా ఒక పిడికెడు మట్టినే కావచ్చు/ కానీ కలమెత్తితే నాకు/ ఒక దేశం జండాకున్నంత పొగరుంది"

కవి అంటే కోటానుకోట్ల ప్రజలగొంతు. కవి భావాలు, స్పందనలు, ఆర్భాటాలు, హక్కులు, అనుభూతులన్నీ కవితారూపంలో ఆకాశమంత ఎత్తుగా నిలుస్తాయి.

"ఒకనాడు నా శరీరం/ అంతర్ధానమవుతుంది/ అప్పుడు మీకు నా వాక్యాల్లోనే/ దర్శనమిస్తాను".

మానవాళి శ్రేయస్సును కోరిన ఎందరో కవులు నేడు విగతజీవులు. వారి కవితా వాక్యం, సజీవం శేషేంద్రలాగే. ఆ వాక్యాలే వాస్తవాలై ప్రతిధ్వనులై ప్రతి తరంలో మోగుతుంటాయి. స్ఫూర్తినిస్తుంటాయి. కవులను అజరామరం చేస్తాయి.

తెలుగుదేశంలో కవిత్వం మరీ పలుచనైపోవడం శేషేంద్రకు నచ్చలేదు. కవి కావాలనుకునేవాడు నిజమైన కవుల జీవితం చదివి తీరాలని శాసిస్తాడు. మంచి కవిత్వం రాయడానికి కవులు తమ జీవితాల్ని ఎంత ధ్వంసం చేసికున్నారో తెలుసుకోవాలంటాడు. అందుకే కవి కావాలనుకునేవాడి నుద్దేశించి శేషేంద్ర - 'బోదిలేర్ జీవితం చదువు, రేంబో జీవితం చదువు, వాల్మీకి జీవితం చదువు తెలుస్తుంది కవిత్వం ఎలా వుట్టిందో. ఏ బాధ లేకుండా జీవన విధానంలో ఏ మార్పులేకుండా కనీసం అధ్యయనం కూడా లేకుండా మంచి కవిత్వం పుట్టదని' శేషేంద్ర అంటాడు. నిజమైన కవులు తయారుకావాలంటే అందుకు జీవితాన్ని మరోలా మలుచుకోవాలంటాడు. కవితాసృష్టికిది ముఖ్యం అంటాడు. మనిషి మారడమే కవిత్వానికి జన్మస్థానమని, మంచికవిత్వం జీవితపు వీధుల్లో దొరుకుతుందంటాడు.

"పువ్వుల్లో లేని స్వర్గం/ పురాణాల్లో ఉంటుందా?/ చేతుల్లో లేని సుఖం/ జండాల్లో ఉంటుందా?"

అని ప్రశ్నించే శేషేంద్ర 'సాహసం' మనిషికి కవచం కావాలంటాడు. అప్పుడే దేశంలో అంధకారం పారిపోతుందంటాడు.

"మృత్యువులో కూడా నేను/ ఝంఝూ మారుతాన్ని/ నా కవిత్వం మనిషికి/ కేవలం ఒక డిఫెన్సు"

ఇదీ శేషేంద్ర కవిత లక్ష్యసాధన. ఇలా ఎన్నో అంశాలు ఆయన కవిత్వానికి వస్తువులుగా అమరి ఔన్నత్యాన్ని "మనిషికి డిఫెన్సు" గా పలికించాడు. ఆయన అభివ్యక్తి ఆగామి కాలాన్ని ఆవరించి ఉంది. అన్ని వర్గాల కవులు దాన్ని ఆత్మీయంగా హత్తుకున్నారు. బలమైన గొంతుతో వెలుగొందుతున్నారు. ఇది శేషేంద్ర కవిత్వానికున్న శక్తి. ఆ శక్తే అనేక శ్రమరూపాలుగా సంకేతింపబడ్డాయి.

"నా దేశపు స్త్రీలకు రంగురంగుల కలలుకనే నూలుతో కోకలల్లి, సీతకోకచిలుకల్ని చేస్తా/ జీవన సీమల్లో ఎగురవేస్తా/ రస్తాలువేస్తా కలల్లోకి/ భవనాలు కడతా మబ్బుల్లోకి/ ప్రాణాలతో నా దేశపు సరిహద్దుల/ కుద్యాలు లేపుతా శత్రువుల గుండెల్లోకి/ నావలు చేస్తా సముద్రాల్లో విడుస్తా/ నా దేశపు జండాలెగరేస్తూ/ పొందని పంపిస్తా/ రూపాలిచ్చి గొంతులిచ్చి/ శిలల్ని నిశ్శబ్దాల్లోంచి విడుదల చేస్తా/ నేను మానవ జీవిత పొలాలన్నీ దున్నుతా"

దేశంలోని అన్ని రంగాలకు సంబంధించిన చింతన చేసిన కవి శేషేంద్ర. జీవితంలోని మానసిక, భౌతిక రంగాలను లక్షిస్తూ కవిత్వం రాసారు. పై కవితలోని వాక్యాలే నేడు తెలుగు కవిత్వంలో వివిధ పార్శ్వాలుగా విస్తరించాయి. ఈ విస్తరణలో శేషేంద్ర కంటే పూర్వ పార్శ్వాలున్నాయి. తరువాత ప్రాదుర్భవించినవీ ఉన్నాయి. అయితే శేషేంద్రంత అందంగా చెప్పడం తరువాత తరువాత జరిగిన మార్పు. కవి ఈ దేశ సరిహద్దు దాటి విశ్వ విహారం చేయడంలో ఆశ్చర్యమేముంది. అందుకే ఆయన కవిత్వం ప్రపంచ భాషల్లోకెళ్ళింది. సంకుచిత భాషా, సరిహద్దులను పటాపంచలు చేసింది. అందుకే విమర్శకులు శేషేంద్రను 21 శతాబ్దపు ఉషస్త్సారని అన్నారు.

(మే 30వ తేదీన శేషేంద్ర శర్మగారి వర్ధంతి సందర్భంగా)

> తెలుగుదేశంలో కవిత్వం మరీ పలుచనైపోవడం శేషేంద్రకు నచ్చలేదు. కవి కావాలనుకునేవాడు నిజమైన కవుల జీవితం చదివి తీరాలని శాసిస్తాడు. మంచి కవిత్వం రాయడానికి కవులు తమ జీవితాల్ని ఎంత ధ్వంసం చేసికున్నారో తెలుసుకోవాలంటాడు. అందుకే కవి కావాలనుకునేవాడి నుద్దేశించి శేషేంద్ర - 'బోదిలేర్ జీవితం చదువు, రేంబో జీవితం చదువు, వాల్మీకి జీవితం చదువు తెలుస్తుంది కవిత్వం ఎలా పుట్టిందో. ఏ బాధ లేకుండా జీవన విధానంలో ఏ మార్పులేకుండా కనీసం అధ్యయనం కూడా లేకుండా మంచి కవిత్వం పుట్టదని' శేషేంద్ర అంటాడు.

ఇక్కడి పుస్తకాల్లో అక్షరాలుండవు



నేను కిటికీ దగ్గర నిలుచుంటే
చందమామ మబ్బుల్లో దాక్కుంటుంది
కురులు ముఖం మీద వదిలితే
ఉదయమే పొద్దు గూకుతుంది

రాయకూడదు ఇక్కడ పాడాలి
కాలి పట్టాల్లో, నత్తు మెరుపుల్లో
ఆట చూడాలి, పాట వినాలి
స్వప్నానికీ, మరణానికీ
సరి హద్దు లేదు

త్యాగానికీ, ప్రేమకీ తేడా లేదు
ఇక్కడి పుస్తకాల్లో అక్షరాలుండవు
కళ్ళల్లో కవిత్వముంటుంది
మునిగే ధైర్యముంటే
అడుగున జీవితం తగులుతుంది

- ఆశారాజు, 9392302245

(భన్సాలీ 'హీరామండీ' సిరీస్, మనీషా కోయిరాలు నేనూ, నా కొన్ని ఫీలింగ్స్)

శ్రమ జీవన పతాకం



పట్నం రహదారి పక్కన ఓ ఒంటి స్తంభం
అలసిపోయి సాగిలపడుతున్న ఆమె దేహానికి
అదొక ఊతం
తన ఒడి వాకిట నాలుగు పాత బస్తాలు
సరికొత్త నేలమాళిగలు అవి
వాటి నిండుగా ఎందరో
కరివేపాకులా వదిలించుకున్న ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు
అవే ఈరోజు ఆమెకు దొరికిన లంకెబిందెలు
తన ఆకలి పొట్టకు అన్నం మెతుకులు
చుట్టూ జోరీగల సంగీతం
ముసురుకుంటున్న దోమల సయ్యాటలు
వర్ణనలకందని వాసన
దేనితోనూ సంబంధం లేదు ఎవరితోనో పోలిక లేదు
ఆమెకు ఆమెనే రాణి
రాలుతున్న చెమట చుక్కలే ఆమెకు ఓదార్పు
చెరగని బతుకు చిత్రానికి ఆమె ఓ నమూనా
ఒక్కో కాగితాన్ని వంగి వంగి ఏరుకొని సంచి నింపుకుంటుంది
ఏరుకున్న ప్రతిసారి ఆమె ముఖంపై నక్షత్రాలు మొలుస్తాయి
అంతస్తుల మీద అంతస్తులు కట్టినంత ఆనందం ఆమెకే సొంతం
ప్రత్యేక ఎక్సర్ సైజులతో అక్కరే లేని ఆమె
శ్రమ జీవన పతాకం
రాజ్యానికి రాజెవరైనా కానీ రోడ్లన్నీ ఆమెవే
రిజిస్ట్రేషన్ ఆఫీసు మెట్లతో పని లేదు
వాడి పడేసిన వస్తు స్థానాలన్నీ ఆమె పని కేంద్రాలు
డంపింగ్ యార్డ్ ఆమె కేరాఫ్ అడ్రస్
పిచ్చి కాగితాలతోనే ఆమె సహజీవనం
పచ్చకాగితాలకు బదులు పిచ్చి కాగితాలను చూసి
మురిసిపోయే ఆమెకు రిచ్ నెస్ ఓ వెక్కిరింత
ఆమె అలాగే ఉంటుంది ఎన్ని కాలాలు మారినా
ఎన్ని విధానాలు వచ్చినా ఆమె అలాగే ఉంటుంది
మార్పులేని జీవితానికి మార్పులేని పదానికి పచ్చి ఉదాహరణ
ఆమె అలానే ఉంటుంది గలీజే సిగ్గుపడేటట్లు
వ్యర్థాలు ఉన్నన్ని రోజులూ
మనిషితనం కంపు కొడుతున్నన్ని రోజులు
ఆమె అట్లాగే ఉంటుంది ఉండనిద్దాం!!
కవితా వస్తువులు కథా వస్తువులు
పేదరికానికి కొలమానాలు కావాలి కదా!!
ఓటు నడుక్కునే నాయకులకు
ఎప్పటికప్పుడు వాగ్దాన సంతకాలు చేయడానికి
బ్రతుకులు కొన్ని మిగిలే ఉండాలి కదా! ఉండనిద్దాం!!


- డాక్టర్ ఉప్పల పద్మ, 9959126682

చిత్తలూరీలు

పచ్చని పిడికిళ్లెత్తి
నేలను తడిపిన ఆకాశానికి
జయజయ ధ్వానాలు
పలుకుతున్నాయి మొలకలు

పేదరికమంటే వానకూ గిట్టదు
గుడిసె కన్నాల్లోంచి దూరి
గుండెల మీద పొడుస్తోంది

వానకే వివక్షా లేదు
ఆరుబయట అందర్నీ
సమానంగా తడుపుతోంది



వాన వెలిశాక పిల్లల సంబరం
అంబరాన్ని తాకింది ఏడు రంగులై

వెళితే వెళ్లింది ఈ కన్నీళ్ల వానకేదైనా
గొడుగునిచ్చి వెళితే బాగుండు

- చిత్తలూరి

వర్తన నాలుగవ సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నాలుగవ సమావేశం ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఇందులో 'తెలంగాణ నవల తీరుతెన్నులు' అనే అంశంపై కాసుల ప్రతాపరెడ్డి ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి గుడిపాటి, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ హాజరవుతారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

'గజల్ పారడైజ్' ఆవిష్కరణ సభ

ఇనుగుర్తి లక్ష్మణాచారి వ్యాస సంపుటి 'గజల్ పారడైజ్' ఆవిష్కరణ సభ జూన్ 1వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది. ఈ సభలో ఏనుగు నరసింహారెడ్డి, డా॥బి.బాలకృష్ణ, కె.ఆనందాచారి, అనంతోజు మోహన్‌కృష్ణ, డా॥పోతగాని సత్యనారాయణ, తెల్లాకుల కోటేశ్వరరావు, డా॥తిరునగరి శరత్‌చంద్ర, కనపర్తి శ్రీదేవి, సయ్యద్ ముజాహిద్ అలీ, ఇనుగుర్తి భాగ్యలక్ష్మి, కుసుంబ నిత్య, ఆదిమల్ల జాహ్నవి పాల్గొంటారు.

శీలావీ పురస్కారాల ప్రదానం

శీలావీ సాహిత్య చిత్రకళావేదిక ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి మొదటి అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్లో లేపాక్షి, అజంతా ఎల్లోరా, కోణార్క్, రామప్ప శిల్ప చిత్రాలతో కూడిన 'శీలావీ శిల్పరేఖలు' ఆవిష్కరణ ఉంటుంది. అదే సభలో '1818' దీర్ఘ కవిత రాసిన కవి పుప్పాల శ్రీరాంకి, ఆర్టిస్ట్ అన్వర్‌కి శీలావీ పురస్కారాలు అందజేయనున్నారు. కె శివారెడ్డి, డా ఎన్ గోపీ, వాడ్రేవు చినవీరభద్రుడు, నాళేశ్వరం శంకరం, మామిడి హరికృష్ణ పాల్గొంటారు.

- శీలా సుభద్రాదేవి

వాసా ఫౌండేషన్ కథలపోటీ ఫలితాలు

సాహితీకిరణం సౌజన్యంతో వాసా ఫౌండేషన్ 'జాతీయ సమైక్యత' అనే అంశంపై నిర్వహించిన కథలపోటీ ఫలితాలు.. తమసోమా జ్యోతిర్గమయా (దుద్దుంపూడి అనసూయ), అరాచకం (పి.సత్యప్రకాశరావు). 5 ప్రత్యేక బహుమతులు, 1. ఒకే పథం- ఒకే గమ్యం, 2. మనమంతా భారతీయులమే, 3. అమ్మా నన్ను క్షమించవా!, 4. జననీ జన్మ భూమిశ్చ- ఆర్.సి.కృష్ణస్వామిరాజు, 5. శాంతి సమీర. జూన్ 6వ తేది సాయంత్రం హైదరాబాద్ శ్రీత్యాగరాయ గానసభలో వాసాఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తారు.

జాషువా సాంస్కృతిక వేదిక, మేడే రచనల పోటీ ఫలితాలు

మేడే సందర్భంగా నిర్వహించిన రచనల పోటీ ఫలితాలు వెలువడ్డాయి. విజేతలు వరుసగా కవితల విభాగంలో... 1. క్షేత్రం (డా॥ దారల విజయకుమారి), 2. మేడే జెండా (కంచరాన భుజంగరావు), 3. శ్రమ గొలుసు (సోమిశెట్టి వేణుగోపాల్), 4. కన్నీటి చుక్కల సిరాతో (పొత్తూరి సీతారామరాజు), 5. సర్కార్ కంప (చిత్తలూరి సత్యనారాయణ). కథల విభాగంలో :1. మాసిపోని మరకలు (సయ్యద్ గఫార్), 2. హిందూసితాహమారా (కె.ఆనందాచారి), 3. ధింసా చేమంతి (ఎల్.శాంతి), 4 జీవితపు ఖరీదు (వాడపల్లి పూర్ణ కామేశ్వరి). 5. తల మనిషి (బట్టిపాటి జైదాస్). పాటల విభాగంలో... 1. మేడే దీపం (పావెల్), 2. నిరుపమైన జెండా (సంపటం దుర్గా ప్రసాద్), 3. లేవరా రైతన్న (రావెళ్ళ శ్రీనివాసరావు), 4.నేడే మేడే (కుడికాల వంశీధర్), 5. మేడే (బి.గోవర్ధనరావు). జూన్ నెలలో బహుమతి ప్రదాన సభ విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుంది.

- జి.నారాయణరావు

ప్రభుత్వాల విధానాల రూపకల్పనలో నిపుణులను భాగస్వామ్యం చేయాలి

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వీ.రమణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వాల విధానాల రూపకల్పనలో సంబంధిత రంగాల నిపుణులను భాగస్వాములను చేయాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వీ.రమణ సూచించారు. బ్యూరోక్రాట్ల ద్వారా మాత్రమే విధానాలను రూపొందించడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లో అందరూ సమానమే అని చెప్పినట్టుగానే మధుమేహం ధనిక, పేద తదితర తేడాలేమీ లేకుండా అందరికీ వస్తున్నదని తెలిపారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు, జన్యుకారకాలు తదితర కారణాల వల్ల రోజు రోజుకూ డయాబెటీస్ పెరుగుతున్నదని చెప్పారు. డయాబెటీస్ బారిన పడిన వ్యక్తి మాత్రమే కాకుండా, ఆ వ్యక్తి కుటుంబం, సన్నిహితులు, సమాజంపైనా ప్రభావం చూపిస్తున్నదని తెలిపారు. ఈ వ్యాధిబారిన పడిన వారిలో పట్టణ ప్రాంతాల్లో ప్రతి నెలా రూ.10 వేల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.8 నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. పైపెచ్చు ఆ వ్యక్తి పని దినాలను కోల్పోవడం, ఉత్పాదకత కూడా తగ్గుతున్నదని వివరించారు. డయాబెటీస్ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. ప్రభుత్వాలు, వైద్య, పారామెడికల్ సిబ్బంది సంయుక్తంగా ప్రచారం చేపడితే మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచించారు. ఆసియాలోనే భారతదేశంలో డయాబెటీస్ బారిన పడిన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధి విస్తరించకుండా పౌష్టికాహారలోపం, పర్యావరణ సమతుల్యత, సామాజిక, ఆర్థిక సమస్యలను కూడా పరిష్కరించే దిశగా ప్రయత్నాలు కొనసాగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. పేదలకు చవకగా ఆరోగ్య సదుపాయాలు అందేలా చూడాలని కోరారు.

డయాబెటీస్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని వైద్యులను రమణ కోరారు. రివర్స్ డయాబెటీస్ పేరుతో పాజిటివ్ హెూమియోపతి లాంటివి ప్రచారం చేస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.

18 ఏండ్లు దాటినవారిలో 30 శాతం : డాక్టర్ మోహన్

హైదరాబాద్‌లో 18 ఏండ్లు దాటిన వారిలో 30 శాతం మందికి మధుమేహం ఉంటుందని డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ చైర్మెన్ అండ్ చీఫ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ వి.మోహన్ తెలిపారు. దేశంలో పట్టణ ప్రాంతాల్లో 16.4 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 8.9 శాతం, మొత్తంగా 11.4 శాతంగా ఉందని ఐసీఎంఆర్ చేసిన సర్వేను ఉదహరించారు. 101 మిలియన్లకుపైగా ఇప్పటికే డయాబెటీస్ బారిన పడగా, మరో 136 మిలియన్ల మంది ప్రీ డయాబెటీస్ దశలో ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో 12.3 శాతం ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో 6.1 శాతం, మొత్తంగా 9.9 శాతంగా ఉందని తెలిపారు. తక్షణం దీన్ని నివారించేందుకు చర్యలు పెద్దఎత్తున చర్యలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ బి.కె.సహాయ్‌కు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మెన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ చైర్మెన్ కె.సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల మద్దతు ధరలపై బీజేపీ దగా

- శాస్త్రీయత లేకుండా వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెంపు
- స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు సవరణలు
- రైతు సంక్షోభానికి మోడీ సర్కార్ విధానాలే కారణం : వెబినార్‌లో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త అల్దారి జానయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మద్దతు ధరలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ అల్దాఫ్ జానయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "పంటల మద్దతు ధరల్లో శాస్త్రీయత ఎంత?" అనే అంశంపై నిర్వహించిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. సరళీకృత మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారుల మేరకు మద్దతు ధరలు దేశంలో ఇప్పటికీ అమలు కావడం లేదని వ్యాఖ్యానించారు. 2014లో అధికారంలోకి వచ్చేందుకు స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు చెల్లిస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. ఉత్పత్తి ఖర్చు, రైతుల సేవలతో పాటు రెంటల్ తదితర వ్యయాలకు అదనంగా 50 శాతం జోడించి మద్దతు ధర నిర్ణయించాలని కమిషన్ సూచిస్తే కేవలం మొదటి రెండింటిని మాత్రమే బీజేపీ సర్కార్ అమలు చేసిందని విమర్శించారు. మద్దతు ధర విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానంలో శాస్త్రీయత పూర్తిగా లోపించిందని గుర్తు చేశారు. ఫలితంగా గత పదేళ్లలో మద్దతు ధర 6 నుంచి 7 శాతం పెరిగితే, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, కూలీలు, డీజిల్ తదితర వస్తువుల ధరలు 16 నుంచి 20 శాతం పెరిగాయని తెలిపారు.

స్వామినాథన్ సిఫారసుల మేరకు పెంచితే ప్రస్తుతం వరికి క్వింటాలుకు రూ.2,183గా ఉన్న మద్దతు ధర రూ.3,160కి పెరిగేదని గుర్తు చేశారు. బీజేపీ సర్కార్ చేసిన నిర్వాకం వల్ల రైతులు ఎకరానికి దాదాపు వెయ్యి వరకు నష్ట పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ, రైతు సంక్షోభాన్ని నివారించాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడం, విద్య, వైద్య రంగాలను పూర్తిగా పబ్లిక్ సెక్టార్‌లో నడపడం, రైతులకు సబ్సిడీలను విరివిగా అందించడం లాంటి చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు.

అలాగే వ్యవసాయ సంబంధిత ఉత్పత్తి పరిశ్రమలకు ప్రోత్సాహకాలను అందించాలని పేర్కొన్నారు. ఆలిండియా కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ పంటల మద్దతు ధరను నిర్ణయించడంలో మోడీ సర్కార్ శాస్త్రీయత పాటించడం లేదని విమర్శించారు. కమిషన్ ఆఫ్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైజెస్(సీఏసీపీ) సిఫారసులకు అదనంగా 50 శాతం వ్యయాన్ని జోడించాల్సి ఉండగా, వాటిని తగ్గించి మొక్కుబడిగా ఏటా వంద, యాభై పెంచుతున్నారని ఆరోపించారు. ప్రముఖ ఆర్థిక వేత్త గులాటి మాటల్లో చెప్పాలంటే దేశంలో ప్రతి ఏటా 18 లక్షల కోట్ల టన్నుల పంట మార్కెట్‌కు వస్తుండగా 4 లక్షల కోట్ల టన్నుల పంటను మధ్య ధళారులు లూటీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వెబినార్‌కు ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

- సంఘీభావ సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యుద్ధం ప్రపంచ మానవాళికి పెనుప్రమాదమనీ, వ్యాపార కాంక్షతో యుద్ధోన్మాదులు చేస్తున్న దాడులను ఖండించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో ఆలిండియా తంజీమ్ ఈ ఇన్సాఫ్ (ఐఎన్ఎస్ఏఎఫ్) ఆధ్వర్యంలో 'పాలస్తీనాలో కాల్పుల విరమణ చేయాలి' అనే అంశంపై ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ అజీజ్‌పాషా అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ టెర్రరిజం పేరుతో ఇజ్రాయెల్, పాలస్తీనాపై దురాక్రమణకు పాల్పడటం దారుణమన్నారు. ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితి సూచనలను కూడా అతిక్రమించి ఆస్పత్రులు, చిన్నపిల్లలను లక్ష్యంగా చేసుకుని మూకుమ్మడి దాడులు చేస్తూ, హత్యలకు పూనుకోవడం శోచనీయమన్నారు. భారతదేశానికి ప్రధాన మంత్రులుగా పని చేసిన వారందరూ పాలస్తీనాతో మంచి సంబంధాలను కొనసాగించారని గుర్తు చేశారు. మోడీ వచ్చిన తర్వాతే ఆ దేశంతో సంబంధాలను సవ్యంగా కొనసాగించడం లేదని విమర్శించారు. పాలస్తీనాపై దుష్ప్రచారం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మానవత్వం మరిచి ఇజ్రాయెల్ పాలస్తీనాకు ఆహారం, వైద్యం అందకుండా చేస్తూ తన రాక్షసత్వాన్ని చాటుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అజీజ్‌పాషా మాట్లాడుతూ పేద దేశాలపై అగ్రరాజ్యాలు యుద్ధాలను రుద్దడం ఆపివేయాలన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దురాగతాలను, దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి నిబంధనలను గాలికొదిలేసిన పెద్ద దేశాలు.. పేద దేశాలను బలితీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యుద్ధాలను ఆపేసి పాలస్తీనా ప్రజలకు ఆహారం, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పాషా డిమాండ్ చేశారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ అమెరికా లాంటి అగ్రదేశాలకు కీలుబొమ్మగా మారిన ఇజ్రాయెల్, వారి యుద్ధకాంక్షకు అనుకూలంగా అమాయక ప్రజలను హత్యలు చేయటం అనాగరికమని విమర్శించారు. నగరాలను, పౌరులను లక్ష్యంగా చేసుకుని అది విధ్వంసం సృష్టిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇజ్రాయెల్ తమ యుద్ధాన్ని ఆపాలనీ, శాంతి కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా తంజీమ్ ఇ ఇన్సఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండి ఫయాజ్, మునీర్ పటేల్, సయ్యద్ జలాలుద్దీన్, ఉస్మాన్ హాలీ హజారే, అహ్మద్ ఖాన్, సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి

- తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకాన్ని చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 26,804 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఔట్ సోర్సింగ్ సర్వీస్ పర్సన్స్(స్కావెంజర్)ను తొలగించి ఆ బాధ్యతలు స్థానిక గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు చేపట్టాలని గత ప్రభుత్వం ఆదేశించిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అనేక కారణాల చేత ఈ నిబంధన ఆచరణ సాధ్యం కావడం లేదని తెలిపారు.

ప్రజా పాలనలో పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అభివృద్ధి పనులతో పాఠశాలలు కొత్త శోభను సంతరించుకోబోతున్న సందర్భంలో స్కావెంజర్ల నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అవతార పురుషుడుగా మోడీ గొప్పలు

- ఉత్తర భారతదేశంలో బీజేపీకి తగ్గనున్న ఓట్లు : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



నవతెలంగాణ-మహబూబాబాద్

అవతార పురుషుడిగా మోడీని దేవుడే భూమి మీదకు పంపారని మోడీ, బీజేపీ గొప్పలు చెప్పుకుంటోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గునిగంటి రాజన్న అధ్యక్షతన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నాగయ్య మాట్లాడారు. దేశంలో నిర్వహిస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ భయం నుంచే బీజేపీ, మోడీ దిగజారి హిందువులను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఉత్తర భారతదేశంలో బీజేపీ గణనీయంగా సీట్లు కోల్పోతుందని, బీజేపీ గ్రాఫ్ తగ్గుతుందన్నారు. వామపక్ష పార్టీలు అనేక స్థానాలు గెలిచి బలమైన శక్తిగా పార్లమెంట్‌లోకి రాబోతున్నాయన్నారు. తెలంగాణలో బీజేపీ కలలు కన్నట్టు, స్థానాలు పెరిగే అవకాశం లేదని తెలిపారు, హిందువులను రెచ్చగొట్టి ఓట్లు, సీట్లు పెంచుకునే ప్రయత్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ చాలా బలహీనపడే అవకాశం ఉందని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విద్యావంతులు, మేధావులు, వామపక్ష వాదులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు, సూర్నపు సోమయ్య, అల్వాల వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, బానోత్ సీతరామ్, దుడ్డెల రామ్మూర్తి, కుర్ర మహేష్, మండ రాజన్న, కుంట ఉపేందర్, ఎం.పాపారావు, గునిగంటి మోహన్, బానోత్ హరి నాయక్, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం.., కుళ్లిన కోడిగుడ్లు..

- జీజీహెచ్‌లో రోగులకు పంపిణీ
- సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి..





నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆస్పత్రులకు వెళ్లేది అనారోగ్య సమస్యలతోనే.. అందులోనూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారంటే బయట ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు డబ్బులు చెల్లించే స్థోమత లేనివారే. అలాంటి వారు బయట అన్నం కొనలేని పరిస్థితులూ ఉండొచ్చు. అలాంటి వారికి ఇబ్బందులు ఉండకూడదనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ఆరోగ్య శ్రీ రోగులకు, వారి వెంట వచ్చే ఒకరికి భోజనం అందించే సదుపాయం కల్పించింది ప్రభుత్వం. మరి ఆ భోజనం నాసిరకంగా, పురుగులతో అందిస్తే..? ఉన్న రోగాలతోపాటు కొత్త రోగాలు సంక్రమించే అవకాశం ఉంది. ఇదే పరిస్థితి నిజామాబాద్ జిల్లా జీజీహెచ్ ఆస్పత్రిలో చోటుచేసుకున్నది.

నిజామాబాద్ జిల్లాలో కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యం కోసం జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల వారు వైద్యం చేయించుకునేందుకు వస్తుంటారు. అయితే ఆరోగ్య శ్రీ కింద రోగులకు అందజేస్తున్న భోజనంలో పురుగుల అన్నం, కుళ్లిన కోడిగుడ్లు వస్తున్నట్టు పలువురు రోగులు ఆరోపిస్తున్నారు. చికిత్స పొందుతున్న రోగులకు పౌష్టికాహారం అందించాల్సి ఉన్నా.. అందుకు విరుద్ధంగా అందజేస్తున్నారని రోగుల బంధువులు వాపోతున్నారు. పురుగుల అన్నం, కుళ్లిపోయిన కోడిగుడ్లు వస్తున్నాయని వాటిని ఫోటోలు దించి సోషల్ మీడియాలో పెట్టగా.. వైరల్‌గా మారాయి. ఇప్పటికైనా ఇటువంటి పరిస్థితులు రాకుండా జీజీహెచ్ యంత్రాంగం సరైన చర్యలు తీసుకొని, చికిత్స పొందుతున్న వారికి సరైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సోషల్ మీడియాలో పలువురు కోరుతున్నారు.

మేడిగడ్డలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

- ఏడవ బ్లాకులో మరింత కుంగిన పిల్లర్లు
- ఎగువ, దిగువ భాగంలో ఏర్పడ్డ బోరియలు



నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనుల్లో రోజుకో సమస్య ఏర్పడి అధికారులను ఇబ్బంది పెడుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ గతేడాది కుంగుబాటుకు గురయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కుంగుబాటుపై విచారణ చేపట్టి సమస్యలపై నిపుణుల సలహాల మేరకు పునరుద్ధరణ పనులు చేపట్టింది. ఈ సందర్భంగా బ్యారేజీ ఈఈ తిరుపతిరావు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీలోని ఏడవ బ్లాకులోని 17, 18, 19, 21 గేట్లను పూర్తిగా తొలగించాలన్నారు. ఎన్‌డీఎస్‌ఏ అధికారుల సూచనల మేరకు పనుల నిర్వహణలో భాగంగా ఆదివారం ఏడో బ్లాకులో వెల్డింగ్ పనులు చేపట్టి గేట్లను తొలగించినట్టు తెలిపారు. బ్యారేజీ గేట్ల దిగువన సీసీ బ్లాక్‌ల పనులు నిర్వహిస్తున్నారన్నారు. 7వ బ్లాక్‌లో నీటి ప్రవాహం రాకుండా కాపర్ డ్యామ్ నిర్మించి నీటిని మళ్లిస్తున్నట్టు, షీట్ ఫైల్స్‌కు సంబంధించి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. బోర్వెల్ సహాయంతో బొరియలు ఎంత మేరకు ఏర్పడ్డాయో పరిశీలిస్తున్నామన్నారు. కాగా, జియో ఫిజికల్, జియో టెక్నికల్, టస్ట్‌ల అనంతరం పూర్తి మరమ్మతులు చేపట్టాలని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ ఫిల్లర్లు కుంగడంతో నీటిని నిలువ చేసే పరిస్థితి లేదని ఎన్‌డీఆర్ఎస్‌ఏ నిపుణుల బృందం సూచించింది. దాంతో మొదటి దశ కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి జరగాల్సి ఉంది. ప్రాణహిత నది ద్వారా వచ్చిన ప్రవాహం గోదావరిలో కలిశాక నీటిని ఎత్తిపోయాలి.. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని నిల్వచేసే అవకాశం లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జియో ట్యూబులను ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, మేడిగడ్డ పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వారం రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్టు సమాచారం.

ధరలు బహు ప్రియం..!

మహబూబాబాద్ జిల్లాలో భూముల రేట్లకు రెక్కలు

- గజం రూ.5000 నుంచి రూ.50వేల వరకు..
- అందని ద్రాక్షగా పేదల కల



నవతెలంగాణ-మహబూబాబాద్

'ఇల్లు కట్టి చూడు.. పెండ్లి చేసి చూడు' అని పెద్దలు ఊరికే అనలేదు. ఈ రెండింటికి ప్రధానంగా కావాల్సింది ఒకటి భూమి, రెండవది బంగారం. పాలకవర్గాల పుణ్యమా అని ఈ రెండు వస్తువులు సామాన్య, మధ్యతరగతి పేదలకు అందని ద్రాక్షగా మారాయి. ఈ దశాబ్ద కాలంలో బంగారం, భూముల ధరలు ఏకంగా 500 శాతం పెరిగాయని విశ్లేషకుల అంచనా. దశాబ్ద కాలం కిందట గజం భూమి రూ.200 నుంచి రూ.300కు లభిస్తే నేడు వేలు, లక్షల్లో పలుకుతోంది. ఇక బంగారం 2014లో తులానికి రూ.15000 ఉంటే నేడు రూ.75 వేలకు చేరింది. దీంతో సామాన్య ప్రజలకు భూములు, బంగారం అందని ద్రాక్షగా మారాయి. ఇందుకు మహబూబాబాద్ జిల్లానే నిదర్శనం.

జిల్లా వ్యాప్తంగా 3.20 లక్షల ఎకరాల సాగు భూములు, 1.80 లక్షల మంది రైతులు ఉన్నారు. జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా గజం రూ.5000 మొదలు కొని రూ.50వేల వరకు పలుకుతోంది. ఇక సాగుభూములు ఎకరం రూ.50 లక్షలకు పైనే ఉంది. దాంతో మహబూబాబాద్ జిల్లాలో సామాన్యుడు ఇల్లు కట్టాలంటే తక్కువలో తక్కువ రూ.50 లక్షలు ప్లాటుకు, రూ.50 లక్షలు గృహ నిర్మాణానికి మొత్తంగా రూ.కోటి ఉంటే తప్ప ఇల్లు కట్టలేని పరిస్థితి నెలకొంది. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 15,893 దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా రూ.36,51,71,000ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. మహబూబాబాద్ పట్టణంపై ఖమ్మం, ఇల్లందు, కొత్తగూడెం, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్‌తో పాటు ఇతర దేశాల్లో నివాసమున్న ఎన్నారైలు కన్నేసి అడ్డీకి పావుసేరుకు కొని అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. పదేండ్ల కిందట రూ.3లక్షలకు ఎకరం కొన్న భూమి నేడు రూ.50 లక్షలు పలుకుతోంది. 2014కు ముందు రూ.200, రూ.300కు గజం కొనుగోలు చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక భూముల ధరలకు రెక్కలు వచ్చి.. ఈ రోజు రూ.20,000 నుంచి రూ.30,000 పలుకుతోంది. 2014కు ముందు ఉన్న అసైన్‌మెంట్ కమిటీలు రద్దు చేయడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. కమిటీలు ఉన్నపుడు నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యే చైర్మెన్‌గా ఆర్డీవో కన్వీనర్‌గా ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సభ్యులుగా అసైన్డ్ కమిటీలు ప్రతినెలా సమావేశమై ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు, సాగు భూములుగా పంపిణీ చేసేవారు. కేసీఆర్ హయాంలో అసైన్‌మెంట్ కమిటీలను ఎత్తివేశారు. అరకొరగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లనూ ఎమ్మెల్యేలు, మంత్రులు అమ్ముకున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో పేదలకు చెందిన భూములు సగానికి పైగా సంపన్నుల పేర్లపైకి మారిపోయినట్టు తెలుస్తోంది. దీనికి తోడు భూముల రేట్లు పెరగడం, రిజిస్ట్రేషన్ రుసుం పెరగడం పాలక విధానాలతో పేదల సొంతింటి కల కలగానే మిగులుతోంది.

సెంటు భూమి పంచని బీఆర్ఎస్, బీజేపీ

కేంద్రంలోని బీజేపీ., రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు పేదలకు సెంటు భూమి పంచిన దాఖలాలు లేవు. అంతకంటే ముందు కేంద్రంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో ఉన్న ప్రభుత్వాలు నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పేదలకు సాగుభూములు, ఇండ్ల స్థలాలు పంపిణీ చేసే ఆనవాయితీ కొనసాగింది. కానీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక భూ పంపిణీకి తిలోదకాలిచ్చింది. 2014 ఎన్నికలకు ముందు కేసీఆర్.. దళితులకు మూడెకరాల భూమి, ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తానని చెప్పి ఓట్లు దండుకుని, అధికారంలోకొచ్చాక విస్మరించారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్.. ప్రతి పేద కుటుంబానికి గృహానికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చింది.

ఈ వ్యాపారం వదిలి వేద్దామనుకుంటున్న : లాడినేని శ్రీధర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి



15 ఏండ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న. గతంలో నెలకు 5 నుంచి 10 ప్లాట్లు విక్రయించే వాడిని. నేడు మూడు నెలలకు ఒక ప్లాట్ కూడా అమ్మలేని పరిస్థితి ఉంది. గతంలో రూ.50, రూ.60 లక్షల పెట్టుబడి ఉంటే సరిపోయేది. రెండు మూడు ఎకరాలు కొనుక్కొని ప్లాట్లు చేసి ఇద్దరు ముగ్గురం కలిసి విక్రయించేవాళ్లం. నేడు ఎకరం కోటి నుంచి రెండు కోట్లు పలుకుతుంది. పెట్టుబడి పెట్టలేని పరిస్థితి నెలకొంది. కొనుగోలుదారులు కూడా ముందుకు రావడం లేదు.

16 ఏండ్ల నుంచి పని చేస్తున్నా ఇంటి స్థలం లేదు : ఎండీ ఉస్మాన్, కార్మికుడు



పొట్ట చేత పట్టుకొని మానుకోటకు వలస వచ్చాను. పదహారేండ్లుగా హమాలీ, భవన నిర్మాణ కార్మికునిగా, అడ్డా కూలీగా పనిచేశాను. 100 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుందాం అంటే డబ్బులు సరిపోని పరిస్థితి నెలకొంది. ఏటేటా పెరుగుతున్న ధరలతో భూములు కొనలేని పరిస్థితి ఉంది.

సైన్స్‌తోనే సమాజ పురోగతి

శాస్త్రీయతను నమ్ముదాం.. మూఢనమ్మకాలను తిప్పికొడదాం

- డిగ్రీ పట్టాలు కాదు ఆలోచనలు మెరుగవ్వాలి
- మహిళలు చైతన్యమవ్వాలి.. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొదించుకోవాలి : విజ్ఞాన దర్శిని, టీపీఎస్‌కే మహిళా వైజ్ఞానిక శిక్షణలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమాజ పురోగతి సైన్స్‌తోనే సాధ్యమనీ, దాని ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలను తిప్పికొట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలెన్ని పొందినా శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లకుండా మూఢత్వాలను నమ్మితే ఆ చదువులు వ్యర్థమన్నారు. భయమే బాణామతి అనీ, పిరికితనమే చేతబడి అని చెప్పారు. మహిళలు చైతన్యమై శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొదించుకోవాలనీ, అలాగైతే కుటుంబాన్ని, సమాజాన్ని మార్చే అవకాశముంటుందని నొక్కి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన దర్శిని, టీపీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో మాయలు, మహిమల గుట్టురట్టు చేసేలా మహిళలకు వైజ్ఞానిక వర్క్‌షాపును నిర్వహించారు.

బాబాలు, స్వామీజీలు ప్రజలను మూఢత్వంలో ముంచి ఉంచడానికి చేస్తున్న మాయలు, మహిమలను గుట్టురట్టు చేశారు. మహిళలు, చిన్న పిల్లలతో మండుతున్న హారతి కర్పూర బిల్లలను చేతిలో, నాలుకపై వెలిగించడం, సలసలకాలుతున్న నూనె నుంచి వేడివేడి బజ్జీలను తీయడం, నిప్పులపై నడవడం, మంటలతో ఆటలాడటం, నిమ్మకాయలతో గారడీ చేయడం, గాజుపెంకులపై నడవటం లాంటి 60 రకాల సైన్స్ విన్యాసాలను చేయించారు. వాటిలో దాగి ఉన్న సైన్స్‌ను విజ్ఞాన దర్శిని అధ్యక్షులు రమేశ్ చక్కగా వివరించారు. బాబాలు, స్వామీజీలు చేస్తున్న మోసాలను ఎండగట్టారు. మహిళల కోసం ప్రత్యేకంగా వర్క్‌షాపు పెట్టాల్సి వచ్చిన ఆవశ్యకతను వివరించారు. నిమ్మకాయ, పసుపు, కుంకుమ ఇంటిముందు వేసిపోతే చాలు భయపడే తత్వం ప్రజల్లో పెరిగిందన్నారు. మాయలు, మంత్రాలు లేవని స్పష్టం చేశారు. మూఢత్వంలో మునిగిపోతే సమాజ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మహిళల్లో మూఢత్వం ఉంటే పిల్లలపైనా, కుటుంబంపైనా రుద్దే ప్రమాదం ఉందన్నారు. సావిత్రీబాయి పూలే మహిళల విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కరోనా సమయంలో ఏ మాయమంత్రాలు పనిచేయలేదనీ, ప్రజల ప్రాణాలను కాపాడింది డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారిశుధ్యకార్మికులు అని ప్రశంసించారు. మూత్రం తాగే స్థితికి మూఢత్వం దిగజారుస్తున్న తీరును వివరించారు.

ఉన్నత విద్యను అభ్యసించిన వారు మూఢత్వాలను నమ్మడం దుర్మార్గమన్నారు. ప్రజలను విజ్ఞానవంతులను చేసేందుకు, శాస్త్రీయ ఆలోచనల దిశగా అడుగులు వేయించేందుకు తమ విజ్ఞాన దర్శిని కృషి చేస్తోందన్నారు. టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..సంఘపరివార్, అసాంఘిక శక్తులు మూఢనమ్మకాలను, విశ్వాసాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న తీరును వివరించారు. పసిహృదయాల్లో విషపూరిత ఆలోచనలను నింపుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుతున్న కొద్దీ విజ్ఞానం పెరిగి మూఢత్వ భావనలు తగ్గిపోవాలనీ, కానీ, దేశంలో అవి పెరిగిపోతున్నాయని వాపోయారు. ప్రతిఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ..అజ్ఞానం రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో విజ్ఞానానికి పునాదులు వేయాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. ప్రశ్నించే తత్వం ప్రజల్లో పెరగాల్సిన అవసరముందన్నారు. సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. వర్క్‌షాపులో అమ్మ నేత్ర శరీర అవయవ దాన అధ్యక్షులు ఈశ్వరలింగం, విజ్ఞానదర్శిని కోశాధికారి తులసీరామ్, శోభారాణి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

రోహిణి మొదలయ్యే..ఎండలు ముదిరే..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రోహిణి కార్తె మొదలైంది. ఎండలు ముదిరాయి. నిన్నటిమొన్నటి దాకా చల్ల ఉన్న వాతావరణం క్రమంగా వేడెక్కుతున్నది. పగటిపూట ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరువవుతున్నాయి. దీనికి ఉక్కపోత తీవ్రమవుతున్నది. జగిత్యాల జిల్లా జైనలో ఆదివారం అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు ప్రస్తుతం నమోదవుతున్న వాటి కంటే రెండు, మూడు డిగ్రీలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. సోమవారం రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే అవకాశమున్న నేపథ్యంలో టీఎస్‌డీపీఎస్ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆ జాబితాలోనిర్మల్,ఆదిలాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కొమ్రంభీమఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలున్నాయి. రాష్ట్రంలో ఆదివారం ఉదయం పూట ఎండ దంచికొట్టింది. అదే స్థాయిలో ఉక్కపోత ఉంది. సాయంత్రం సమయంలో మాత్రం పలుచోట్ల వర్షం కుసింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల వరకు 168 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. 24 ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అత్యధికంగా 3.78 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

జైన (జగిత్యాల)	46.5 డిగ్రీలు
బుద్దేశ్‌పల్లి-ధర్మపురి(జగిత్యాల)	46.1 డిగ్రీలు
బెల్లంపల్లి (మంచిర్యాల)	45.8 డిగ్రీలు
కమలాపూర్(పెద్దపల్లి)	45.7 డిగ్రీలు
నీరెళ్ల (జగిత్యాల)	45.6 డిగ్రీలు
ఐలాపూర్(జగిత్యాల)	45.6 డిగ్రీలు
లింగాపూర్(మంచిర్యాల)	45.2 డిగ్రీలు
అర్లి(టి)(ఆదిలాబాద్)	45.2 డిగ్రీలు
జూలపల్లి(పెద్దపల్లి)	45.1 డిగ్రీలు
జన్నారం(మంచిర్యాల)	45.0 డిగ్రీలు

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

నాగర్‌కర్నూల్	3.78 సెంటీమీటర్లు
చందంపేట(నల్లగొండ)	3.58 సెంటీమీటర్లు
రేవల్లి(వనపర్తి)	3.48 సెంటీమీటర్లు
కొత్తమొల్గర(మహబూబ్‌నగర్)	3.33 సెంటీమీటర్లు
ఘన్‌పూర్(నల్లగొండ)	3.18 సెంటీమీటర్లు
నర్వ(నారాయణపేట్)	3.15 సెంటీమీటర్లు
దన్వాడ(నారాయణపేట్)	3.15 సెంటీమీటర్లు
పాలెం(నాగర్‌కర్నూల్)	3.15 సెంటీమీటర్లు

ఈదురుగాలులతో అతలాకుతలం

(మొదటిపేజీ తరువాయి)

జరగలేదు.నల్లగొండ జిల్లాలోని గొల్లగూడ, పెద్దబండ, లెప్రసి కాలనీ, చండూరు మండలంలోని నెర్మెట గ్రామం.. మరికొన్ని చోట్ల తీవ్రమైన గాలి దుమారం వల్ల ఇండ్లు ధ్వంసమయ్యాయి. నెర్మెటలో ఇద్దరి ఇంటిపై కప్పులు లేచిపోయి, నాలుగు క్వింటాళ్ల బియ్యం తడిసింది. రాజీవ్‌కాలనీలో ఓ ఇంటి పై కప్పు లేచిపోయింది. వీటిని సీపీఐ(ఎం) మండల నాయకులు జెర్రిపోతుల ధనంజయగౌడ్ పరిశీలించారు. కొండాపురం గ్రామంలో ఇప్ప మల్లయ్య వ్యవసాయ బావి వద్ద ఐదు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బంగారుగడ్డ గ్రామంలో ఓ ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా లేచిపోయాయి. అదే గ్రామంలో విద్యుత్ స్తంభాలు తెగిపడ్డాయి. నల్లగొండ పట్టణం పెద్దబండలో దోరేపల్లి సైదులు, బోళ్ల బ్రహ్మయ్య, చెరుకు వెంకట కృష్ణ ఇండ్లు కూలిపోయి ఫ్రిడ్జ్, కూలర్ ధ్వంసమయ్యాయి. వారి ఇండ్లను సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి వారిని పరామర్శించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని పట్టణ కార్యదర్శి ఎండీ సలీం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దబండలో ఇంటి పైకప్పు రేకు ఎగిరిపడి ఇద్దరి తలలకు గాయాలయ్యాయి.. విద్యానగర్‌లో విద్యుత్ స్తంభం విరిగిపోయింది.

హైదరాబాద్‌లో బీభత్సం సృష్టించిన గాలివాన

హైదరాబాద్‌లో పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సష్టించాయి. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తున్నది. కీసర, ఘట్‌కేసర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల పిడుగులుపడ్డాయి. స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. హయత్‌నగర్‌లో ఉధృతంగా వీచిన ఈదురుగాలి వానతో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. రేకులు, గుడిసెల పైకప్పులు కొట్టుకుపోయాయి. మన్సూరాబాద్ డివిజన్ జాతీయ రహదారికి సమీపంలో ఇంద్రానగర్ కాలనీలో పెద్దపెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కొప్పుల



నర్సింహారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. కాలనీ వాసులందరూ ఎలాంటి భయభ్రాంతులకు గురి కావద్దని, అన్ని సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో కాలనీవాసులు బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి సమాచారం ఇచ్చారు. దాంతో ఆయన విరిగిన హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలను తొలగించాలని డీఆర్ఎఫ్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట పరిధిలోనూ ఈదురుగాలులు, నాగోల్, మన్సూరాబాద్‌లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఎల్‌బీనగర్, వనస్థలిపురంలో గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి ద్వారకమైనగర్, కమలానగర్, భూలక్ష్మీ నగర్, హైకోర్ట్ కాలనీ, సుభద్ర నగర్ కాలనీల్లో సహాయక చర్యలు చేపట్టారు. అత్యవసర సేవలకు డీఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్ - 9000113667, ఏఈ చంద్రశేఖర్ -7337364225, వర్క్ ఇన్‌స్పెక్టర్ - 9989977533, కరెంట్ ఆఫీస్ హయత్ నగర్ - 9490153577, 9490153588 సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడుగురు మృతి

ఈదురుగాలులతో కూడిన వర్షంతో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆరుగురు, మహబూబ్‌నగర్ జిల్లాలో ఒకరు మృతిచెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామ శివారులో కోళ్ల ఫారం నిర్మాణానికి వెళ్లిన ఆరుగురు కూలీలు పని ముగించుకొని నిర్మాణంలో ఉన్న గోడ పక్కనే కూర్చున్నారు. కాగా, అదే సమయంలో తీవ్రమైన ఈదురుగాలులు వీయడంతో ఒక్కసారిగా గోడకూలి కూలీలపై పడింది. నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. మరణించిన వారిలో ఇద్దరు మహిళలున్నారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో నాగర్ కర్నూల్ ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూరులో చెట్టు కూలి ఒకరు మృతిచెందారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, అతని కుమారుడు లక్ష్మణ్(13) ఆదివారం గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లోకి మేకలను మేపడానికి వెళ్లారు. వర్షంతో చెట్టుకిందకు వెళ్లి బాలుడు నిలబడగా.. చెట్టుపై పిడుగు పడటంతో బాలుని వద్ద ఉన్న సెల్‌ఫోన్ పేలి బాలుడి మృతిచెందాడు. తన కొడుకుకు ప్రమాదం జరగకూడదని చెట్టు కిందకు పంపిస్తే.. ప్రాణాలు పోయాయి కదా అని ఆ తండ్రి పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. విషయం తెలిసిన వెంటనే కొంతమంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తిమ్మాజీపేటలో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందారు.

గోడ కూలి నలుగురు మృతి

రంగారెడ్డి, ములుగు జిల్లాల్లో గోడ కూలి నలుగురు మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ సాయినగర్‌లో గాలి వాన బీభత్సానికి ఒక ఇంటి ప్రహరీ గోడ కూలి పక్కనున్న రేకుల ఇంటిపై పడింది. దాంతో ఇంట్లో నిద్రిస్తున్న చిన్నారి సమాద్ (3) మీద గోడ శిథిలాలు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే దారిలో నడుచుకుంటూ వెళ్తున్న రషీద్(45)పై ఇటుకలు పడి గాయలయ్యాయి. సమాచారం అందుకొని వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సమాద్, రషీద్ మృతిచెందారు.

ములుగు జిల్లా మండలంలోని క్షీరసాగర్‌లో కోళ్లఫారం గోడకూలి ఇద్దరు మృతిచెందారు. హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్టకు చెందిన భాగ్యమ్మ(40), మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపురంకు చెందిన గౌరీశంకర్(30) తమ కుటుంబసభ్యులతో కలిసి ములుగు మండలం క్షీరసాగర్ గ్రామానికి చెందిన తమ సమీప బంధువు విభూతి శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. అక్కడ బంధువులతో కలిసి పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో సమీపంలోని కోళ్లఫారంలోకి వెళ్లారు. గాలివానకు కోళ్లఫారం గోడలు కూలి వారిపై పడ్డాయి. దాంతో అక్కడికక్కడే భాగ్యమ్మ, గౌరీశంకర్ మృతిచెందారు. బంధువులు, కుటుంబసభ్యులకు గాయాలవ్వడంతో వారిని ఆస్పత్రికి తరలించారు.

చెట్టు పడి ఇద్దరు మృతి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలో ఈదురుగాలు, భారీ వర్షానికి తిమ్మాయిపల్లి-శామీర్‌పేట్ దారిలో చెట్టు కూలి ద్విచక్ర వాహనంపై పడటంతో ఇద్దరు మృతిచెందారు. ద్విచక్రవాహనంపై అటుగా వెళుతున్న నాగిరెడ్డి రామ్‌రెడ్డి, ధనుంజయపై చెట్టు పడగా.. రామ్‌రెడ్డి అక్కడికక్కడే మరణించారు. ధనుంజయకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఈసీఐఎల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. మృతులను యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం ధార్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు.

'డబుల్' ఇండ్లకు సౌకర్యాలు కల్పించాలి

- హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో కరెంట్, మంచినీరు, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2 బీహెచ్‌కే ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 2 బీహెచ్‌కే ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి. విజయ్ కుమార్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు ఇప్పటివరకు కరెంటు, మంచినీళ్ల, లిఫ్ట్ వంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. సౌకర్యాలు కల్పించకుండా ఇండ్లు ఇచ్చామని చెప్పుకుంటే పేదలు వాటిలో ఎలా ఉంటారని ప్రశ్నించారు. అన్ని సౌకర్యాలు కల్పించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. ముషీరాబాద్ జోన్ నుండి అహ్మద్ గూడలో కేటాయించబడిన వారికి కనీస వసతులు కల్పించి, లబ్ధిదారులకు ఇండ్లు అప్పగిస్తున్నారని, మిగిలిన ప్రాంతాల్లోనూ వెంటనే పనులు పూర్తి చేసి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 10 నాటికి ఈ కనీస సౌకర్యాల కల్పన ప్రక్రియ పూర్తవుతుందని ఆశిస్తున్నామని, లేనియెడల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సదస్సుకు హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం నాయకులు ఆర్.వెంకటేష్, కె.రమేష్, డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ. 30 కోట్లు బదిలీ

- 34 మంది ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జుల ఖాతాల్లోకి ఆ డబ్బులు
- ఈసీ విచారణ జరపాలి : రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ తన అధికారిక బ్యాంక్ ఆఫ్ బరోడా అకౌంట్ నుంచి 34 మంది ఇన్‌చార్జులకు రూ.30 కోట్లను బదిలీ చేసిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు బ్యాంక్ అకౌంట్ డిటైల్స్‌తో కూడిన లేఖను ఈసీకి, రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ అకౌంట్ నుంచి బదిలీ చేసిన డబ్బులను ఫ్రీజ్ చేయాలని ఈసీని కోరారు. లేకపోతే ఆ డబ్బులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల కొనుగోళ్లకు వాడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- గుంటూరు-సికింద్రాబాద్ మార్గంలో నిలిచిన పలు రైళ్లు
- దాహార్తి, ఉక్కపోతతో అల్లాడిన ప్రయాణికులు



నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం విష్ణుపురం జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. దాంతో ఆ మార్గంలో ప్రయాణించే జన్మభూమి, శబరి ఎక్స్‌ప్రెస్ సమీపంలోని స్టేషన్ల వద్ద నిలిపివేశారు. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన రైల్వే మార్గాన్ని మరమ్మతులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. గంటల తరబడి నిలిచిపోయిన ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు విష్ణుపురం రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో లూప్ లైన్ నుంచి మెయిల్ లైన్‌కు చేరే క్రాసింగ్ వద్ద ఇంజన్ నుంచి 4, 5 నెంబర్ బోగీలు పక్కకు ఒరిగిపోయాయి. ఈ సంఘటనతో అప్రమత్తమైన లోకో పైలట్ రైలును నిలిపివేయడంతో మరిన్ని బోగీలు పట్టాలు తప్పే ప్రమాదం తప్పింది. గూడ్స్ రైలు కావడం, రైలు తక్కువ స్పీడ్‌లో ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్లేందుకు రైళ్ల రాకపోకలు అత్యధికంగా ఉంటాయి. ప్రమాదం మధ్యాహ్నం పూట జరగడంతో అందరూ అప్రమత్తమయ్యారు. ఈ మార్గంలో ప్రయాణించే సికింద్రాబాద్ నుంచి కేరళ వైపు వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్‌ను మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. విశాఖ నుంచి సికింద్రాబాద్ వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను పల్నాడు జిల్లా పిడుగురాళ్ల వద్ద నిలిపివేశారు. మిగిలిన రైళ్లను వేర్వేరు స్టేషన్లలో నిలిపివేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు మంచినీరు, ఆహారం కోసం అల్లాడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు.. ఎండ వేడిమి, ఉక్కపోతతో యాతన పడ్డారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

విష్ణుపురం వద్ద గూడ్స్‌రైలు ప్రమాదంతో మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో గంటల తరబడి నిలిచిపోయిన శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎండవేడిమికి ఉక్కపోతకు, సరైన ఆహారం, తాగునీరు వసతులు లేక ఇబ్బందులు పడుతుండటంపై సమాచారం అందుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) తమ ఫౌండేషన్ సభ్యులతో స్టేషన్‌కు చేరుకొని ప్రయాణికులకు ఆహార పదార్థాలు, వాటర్‌బాటిళ్లు అందజేశారు.మానవత్వంతో స్పందించిన ఎమ్మెల్యే తీరుపట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. రైల్వేమార్గాన్ని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి, ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మావోయిస్టుల ఆటవిక చర్యలుతో ప్రజలకు నష్టం

కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు



నవతెలంగాణ-కొత్తగూడెం

నిషేధిత సీపీఐ (మావోయిస్టు) ఆటవిక చర్యల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ఆదివారం ఎస్పీ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన భీమారం సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా అమర్చిన బూబిట్రాప్స్ వల్ల ఇద్దరు ఆదివాసీ మహిళల రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ప్రాణాపాయ స్థితి నుంచి బతికి బయటపడ్డారని, మావోయిస్టులు చేస్తున్న ఆటవిక చర్యల వల్ల అమాయక ఆదివాసీ ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో పూసుగుప్ప అటవీ ప్రాంతంలో అమర్చిన బూబీట్రాప్స్ వల్ల సామాన్య ఆదివాసీ ప్రజలకు చెందిన మూడు ఆవులు, రెండు కుక్కలు మరణించినట్టు చెప్పారు. ఏజన్సీ ప్రాంతాల్లోని పూసగుప్ప, ఉంజుపల్లి గ్రామాల మధ్య ఈ నెల 25 శనివారం రహదారికి అడ్డంగా చెట్లను నరికి పడేసి రాకపోకలకు అంతరాయం కలిగించారన్నారు. మావోయిస్టులు దురాలోచనలతో ఏర్పాటు చేస్తున్న బూబీట్రాప్స్, ఐఈడీలతో ఆయా అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల వల్ల ఏం సాధించాలనుకుంటున్నారో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులకు మావోయిస్టు పార్టీ నాయకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ ప్రజలకు విద్యా వైద్యం, రవాణా వంటి అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ వారిని అభివృద్ధి చేస్తుంటే, మరో వైపు మావోయిస్టులు మిలీషియా చేత దుశ్చర్యలకు పాల్పడుతూ ఆదివాసీలను ఆటవిక జీవితానికే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ ప్రాంత అభివృద్ధి, భవిష్యతు కోసం ఇలాంటి పద్ధతులను మానుకొని, పోలీసుల ఎదుట లొంగిపోయి సాధారణ జీవితం గడపాలని కోరారు. కాగా, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన "ఆపరేషన్ చేయూత" కార్యక్రమానికి ఆకర్షితులై ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 15 మంది లొంగిపోయినట్టు చెప్పారు. వారిలో ఇద్దరు డిప్యూటీ కమాండర్లు, ముగ్గురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు దళసభ్యులు, ఆరుగురు మిలీషియా సభ్యులు ఉన్నట్టు తెలిపారు. వారికి ప్రభుత్వం తరపున అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించనున్నట్టు స్పష్టం చేశారు.

కరీంనగర్ శోభాయాత్ర ఘటనలో బిగ్ ట్విస్ట్..

- గొడవకు కారణమైన వ్యక్తి బీజేపీ కార్యకర్తే..!
- అతనితో సంబంధం లేదని ఆ పార్టీ వివరణ
- అరాచక శక్తులతో తమకు సంబంధం లేదని పోలీసులకు ఫిర్యాదు
- పోలీసులు సంయమనం పాటించాల్సింది : ఎంపీ బండి సంజయ్ ప్రకటన



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

శనివారం రాత్రి 11 గంటల సమయంలో హనుమాన్ దీక్షాపరులు ర్యాలీ తీస్తుండగా ఓ వ్యక్తి తల్వార్‌తో హంగామా చేయడంతో గొడవకు దారి తీసింది. ఇది కావాలనే ఓ గ్రూపువారు చేశారంటూ బీజేపీ శ్రేణులు హనుమాన్ దీక్షాపరులతో కలిసి గొడవకు దిగారు. రంగప్రవేశం చేసిన పోలీసులు వాళ్లందర్నీ రాత్రి సుమారు రెండు గంటల పాటు చెదరగొట్టారు. అయితే ఈ ఘటనలో గొడవకు కారణమైన వ్యక్తి బీజేపీ కార్యకర్త అంటూ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. అరాచక శక్తులతో తమకు సంబంధం లేదని తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. పోలీసులు సంయమనం పాటించాల్సిందంటూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఓ వీడియో విడుదల చేశారు.

గొడవ జరిగిందిలా...

కరీంనగర్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి హనుమాన్ దీక్షా పరులు శోభాయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో నగర నడిబొడ్డుకు చేరుకోగానే ఓ వ్యక్తి మద్యం మత్తులో తల్వార్‌తో వీరంగం సృష్టించాడు. వేరే మతానికి చెందిన వ్యక్తి అనుకొని అతన్ని హనుమాన్ దీక్షాపరులు అడ్డుకొని వాగ్వివాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వెంటనే ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. వీరంగం చేసిన వ్యక్తిని తమకు వదిలిపెట్టాలని హనుమాన్ దీక్షాపరులు, అక్కడికి చేరుకున్న బీజేపీ శ్రేణులు గొడవకు దిగడంతో పోలీసులు బలవంతంగా ఆ వ్యక్తిని వాహనంలో ఎక్కించుకొని తీసుకెళ్లారు. దాంతో పోలీసు వాహనాన్ని వెంబడించారు. ఈ క్రమంలో ఓ హనుమాన్ మాలధారుడు పోలీసు వాహనాన్ని పట్టుకుని వేలాడాడు. ఆ తర్వాత వాహనాన్ని ఆపిన పోలీసులు.. వేలాడుతున్న వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించారు. దాంతో పోలీసుల వైఖరిని నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ విషయం వీడియోలు, ఫొటోల ద్వారా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మరికొంతమంది హనుమాన్ దీక్షాపరులు సహా కొందరు అక్కడికి చేరుకొని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ సదరు వ్యక్తిని తమకు అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. పరిస్థితి చేయిజారుపోతుండటంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. బీజేపీ శ్రేణులను కొందరిని అదుపులోకి తీసుకున్నారు. సుమారు రెండు గంటలపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

గొడవకు కారణం బీజేపీ కార్యకర్తే

తల్వార్‌తో వీరంగం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతన్ని తమదైన శైలిలో విచారణ చేశారు. దాంతో అతను బీజేపీకి చెందిన జిల్లా నాయకుడి అనుచరుడు అని పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన నిందితుని వీడియో, ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. దాంతో శోభాయాత్రలో కావాలనే బీజేపీ శ్రేణులు అలజడి సృష్టించే ప్రయత్నం చేశారంటూ సోషల్ మీడియాలో ఆ పార్టీపై దుమ్మెత్తి పోశారు. ఇదే సందర్భంలో ఆ పార్టీ శ్రేణులు ఘటనపై స్పందించకుండా వెనక్కి తగ్గడం కొసమెరుపు.


పోలీసులకు బీజేపీ నాయకుల ఫిర్యాదు

హనుమాన్ దీక్షాపరుల శోభాయాత్రలో ఉద్దేశపూర్వకంగా అలజడులు సృష్టించి తమపై బురదజల్లే ప్రయత్నం చేశారంటూ ఆదివారం ఉదయం బీజేపీకి చెందిన నాయకులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. శోభాయాత్రలో గొడవకు కారణమైన వ్యక్తికి గాని, హనుమాన్ శోభాయాత్ర నిర్వాహకులు గాని ఎలాంటి సంబంధం లేదంటూ పేర్కొన్నారు. కొందరు పనిగట్టుకుని తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరడం గమనార్హం.

మైనారిటీలే లక్ష్యంగా దాడులు

చట్టాలను ఉల్లంఘిస్తున్న బీజేపీ పాలిత ప్రభుత్వాలు

- విమర్శిస్తే చాలు...బుల్డోజర్లతో కూల్చివేతలు
- కోర్టులు అక్షింతలు వేసినా ఆగని ఆరాచకాలు



న్యూఢిల్లీ : తాను రూపొందించిన చట్టాలను ప్రభుత్వం తానే ఉల్లంఘిస్తే? పది సంవత్సరాల నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో జరిగింది అక్షరాలా అదే. కంటికి రెప్పలా కాపాడాల్సిన వారే కాటేస్తే ఇక బడుగులు, అట్టడుగు వర్గాల ప్రజలు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలి? ఇటీవలి కాలంలో దేశంలో బుల్డోజర్ రాజకీయాలకు ప్రాధాన్యత పెరిగింది. సంఘ విద్రోహ శక్తులంటూ ముద్ర వేసి, కళ్ల ఎదుటే నివాసాలను బుల్డోజర్లతో ధ్వంసం చేస్తుంటే బాధితుల బాధ వర్ణనాతీతం. బీజేపీ ప్రభుత్వం నాలుగు రాష్ట్రాల్లో ముస్లిం మైనారిటీల ఆవాసాలను నేలమట్టం చేయడాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ లోకుర్ ప్రశ్నించారు. రుజువు కాని నేరాన్ని ఆధారంగా చేసుకొని ఓ ఇంటిని ఏ చట్టం ప్రకారం కూల్చేస్తారని ఆయన నిలదీశారు.'పోలీసులు ఆ పని చేయకూడదు. విచారణ పేరుతో ఏ ఇంటినైనా అనుమతి లేకుండా కూల్చివేయకూడదు. ఇలాంటి పనులు కొనసాగితే ఈ దేశంలోని ఏ ఒక్కరూ సురక్షితంగా ఉండలేరు. నేరాన్ని విచారించడం కోసం పోలీసులు ఎలాంటి ఆదేశాలు పొందకుండా బుల్డోజర్‌ను ఉపయోగించి ఇంటిని కూల్చివేయవచ్చునని ఏ క్రిమినల్ చట్టం చెబుతోందో నాకు చూపించండి' అని జస్టిస్ లాతుర్ ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకొని అన్యాయాన్ని అడ్డుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

గౌహతి కోర్టు ఏం చెప్పింది?

అక్రమ కూల్చివేతలపై 2022 మేలో గౌహతి హైకోర్టు ఇచ్చిన తీర్పు వాటిలో ఒకటి. ఎలాంటి నిబంధనలు పాటించకుండా నివాస గృహాలను కూల్చివేయడంపై ప్రధాన న్యాయమూర్తి ఆర్ఎం చాయ, న్యాయమూర్తి సౌమిత్ర సైకియాతో కూడిన ద్విసభ్య బెంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు చట్టవిరుద్ధమని వ్యాఖ్యానిస్తూ వాటిని 'గ్యాంగ్ వార్'పై పోలీసులు తీసుకునే చర్యలతో పోల్చింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. రెండు సంవత్సరాల తర్వాత కూల్చివేతల వ్యవహారం ఇటీవల మరోసారి న్యాయస్థానాల ముందుకు వచ్చింది. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలోనూ, తమకు నష్టపరిహారం చెల్లించడంలోనూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ బాధితులు కోర్టు తలుపులు తట్టారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ఉత్తరప్రదేశ్ మొదలుకొని మధ్యప్రదేశ్, గుజరాత్, అసోం, కర్నాటక రాష్ట్రాల్లో (ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే) పోలీసులకు కోర్టు ఆదేశాలు ఏ మాత్రం పట్టినట్లు లేవు. కేసు ఏదైనా సరే పోలీసులు అసలు ప్రశ్నలే అడగడం లేదు. న్యాయస్థానంలో కేసు ఓ కొలిక్కి వచ్చే వరకూ ఆగడం లేదు. చట్టపరమైన లాంఛనాలు పూర్తి చేయాల్సిన అవసరమే లేదు. అది భార్యాభర్తల వివాదమే కావచ్చు...మరేదైనా గొడవే కావచ్చు...పోలీసులు వెంటనే చర్యలు ప్రారంభిస్తున్నారు. ఏ కేసులో అయినా రాజ్యాంగ పరంగా కొన్ని విధివిధానాలు పాటించాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని 300ఏ అధికరణ ప్రకారం ఏ వ్యక్తికైనా తన ఆస్తిని కాపాడుకునే హక్కు ఉంటుంది. అయితే దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా కూల్చివేతలు అత్యంత వేగవంతంగా జరిగిపోతూనే ఉన్నాయి.

వీటిని పట్టించుకునే వారేరి?

బాధితుడికి తన గోడు చెప్పుకునే హక్కు ఉంటుంది. ముందస్తుగా తనకు నోటీసు అందజేయాలి. అయితే ఈ సహజ న్యాయ సూత్రాలను ఎవరూ ఖాతరు చేయడం లేదు. వీటిని ఉల్లంఘిస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా చర్యలకు ఉపక్రమిస్తోంది. మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న అఖిలభారత సంస్థ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ కూల్చివేతల జోరుకు కళ్లెం వేస్తూ అత్యున్నత న్యాయస్థానం కనీసం మధ్యంతర స్టే కూడా ఇవ్వలేదు. ఇలాంటి పరిస్థితుల్లో గౌహతి హైకోర్టు తనంతతానుగా జోక్యం చేసుకొని ఆదేశాలు ఇవ్వడం హర్షణీయం.

అక్షింతలు వేసిన పాట్నా హైకోర్టు

చట్టంలోని నిబంధనల ప్రకారం నడుచుకోకుండా బీహార్ పోలీసులు ఓ మహిళ నివాస గృహాన్ని బుల్డోజర్లతో కూల్చివేయడంపై పాట్నా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భూ మాఫియా ఆదేశాల మేరకు పోలీసులు తన ఇంటిని కూల్చేశారని బాధిత మహిళ చేసిన ఫిర్యాదుపై న్యాయమూర్తి స్పందిస్తూ ఇక్కడ కూడా బుల్డోజర్ నడవడం ప్రారంభమైందా అని ప్రశ్నించారు. 'మీరు ఎవరి పక్షాన ఉన్నారు? ప్రభుత్వం తరపునా లేక ప్రైవేటు వ్యక్తి తరపునా? ఎవరి ఇంటినైనా బుల్డోజర్‌తో కూల్చివేయగలమన్న సంకేతాలు పంపేలా మీరు ప్రవర్తిస్తున్నారు' అని పోలీసులకు అక్షింతలు వేశారు. కాగా కూల్చివేతకు సంబంధించిన ఓ ఘటనలో బాధితులకు నష్టపరిహారం చెల్లించామని అస్సాం ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది.

స్తంభానికి కట్టేసి...బుల్డోజర్‌తో తొక్కించి

గుజరాత్‌లోని ఖేడాలో రెండు సంవత్సరాల క్రితం ఓ అమానుషం జరిగింది. తమకు అందిన ఓ ఫిర్యాదును పురస్కరించుకొని పోలీసులు ఒక ముస్లింను స్తంభానికి కట్టేసి బహిరంగంగానే హింసించారు. ఈ ఘటనపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. బాధ్యులైన పోలీసులను శిక్షించాలని ఆదేశించింది. ఇక దక్షిణ గాజాలో పాలస్తీనియన్ల ఇళ్లను కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన 23 సంవత్సరాల యువతిని ఇజ్రాయిల్ బుల్డోజర్‌తో తొక్కించి చంపేశారు.

ఓటేయకుంటే బుల్డోజర్ వస్తుంది

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని, లేకుంటే ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని అటవీ అధికారులు అసోంలోని ఓ గ్రామానికి చెందిన ముస్లింలను బెదిరించారు. ఆ గ్రామంలో ముస్లింలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరాఖండ్‌లో కూడా ఇలాంటి కేసే వెలుగు చూసింది. అక్కడి కూల్చివేతలపై సుప్రీంకోర్టు స్టే మంజూరు చేసింది. వేలాది మంది ప్రజలు...వారిలో అత్యధికులు మైనారిటీలు...దశాబ్దాల తరబడి రైలు పట్టాల పక్కన నివసిస్తున్నారు. వారికి నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు కూడా ఉన్నాయి. అయితే ఈ ప్రదేశంలో అక్రమంగా మదర్సా మసీదును నిర్మించారన్న కారణంతో అధికారులు కట్టడాల కూల్చివేత పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలు తలెత్తి హింస చెలరేగింది. ఐదుగురు పోలీసులు చనిపోగా పలువురు గాయపడ్డారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో హిందూత్వ మూకలు చెలరేగిపోయారు. రాష్ట్రం నుండి మైనారిటీలను పూర్తిగా తరిమేయాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు. మొత్తంగా కూల్చివేతలు జరిగిన రాష్ట్రాలన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే కావడం గమనార్హం. ఈ సంవత్సరం జనవరి చివరలో ముంబయిలోని మీరా భయందర్ ప్రాంతంలో ముస్లింల ఆస్తులే లక్ష్యంగా దాడులు జరిగాయి.

పరిహారం కోసం ఎదురు చూపులు

రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు కలిసి కూల్చివేతలకు తెగబడడంతో బీజేపీ పాలిత ఐదు రాష్ట్రాల్లో కనీసం 617 మంది రోడ్డున పడ్డారు. వీరు గత రెండు సంవత్సరాలుగా నష్టపరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. వీరందరూ ఇళ్లు, వ్యాపారాలు, ప్రార్థనా మందిరాలను కోల్పోయిన వారే. వివక్షాపూరిత చట్టాలను, నిబంధనలను వ్యతిరేకించడమే వారు చేసిన నేరం.

బీజేపీ పాలిత రాష్ట్రాల చర్యలు వలస పాలకుల కాలం నాటి శిక్షలను గుర్తు చేస్తున్నాయి. పౌరసత్వ సవరణ చట్టాన్ని, జాతీయ పౌర నమోదును వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనలను గుర్తుకు తెచ్చుకుందాం. యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పాటించకుండా రికవరీ నోటీసులు జారీ చేసింది. అయితే చివరికి వాటన్నింటినీ ఉపసంహరించుకుంది. జరిమానా రూపంలో ప్రజల నుండి తీసుకున్న నష్టపరిహారం సొమ్మును తిరిగి వాపసు చేసింది కూడా.

అనుమానాస్పద స్థితిలో ఏపీ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

- మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన



(ఫైల్)

నవతెలంగాణ-మియాపూర్

ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శ్రీనివాస్, సరస్వతి దంపతుల కుమారుడు జయప్రకాశ్ నారాయణ్ (35), కూతురు ప్రశాంతి ఉన్నారు. కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో ఉంటున్న సోదరి ప్రశాంతి ఇంటికి ఈ నెల 22 న జయప్రకాష్ నారాయణ వచ్చాడు. శనివారం ఉదయం ఊరికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు.

రాత్రయినా ఇంటికి వెళ్ళలేదు. దాంతో కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మియాపూర్ మదీనాగూడలోని ఫ్లాగ్‌షిప్ ఓయో వెన్నెల రెసిడెన్సీ లాడ్జిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు హోటర్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు విచారణ చేపట్టగా ఆ మృతదేహం జయప్రకాశ్‌గా గుర్తించారు. అయితే జయప్రకాశ్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని హత్యనా..? ఆత్మహత్యనా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని మియాపూర్ పోలీసులు తెలిపారు.

జర్నలిస్టులపై దాడికి యత్నించిన భూ కబ్జాదారులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్‌లో జర్నలిస్టులకు ప్రభుత్వం కేటాయించిన భూమి విషయంలో కొందరు కబ్జాదారులు దాడికి యత్నించారు. జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన కేటాయించిన భూమిలో ఆదివారం బోర్డులు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులు వారు అడ్డుకున్నారు. ఈ భూమి తమదని వాగ్వాదానికి దిగడంతో పోలీసులు ఇరు వర్గాలను శాంతింప జేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చిన జర్నలిస్టులు పోలీసులకు అందించిన పత్రాలు సరిగ్గా ఉండటంతో సదరు భూమిలో జర్నలిస్టుల బోర్డులను పాతేందుకు అనుమతించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు వంశి, రవికాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని కాపాడుకునేందుకు అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు.

స్కావెంజర్లను నియమించాలి :పీఆర్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బడిబాట జూన్ ఒకటి నుంచి, 12 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు వెంటనే స్కావెంజర్లను నియమించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం చెన్నయ్య, సుంకరి భిక్షంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బడిబాటకు ముందే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. ఆగిపోయిన బదిలీల , పదోన్నతుల షెడ్యూల్ వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

నేడు పలు చోట్ల విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలవారీ మరమ్మత్తుల కారణంగా ఉదయం11 గంటల నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ స్వామి తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 11 కేవీ ఉదయ్ నగర్ ఫీడర్ నుండి 33/11 కేవీ పరిధిలోని విద్యుత్ తీగలకు అనుకొని ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు. బృందావనం కాలనీ, సత్తిరెడ్డి కాలనీ, శ్రీనివాస కాలనీ, యాదవ బస్తీ, ఎస్సీ బస్తీ, పాత కాలనీ, బొమ్మకు బ్రదర్స్ కాలనీ, సరస్వతీ నగర్, హనుమాన్ నగర్, అంబేద్కర్ విగ్రహం, డిపో మెయిన్ రోడ్డు, కేశవనగర్, లక్ష్మీ నగర్, మా గార్డెన్ ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుండి1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అదే విధంగా 11 కేవీ ఇంద్రా నగర్ ఫీడర్ పరిధిలోని సాయి భవానీ నగర్, సాయిరాం నగర్, శ్రీనివాస్ కాలనీ, సత్తిరెడ్డి కాలనీ, మీయాపూర్, షోలే బార్, ఆనంద్ నగర్ కాలనీ ప్రాంతాలలో సాయంత్రం3 నుంచి సాయంత్రం 4:30 గంటలకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించి ప్రజలు సహకరించాలని కోరారు.

ఇండస్ట్రీయల్ ఎండీని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

బషీర్ బాగ్‌లోని తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ విష్ణు వర్ధన్‌రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎండీ విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌రావు డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్‌రెడ్డి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీ ఫేజ్-2లో
కార్పొరేటర్ ప్రభుదాస్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ ఫేజ్-2లో తాగునీరు, డ్రయినేజీ, ఇతర సమస్యలను పరిష్కార నిమిత్తం కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బందిని, జలమండలి శాఖకు సమన్వయం చేస్తూ ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.వెంకటాచారి, సలహాదారులు కె.చంద్రమోహన్ ఉపాధ్యక్షులు పిఎస్. జగదీశ్వర్, ఎస్. భువనచంద్ర, ప్రధాన కార్యదర్శి ఆర్. వి.సాంబశివరావు, సంయుక్తకార్యదర్శులు యు. ఈశ్వరరావు, పి.వెంకటేశం, ఈ.రామచంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ బాబు, కే.మధుబాబు, డి సురేష్, కోశాధికారి టి.నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

చర్లపల్లిలో ఘనంగా దుర్గమ్మ బోనాల వేడుక



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని చిన్న చర్లపల్లి, పెద్ద చర్లపల్లిలో బోనాల వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ..2015 సంవత్సరం నుంచి దుర్గమ్మకు బోనాలు ఆనవాయితీగా తీస్తున్నామని తెలిపారు. శనివారం రాత్రి ప్రతి ఇంటి నుంచి బోనం చేసి 800 మంది మహిళలతో దుర్గమ్మ తల్లికి బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశామని పేర్కొన్నారు. దుర్గమ్మకు బోనాలు సమర్పించడం వల్ల ప్రతి ఒక్కరికీ శుభం కలుగుతుందని, ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవని ఇక్కడికి ప్రజలు నమ్ముతారని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఏడాది అమ్మవారికి పూజలు నిర్వహిస్తామని చెప్పారు. డివిజన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కాలనీల వాసులు, భక్తులు పాల్గొన్నారు.

బెల్లి లలితకు బీసీ కులాల ఐక్య వేదిక నివాళి



నవతెలంగాణ-మల్కాజిగిరి

బెల్లి లలితక్క వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరిలో బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు కామళ్ల ఐలన్న కురుమ ఆధ్వర్యంలో బీసీ కులాల ఐక్యవేదిక భవనంలో ఆదివారం నివాళులర్పించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఆమె చేసిన పోరాట పటిమను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు కామళ్ల ఐలన్న కురుమ, రొయ్యల కృష్ణ మూర్తి ముదిరాజ్, పూలపల్లి సుందర్ యాదవ్, జోగు శ్రీనివాస్ కురుమ, చేగూరి రామ్మోహన్ కురుమ, దేవరాజ్ ముదిరాజ్, తోట నాగరాజ్ పటేల్, చెట్టి వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఉప్పల్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు
- ఎలివేటెడ్ కారిడార్ పనులతో రింగ్ రోడ్డుపై కొద్ది పాటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి
- ఉప్పల్ ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి



పతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ పరిధిలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, పాటించకుండా అతిక్రమిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి అన్నారు. ఉప్పల్ రింగ్‌రోడ్డు నుంచి నల్ల చెరువు వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులతో రోడ్డుపై కొద్ది పాటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఆదివారం నవతెలంగాణతో ఆయన పలు విషయాలను తెలిపారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఉప్పల్ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ నివారణ కోసం ప్రతి రోజు ట్రాఫిక్ ఎస్ఐలతో పాటు ట్రాఫిక్ కానిస్టేబుల్స్ ప్రధాన కూడలి వద్ద ఉంటూ ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నారు.

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రధాన రహదారుల వెంబడి, వ్యాపార సముదాయల వద్ద వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారిపై వ్యాపార సముదాయాల వద్ద వాహనదారులు రోడ్డుపై వాహనాలను పార్క్ చేస్తే ట్రాఫిక్ చలాన్ విధించి చర్యలు తీసుకుంటాం.

హెవీ గూడ్స్ వెహికల్స్ వెళ్లడానికి నో ఎంట్రీ ఎన్ని గంటల వరకు ఉంటుంది?

జవాబు: హెవీ గూడ్స్ వాహనాలు సిటీలోకి రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7:00 వరకు, 11:30 నుంచి 4:00 వరకు హెవీ గూడ్స్ వెహికల్ సిటీలోకి అనుమతించబడతాయి. ఏడు గంటల తర్వాత వచ్చే వాహనాలకు ట్రాఫిక్ చలాన్ విధిస్తాం. ఒక్కసారి ట్రాఫిక్ నియమ నిబంధన ఉల్లంఘించి మరోసారి ఆ వాహన పట్టుబడితే ఆ వాహనాన్ని ఆర్టీఏ అధికారులకు అప్పగిస్తాం.

హెవీ గూడ్స్ వాహనాల పరిధిలోకి ఏ ఏ వాహనాలు వర్తిస్తాయి?

జవాబు: హెవీ గూడ్స్ వెహికల్ పరిధిలోకి లారీలు, టిప్పర్స్, రేడిమిక్స్ వాహనాలు, కాంక్రిట్, వాహనాలు బోరవెల్స్ జేసీబీ, వాటర్ ట్యాంకర్స్ వాహనాలు వస్తాయి.

నెంబర్ ప్లేట్ సరిగలేని వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: కొంతమంది వాహనదారులు నెంబర్ ప్లేట్లపై వాహనం యొక్క నెంబర్ కనబడకుండా నెంబర్ ప్లేటు వంచడం, నెంబర్‌లను రఫ్ చేస్తున్నారు. వారి కోసం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి అలాంటి వాహనాలను సీజ్ చేస్తున్నాం.

అంబేద్కర్ స్ఫూర్తితో అన్ని రంగాల్లో రాణించాలి



- రాజ్యాధికారం కోసం ఏకం కావాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

నవతెలంగాణ-బోడుప్పల్

నేటి తరం యువకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. ఆదివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి 275 వారాలుగా సాగుతున్న జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ స్ఫూర్తితో నేడు ఎంతోమంది యువతీ యువకులు అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారని తెలిపారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లిన భువనగిరి వాస్తవ్యుడు బుగ్గ సురేష్‌ను అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తరపున ఘనంగా సన్మానించారు. అంబేద్కర్ కలలు కన్న దళిత బహుజనుల రాజ్యాధికారం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, అంజయ్య, నత్తి విజయకుమార్, రాపోలు శ్రీరాములు జి, యాకయ్య, బుగ్గ సురేష్, ఏ. రాజేష్ సవరపు బయ్యన్న, హరి, జై భీమ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో చేపట్టే జ్ఞానమాల కార్యక్రమం ఆదివారం 104వ వారానికి చేరింది. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, ఎస్.ఏ.రహీం, నర్సింహ్మా చారి, దయానంద్, శేఖర్ నాగేష్, మెకానిక్ కొండల్, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలి : నూకలగూడెం సత్తిరెడ్డి



నవతెలంగాణ-కీసర

అంబేద్కర్ ఆశయాలు సాధించాలంటే ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని నూకల గూడెం సత్తిరెడ్డి అన్నారు. కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్ ఆధ్వర్యంలో 121వ వారం జ్ఞానమాల కార్యక్రమానికి సాయిరాం పౌల్ట్రీ ఫార్మ్స్ అధినేత నూకల గూడెం సత్తిరెడ్డి, ఆయన తనయుడు చిన్నపరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..నేడు సమాజంలో హక్కులు పొందుతూ దేశంలో ప్రజలు జీవిస్తున్నారంటే కారణం అంబేద్కర్ భిక్షేనన్నారు. అంబేద్కర్ ఆశయాలు సాధించాలంటే ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు జలాల్పురం సుధాకర్ రెడ్డి, బోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకటరెడ్డి, మండల బీజేపీ నాయకులు నల్ల వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ జర్నలిస్ట్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కర్రె గణేష్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి ఆంజనేయులు, 108 రవి, మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు పర్సంది వేణుగోపాల్, కోశాధికారి కానుకుంట్ల శ్యాం కుమార్, సంయుక్త కార్యదర్శి గంగి సుధాకర్, సంతోష్, కట్ట శంకరయ్య, బత్తుల ఆంజనేయులు, మండల సీనియర్ నాయకులు రొండ్ల కృష్ణ, గోక బాలకృష్ణ, రామరం రమేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వృద్ధుడు మృతి

- అంత్యక్రియలు నిర్వహించిన బాల్ రెడ్డి, బండ కింది ప్రసాద్ గౌడ్



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఆదర్శ అనాథ వృద్ధాశ్రమంలో శనివారం రాత్రి ఈశ్వరయ్య (94) అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి సొంతవాళ్లు, కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో వృద్ధాశ్రమ నిర్వాహకులు బాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బండకింది ప్రసాద్‌గౌడ్ సహకారంతో ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంతక్రియల కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లక్ష్మి కృష్ణాగౌడ్, రాహుల్ కందం, గోపి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



- ప్రతాపసింగారంలో కూలిన ఐదు ఇండ్లు
- విరిగిన చెట్లకొమ్మలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండలంలో పోచారం మున్సిపల్ పరిధిలోని సంస్కృతి టౌన్ షిప్‌లో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి చెట్లకొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లకు అడ్డంగా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ప్రతాప్ సింగారంలో ఈదురుగాలులకు బోనగిరి వినోద్, చీర కుమార్, జోగు భిక్షపతి, శ్రీలత, జోగు రాజు ఇండ్లు నేలమట్టం అయ్యాయి. అరగంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం కాగా లోతట్టు ప్రాంతాలోకి భారీగా వరదనీరు చేరింది. గాలికి మర్రిపల్లిగూడలో తాటిచెట్టు విరిగిపడింది.

కీసరలో..

కీసర మండలంలో గాలి వాన ఉరుములతో బీభత్సం సృష్టించింది. రాంపల్లి, కీసర, యాద్గార్‌పల్లి, తిమ్మాయి పల్లి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షానికి ఆయా కాలనీల్లో వరద నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



వీరశైవ సమాజ నూతన అధ్యక్షుడిగా ప్యాట జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-కాప్రా

కాప్రా వీరశైవ సమాజం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం కాప్రాలోని విజయ హై స్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. బండే గౌడ సారథ్యంలోని గత కమిటీ కాల పరిమితి పూర్తికావడంతో సభ్యులకు కమిటీ నివేదికను సమర్పించారు. అనంతరం జరిగిన ఎన్నికలోల ప్యాట జ్ఞానేశ్వర్‌ను నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు యావపురం విశ్వనాథం, అడ్వకేట్ గొంగళి బసప్పలు ప్రకటించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యత అప్పజెప్పిన ప్రతి సభ్యుడికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి ఉళ్లెం బాలరాజు, మాజీ కోశాధికారి యావపురం రవి, సభ్యులు గంగ ఈశ్వరయ్య, కత్తి శివానంద, రామ్ శెట్టి, భీమ్ శంకర్, శంభు లింగం, నమస్కరి శివ, మటమ్ శివ, రాజేశ్వర్, గిరిజాపతి, మహేష్, ప్రదీప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భరత్ నగర్‌లో నేలకొరిగిన భారీ వృక్షం



నవతెలంగాణ-కాప్రా

భారీ ఈదురు గాలులకు చర్లపల్లి డివిజన్‌లోని భరత్‌నగర్‌లో మహిళా భవన్ పక్కనే ఉన్న భారీ వృక్షం కూలడంతో మహిళా భవన్ ఒకవైపు మొత్తం నేలమట్టం అయ్యింది. రెండు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ స్థానిక నాయకులను అప్రమత్తం చేసి సపర్యలు చేపట్టారు. ఎలక్ట్రికల్, హార్టికల్చర్, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలను జీహెచ్ఎంసీ అధికారులు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలకు ఇన్సూరెన్స్ ఉన్నందున వారికి నష్టం జరగకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాను చందర్, రాజు గౌడ్, లతీఫ్, జోసెఫ్, షరీఫ్, సోయల్, సాంబయ్య ,ఖదీర్, ఆసీఫ్ రాజు, గోవర్ధన్, స్వాతి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-శామీర్‌పేట

ఆత్మీయ సమ్మేళనాలతో స్నేహితుల మధ్య ఆనందకరమైన వాతావరణం వెల్లివిరుస్తుంది. ఆదివారం శామీర్ పేట్ జెడ్పీ హైస్కూల్ 2004-2005 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని సమ్మర్ గ్రీన్ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆటపాటలతో సందడిగా గడిపారు. అంతేకాకుండా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



నేరేడ్‌మెట్-నవతెలంగాణ

పేదలకు స్వల్ప ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారు. ఆదివారం ఆయన వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని దినకర్ నగర్‌లోని రెడ్డి కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన 'ఏ1 కేర్ హాస్పిటల్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ..సేవా దృక్పథంతో ఆస్పత్రి యాజమాన్యం స్థానికంగా ఉండే పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ అశోక్, డాక్టర్ అఖిల, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, జీఎస్‌వీ. సతీష్ కుమార్, టీకే. శ్రీనివాస్, పిట్టల నాగరాజు, ఎస్ఆర్ ప్రసాద్, వినోద్ యాదవ్, సత్య నారాయణ, నవీన్ గౌడ్, రఘుయాదవ్, ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో 'సీడీపీ' కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ ట్రామా అండ్ క్రిటికల్ కేర్ సొసైటీ సహకారంతో ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిమ్స్ ట్రామా ఐదో అంతస్తు ఆడిటోరియంలో ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ అష్మా శర్మ ఆధ్వర్యంలో 'సీడీపీ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిమ్స్ సంచాలకులు నగరి బీరప్ప హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్, ఎమర్జెన్సీ సీనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



మహానగర పరిరక్షణకు పర్యావరణాన్ని కాపాడాలి



నవతెలంగాణ-అల్వాల్

మహానగరాన్ని పరిరక్షణకు పర్యావరణాన్ని కాపాడడానికి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎమ్‌హెచ్‌ఓ మంజుల ఆదేశానుసారం కొత్తచెరువు కట్టమీద చాయి పే చర్చ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కొత్తచెరువుకు ఇరువైపులా చెత్తను వేస్తున్నారని తమ దృష్టికి తీసుకువస్తే చెత్త వేసే వారికి జరిమానా విధించి కఠిన చర్యలు తీసుకుంటామని చెరువు కట్టపై నుంచి వెళ్లే వారికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చెత్తను స్వచ్ఛ రిక్షాలకే వేయాలన్నారు. వేయకపోతే రూ. 1000 జరిమానా విధిస్తారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, వెంకటేష్, రాజు, మురళి, నాగేష్, జ్యోతి యాదవ్, నీత గ్లోరీ, కవిత పాల్గొన్నారు.



అల్వాల్‌లోని 133 డివిజన్ మచ్చ బొల్లారంలోని తుర్కపల్లి అభివృద్ధికి పాటుపడాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని తుర్కపల్లి వాసులు కలిసి కాలనీ సమస్యలపై విన్నవించారు. ఆయన స్పందిస్తూ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాంటి పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. కోడ్ ముగిసిన వెంటనే పనులు చేస్తామని పేర్కొన్నారు. కలిసిన వారిలో శోభన్ బాబు, దేవా, ఈశ్వర్, వినోద్, కిట్టు, రమేష్, స్వామి ఉన్నారు. -నవతెలంగాణ-అల్వాల్

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-జవహర్‌నగర్

మానసిక సమస్యలతో బాధపడుతున్న మహిళ అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ, పీఎస్ రావు నగర్‌లో నివాసం ఉంటున్న వి.కిరణ్మయి (49) కొన్నేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నదని ఆమె భర్త ప్రసాద్ తెలిపారు. శనివారం రాత్రి కిరణ్మయి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయింది. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నవతెలంగాణ

నమ్మిన తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com



రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నర్సింహా రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ సహకారంతో.. ఇటీవల రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమించబడిన, ఉప్పల విద్య కల్పన ఏకాంత్ గౌడ్‌ను, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు దుర్గ ముదిరాజ్, వివేకానంద నగర్ డివిజన్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దుర్గ ప్రసాద్, ఎన్ఎస్‌యూఐ నాయకులు వికాస్, శివ, సాయి, రోహిత్‌లు, కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్య కల్పన ఏకాంత్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల సహకారంతో, పార్టీ బలోపేతానికి కృషచేస్తానని తెలిపారు. అందుకు ఎన్ఎస్‌యూఐ నాయకుల సహకారం ఉండాలని ఎన్ఎస్‌యూఐ నాయకులను కోరారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదరాబాద్ హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలో జూన్ 6 నుంచి 8 వరకు జరిగే 47 వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్‌ను, జెర్సీని ఆదివారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆర్గనైజింగ్ ఛైర్మెన్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోశాధికారి జమీల్, వైస్ ప్రెసిడెంట్స్ కృష్ణ రాజ్ పుత్, చిత్ర షెనోయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని "శ్రీ అంజని మ్యాన్ పవర్ లేబర్ కాంట్రాక్టర్ డెవలప్మెంట్ ఇండస్ట్రియల్" గ్లాస్ కంపెనీలో గత కొంతకాలంగా కాంటాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. కంపెనీ యొక్క యజమాన్యం నిర్లక్ష్యంతో కాంటాక్ట్‌కి, కార్మికులకు ప్రతీ నెల వెతనం ఇవ్వకుండా యజమాన్యం నిర్లక్ష్యం చేసింది. కాంట్రాక్టర్‌కు రావలసిన బిల్లు రాకపోవడంతో... కార్మికులు చాలా ఇబ్బంది పడ్డారు. ఆ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు మార్చ్, ఏప్రిల్, మే, మూడు నెలల వేతనం రావాల్సి ఉండగా కాంటాక్ట్‌కి బిల్లు ఇవ్వకుండా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం చేయడంతో కాంటాక్ట్ కార్మికులు డ్యూటీ మానేయడం జరిగింది. మూడు నెలల వేత్తనం రావాల్సిన పదిమంది కార్మికులు మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తోటి కార్మికులతో తెలుసుకొని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని, రవిసింగ్ కార్యాలయం వద్దకు వెళ్లారు. ఆ కార్మికులకు జరిగిన అన్యాయం చెప్పారు. వెంటనే స్పందించిన రవి సింగ్ హుటా హుటిన కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి కాంట్రాక్టుకు రావాలసిన మూడు నెలల బిల్లును, కార్మికులకురావాల్సిన మూడు నెలల వేత్తనం ఇప్పించారు. మొత్తం కలిపి రూ.2 లక్షల 12 వేల రూపాయలు కార్మికులకు ఇప్పించారు. కార్మికులు మాట్లాడుతూ.. తమకు న్యాయం చేసిన రవి సింగ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, సుదర్శన్, జగన్, ప్రేమ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులు..వర్షం బీభత్సం..

- నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- వనస్థలిపురంలో నెలకొరిగిన భారీ చెట్లు
- కీసర మండలంలో ఇద్దరు మృతి
- పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. నగరంలో ఉదయం నుంచి పొడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నానికి ఒక్కసారిగా మారిపోయింది. మేఘాలు కమ్మేయడంతో వాతావరణం చల్లగా మారింది. మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘావతమై పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వాన పడింది. నగరంలోని అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, ఉప్పల్, నాగోల్, తార్నాక, బోడుప్పల్, మన్సూరాబాద్, మల్కాజిగిరి, తుర్కయంజాల్, కీసర, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.

విద్యుత్‌కు అంతరాయం

నగరంలో కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్‌లో భారీగా ఈదురుగాలు రావడంతో విద్యుత్ సరఫరాకు జరగలేదు. వనస్థలిపురం సుష్మా చౌరస్తా వద్ద మన్సూరాబాద్‌కు వెళ్లే మార్గంలో 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడటంతో ఓ యువతికి తృటిలో ప్రమాదం తప్పింది.

నేలకొరిగిన భారీ వృక్షాలు

ఈదురు గాలులకు వనస్థలిపురంలోని గణేశ్ ఆలయ ప్రాంగణం, ఎన్జీవోస్ కాలనీ ప్రధాన రహదారిపై, రైతు బజార్ సమీపంలో పార్కు వద్ద భారీ చెట్లు నేలకొరిగాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది అక్కడికి చేరుకుని రహదారిపై పడిన చెట్లను తొలగించారు. వనస్థలిపురంలో భారీ వృక్షం కూలి ఓ కారుపై పడటంతో పూర్తిగా ధ్వంసమైంది. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. ఇక ఘట్‌కేసర్ మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షానికి ఘట్‌కేసర్ నుంచి ఈసీఐఎల్ వెళ్లే దారిలో చెట్లు విరిగిపడటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇద్దరు మృతి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలో ఈదురు గాలులు, భారీ వర్షానికి తిమ్మాయిపల్లి, శామీర్‌పేట దారిలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై చెట్టు విరిగిపడటంతో నాగిరెడ్డి, రాంరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి ధనుంజయ్‌కి తీవ్ర గాయాలాయ్యాయి. చికిత్స నిమిత్తం ఈసీఐఎల్‌లోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతులు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు.

ఈదురు గాలుల బీభత్సం

హైదరాబాద్‌లో పలు చోట్ల ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కీసర, ఘట్‌కేసర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట ప్రాంతాల్లో ఉధృతంగా ఈదురు గాలులు వీచాయి. హయత్‌నగర్ ప్రాంతంలో గాలికి రేకులు, గుడిసెల పైకప్పులు కొట్టుకుపోయాయి. ఇక సాయంత్రం సైతం నగరంలోని ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసింది.



బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పకు చెందిన బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వాళ్లను ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలకు ఆకర్షితులై.. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప మస్జిద్ ముజీద్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్, కే.ఎస్.ఆర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం గౌస్ ఉద్దీన్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ సోదరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల అధ్యక్షులు ఏలూరి సత్య (నాని), మధుసూదన్ రెడ్డి, మామిళ్లపల్లి శ్రీనివాస్, వర్మారాజు, రఫత్, నాయబ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు కే.ఎస్.ఆర్ అభిమానులు పాల్గొని జయప్రదం చేశారు. పార్టీ ఆశయాలు, పథకాలకు ఆకర్షితులైన మైనార్టీ సోదరీమణులు సైతం పార్టీలో చేరడం విశేషం.. పార్టీలో చేరిన వారిలో అబ్దుల్ సత్తార్, రుక్ముద్దీన్, జమురుద్దీన్, అహ్మద్, మస్తాన్, షారుక్, జమాలుద్దీన్, గౌస్ పాషా, వీరేందర్ గౌడ్, సలీమ బేగం, వినోద్, సునీల్ పర్విన్ బేగం తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ఆక్రమణలు చేపట్టవచ్చా..!

- బీజేపీ నాయకులు సతీష్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప నందు బీఆర్ఎస్ నాయకుడు సాంబశివరెడ్డి తను 26 మీటర్ల రోడ్డున ఆక్రమించుకుని ఇల్లు నిర్మాణం చేపట్టవచ్చు గానీ, రాజీవ్ గృహకల్ప వాసులు పక్కన ఉన్న పేదలు కట్టుకుంటుంటే మాత్రం వారిపై బీఆర్ఎస్ నాయకుని అంటూ... దౌర్జన్యం చెలాయిస్తూ బెదిరించడం, పనులు అడ్డుకోవడం లాంటి చర్యలతో మామూలు ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తూన్నారని బీజేపీ నాయకులు సతీష్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాళ్ల కట్టుకున్న గోడను కూల్చివేయడం వంటి చర్యలు మానుకోవాలని ఆయన తెలిపారు. గత రెండు సంవత్సరాల కాలంగా బీఆర్ఎస్ నాయకులు విచ్చలవిడిగా ఎకరాల కొద్ది కబ్జా చేస్తు నిర్మాణాలు చేపట్టుచున్నారని పేర్కొన్నారు. సాంబశివ రెడ్డి అనే వ్యక్తి బీఆర్ఎస్ ఎన్ఎంసీ నాయకుడిగా చలామనవు తూ.. రాయలసీమ రాజకీయం పేదలపై చేస్తానంటే కుదరదని అన్నారు. అలాగే ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని.. నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తాం, బాధితులకు అండగా నిలబడతామని, చిత్తశుద్ధి ఉంటే నిరూపణకు మేము సిద్ధమని తెలిపారు. సాక్షాత్తు బీఆర్ఎస్ నాయకులే ఆయనపై ఫిర్యాదులు చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి వారికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహకరించడం చూస్తేనే, పేదల పట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఎంతటి చిత్తశుద్ధి ఉందో ప్రజలే గమనిస్తున్నారని తెలిపారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి



- బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి పరిశ్రమ రెడ్డి అన్నారు. ఆదివారం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్, రామరాజు నగర్ లలో డ్రయినేజీ సమస్యలు, సుచిత్ర నేషనల్ హైవే నిర్మాణంలో ఉన్నా పనుల వల్ల నీరు రివర్స్ రావడం వలన ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు ఆయనకు తెలియజేశారు. స్థానిక కాలనీ వాసులతో కలిసి ఆయన పర్యటించారు. సమస్యల యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులను వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం వెంకన్న హిల్స్ ఫేస్-1/2 లో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జ్ పనులను పరిశీలించారు. రానున్న వర్షా కాలం దృశ్య కాలనీ వాసుల తమ బ్రిడ్జ్ పనులతో పాటు, కన్సిట్ వాల్ ఏర్పాటు చేయాలనీ కోరారు. సంబంధిత అధికారులతోని మాట్లాడి వెంటనే రానున్న వర్షాకాలం దృశ్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.

ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలి



- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

నవతెలంగాణ-బాలానగర్

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. భావితరాలకు మార్గదర్శకంగా ఉండాల్సిన నేటి యువత గంజాయి ఊబిలో చిక్కుకుని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని కార్యదర్శి వెంకటేష్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర నాయకుడు ఆనగంటి వెంకటేష్, మేడ్చల్ జిల్లా నాయకుడు శ్రీకాంత్, మండల కార్యదర్శి చైతన్యరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు, యువత నిర్ణీత లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన వారని, కాగా నేడు గంజాయికి బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆల్కహాల్ తరవాత ఎక్కువ మంది గంజాయికి వ్యసనపరులుగా మారుతున్నారని, అందులో ముఖ్యంగా యువత ఉన్నారని తెలిపారు. వారి పిల్లల భవిష్యత్తు ఎంటో తెలియని స్థితిలో తల్లిదండ్రులు కొట్టుమిట్టాడుతున్నారని ఆయన వాపోయారు. రాష్ట్రంలో గంజాయిని నిర్మూలించే విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ గంజాయి విక్రయదారులు రెచ్చిపోతున్నారని అన్నారు. ఇటీవలి కాలంలో గంజాయితో పట్టుబడ్డ నిందితుల్లో ఎక్కువగా విద్యార్థులు ఉండటం మరింత కలవరపాటుకు గురిచేస్తోందని, భావితరం గంజాయి ఊబిలో కూరుకుపోతోందని తెలియజేశారు. తొలుత ఆ మత్తు కోసం, అనంతరం దాని ద్వారా ధనం సంపాదిం చడానికి అడ్డదారులు తొక్కుతూ నేటి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటటూ తల్లి దండ్రులకు తీరని శోఖాన్ని మిగులుస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయిని నిర్మూలించడంలో ఉపేక్షిం చక మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శ్రీమాన్ ఉపాధ్యక్షులు మల్లేష్, నరేష్ సహాయ కార్యదర్శి వంశీ, అభి, రాజు కోశాధికారి బన్నీ కమిటీ సభ్యులు త్రైని, సాయిసాగర్, అనిల్, సాయికుమార్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను త్వరగా పరిష్కరిస్తాను



- టీఎన్‌జీఓస్ కాలనీ వాసులు, ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టీఎన్‌జీఓస్ కాలనీ వాసులు, పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లను వేయాలని, కరెంట్ అంతరాయం పై చర్యలు తీసుకోవాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దశల వారిగా అన్ని పనులు చేసి ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని తెలియచేసారు. ఎక్కువ ప్రెజర్‌తో నీటి విడుదల చేస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ మంచి నీరు వదలడం జరుగుతుందని తెలిపారు. టీఎన్‌జీఓ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కలిపిస్తామని, విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి సత్వరమే ప్రణాలికలు చేపట్టాలని, అధికారులకు సూచించారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య ఉన్నా, తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలో మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, టీఎన్‌జీఓస్ కాలనీ వాసులు సుధాకర్, సంజీవయ్య సైది రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

రాబోయే వర్షా కాలంలో విద్యుత్ వినియోగ సమయంలో, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను, చెట్ల కొమ్మలను కత్తిరించడం కోసం 11 కేవి ఫీడర్‌ల ద్వారా పవర్ షట్ డౌన్‌కు సంబంధించిన వివరాలను, ఆల్విన్ కాలని సబ్ స్టేషన్ ఏ.ఈ శరత్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కే వి ప్రశాంత్ నగర్ కాలనీ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11కే వి మైత్రీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:00 గంటల నుంచి 12:30 గంటల వరకు

విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాలు...

నైనా గార్డెన్స్ ఏరియా, మైత్రి నగర్, విజ్ఞానపురి కాలనీ, మైత్రీ నగర్ పారిశ్రామిక ప్రాంతం, సాయిబాబా నగర్‌లలో, సోమశీల ఎస్ ఎస్ నుంచి 11 కేవి మాధవరం నగర్ ఫీడర్ మధ్యాహ్నం 1:30 ని॥ నుంచి 03:00 గంటల వరకు.. ఫేస్ 1 లో దీనబంధు కాలనీ మాధవరం నగర్ కాలనీ, కమలా ప్రసన్న నగర్ కాలనీ, విజయ్ నగర్ కాలనీ ఎస్ఎస్ నుంచి 11కే వి జలకన్య ఫీడర్ 03 :30 నుంచి 05:00 గంటల వరకు..

కవర్ చేయబడే ప్రాంతాలు...

జలకన్య, భూదేవి హిల్స్, తులసి నగర్, శివ నగర్‌లలో పవర్ షట్ డౌన్ చేయబడునని ఈ అసౌకర్యానికి చింతిస్తూ, ప్రజలందరూ సహకరించాలని ఆల్విన్ కాలని సబ్ స్టేషన్ ఏ.ఈ శరత్ బాబు కోరారు.

కేపీహెచ్‌బీ : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించడంలో భాగంగా 33/11 కేవి హెచ్ఎంటీ హిల్స్ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11 కెవి శ్రీనివాసం ఫీడర్ పరిధిలోని సోమవారం ఉదయం 11:00 గంటల నుంచి 12:30 గంటల వరకు అరుణా సొసైటీ, జయ నగర్ రోడ్ నెం 1,2,3,4లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని భాగ్యనగర్ ఎ.ఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి హెచ్ఎంటీ హిల్స్ సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11 కెవి శ్రీనివాసం రామ్ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు సాయి చరణ్ కాలనీ, శ్రీ రామ్ నగర్, శ్రీనివాస్ నగర్, ఇందిరా నగర్, 11 కెవి పీజేఆర్ నగర్ 33/11కెవి షంషిగిడ సబ్ స్టేషన్ నుంచి 3:30 నుంచి 5:00 గంటల వరకు.. పీజేఆర్ నగర్, అంబేద్కర్ నగర్, శివమ్మ కాలనీ, జన్మభూమి కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో దాతలు,స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచి వైద్య శిబిరాలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు.ఆదివారం డివిజన్ పరిధి ఆక్సిజన్ పార్క్ ప్రాంగణంలో "గుడ్ హెల్త్ డ్రైవ్"సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆరోగ్యపరీక్షలు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని దైనందిన జీవితంలో ప్రతీ ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా యోగా, వ్యాయామం వంటివి క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరసింహ, మురళీకృష్ణ, సత్యనారాయణ, మధు, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ 101వ జయంతిని విజయవంతం చేయాలి :వల్లారపు

నవతెలంగాణ-ఓయూ

ఈనెల 28న ఎన్టీఆర్ 101వ జయంతిని విజయవంతం చేయాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ వల్లారపు శ్రీనివాస్ కుమార్ కోరారు. తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం అన్ని డివిజన్ల అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు, కుటుంబ సభ్యులకు, అభిమానులు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు "జయంతి" ని విజయవంతం చేయాలన్నారు. సందర్భంగా అన్ని డివిజన్స్ పరిధిలో పలు "సేవా కార్యక్రమాలు" ఎన్నికల కోడ్, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కోరారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే వేడుకలకు హాజరు కావాలని శ్రీనివాస్ కుమార్ కోరారు.

ఫీల్డ్ ట్రిప్‌కు వెళుతున్న విద్యార్థులకు అభినందన..




నవతెలంగాణ-ఓయూ

యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్ జియాలజీ విద్యార్థులు కర్ణాటకలో ఒక వారం రోజుల జియోలాజికల్ సర్వే ఫీల్డ్ ట్రిప్‌లకు హాజరుకానున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జియాలజీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ నవనీత వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ వెంకటరమణ, హాస్టళ్ల వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ నరేష్, ఏఆర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

సైన్స్ క్యాంపులు విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలు



- హైదరాబాద్ నగర జన విజ్ఞాన వేదిక మేధావులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సైన్స్ క్యాంపులు విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలని, వేసవికాలంలో విద్యార్థులకు నిర్వహించే సమ్మర్ క్యాంపులు వారిలో విజ్ఞానాన్ని పెంచడానికి ఎంతో దోహదపడతాయని జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజా అన్నారు. సమ్మర్ సైన్స్ క్యాంపుల ద్వారా విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ, కామన్ స్కూల్ అసోసియేషన్ సంయుక్తంగా మోతీ నగర్ (నియర్ రాయల్ గార్డెన్ ఫంక్షన్ హాల్) లో నిర్వహించిన సమ్మర్ సైన్స్ క్యాంపు ఏడు రోజుల పాటు కొనసాగి ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. స్టోరీ టెల్లింగ్, సరదా సైన్స్, ఫన్ మాథ్స్, మూఢనమ్మకాలు - సైన్స్, పాడుతాం -పాటలు ఆరోగ్యం- ఆహారం, ఖగోళం కనుక్కుందాం లాంటి అంశాలపై విద్యార్థులకు ఆయా రంగాల్లో నిపుణులు అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాజా మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని, సమాజంపై అవగాహనను పెంచుతున్నామని చెప్పారు. సమాజంతోనే సైన్సు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సైన్స్ రంగాన్ని పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సైన్స్ పరిశోధనలకు నిధులు కేటాయించకపోవడాన్ని ఆక్షేపించారు. కామన్ స్కూల్ అసోసియేషన్ నాయకురాలు రేణుక మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులకు వివిధ అంశాల పైన సంపూర్ణ అవగాహన కల్పించామని చెప్పారు. విద్యార్థుల సజనాత్మకతకు పదును పెట్టడానికి సైన్స్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారికి సమాజం పట్ల సైన్స్ పట్ల అవగాహన కల్పించడం ఎంతో అవసరం అన్నారు. సైన్స్ ను పేద విద్యార్థుల్లోకి విస్తతంగా తీసుకెళుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులకు ఆమె కతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ కలిసి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నగర ప్రధాన కార్యదర్శి ఎం రవీంద్రబాబు, కార్యదర్శి ఎస్వీ లింగస్వామి ,నగర నాయకులు సూర్యనారాయణ, అల్తాఫ్, శాంతి, సాయి, కామన్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధులు వివి జ్యోతి, ఉమా, సహజ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓయూలో ఇఎస్ఐ, ఈపీఎఫ్ సరిగా అమలు చేయాని

కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలి



- సీఐటీయు ఓయూ యూనియన్ అధ్యక్షులు టీ.మహేందర్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో ఇఎస్ఐ, ఈపీఎఫ్ సరిగ్గా అమలు చేయని కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని ఓయూ ఔట్‌సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉస్మానియా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టీ.మహేందర్ మాట్లాడుతూ ఓయు లోని మెస్, హాస్టల్‌లలో దాదాపుగా 382 మంది ఉద్యోగులు సైబెక్స్, సాయి సెక్యూర్, బి సెక్యూర్, వెంకటేశ్వర, సంస్థ కాంట్రాక్టర్‌ల పరిధిలో పని చేస్తున్నారు. టెండర్ తీసుకొని సంవత్సరం గడుస్తున్న ఇప్పటి వరకు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లను సక్రమంగా అమలు చేయకుండా, ఉద్యోగి యొక్క కుటుంబ సభ్యుల పేర్లను ఒక్కరివి కూడా చేర్చకపోవడం దుర్మార్గమన్నారు. కొన్ని నెలలుగా నుంచి సమయానికి వేతనాలు చెల్లించ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని ఈఎస్ఐ,ఈపీఎఫ్‌లను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు సమయానికి రాకపోవటం వలన కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్‌ల లైసెన్స్‌లను రద్దు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, నాగరాజు, సహాయ కార్యదర్శులు నరేష్, శివ, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి అని త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధన మూర్తి అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాధిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కమ్యూనిస్టు నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పూర్వ లోకసభ సభ్యుడు, పద్మవిభూషణ్ రావి నారాయణ రెడ్డి సంస్మరణ సమావేశం గాన సభ నిర్వహణలో త్యాగరాయ గాన సభలోనీ కళా లలిత కళా వేదిక పై జరిగింది. ముందుగా రావినారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించిన అనంతరం కళావీఎస్ జనార్ధన్ మూర్తి మాట్లాడుతూ చరిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి అగ్రభాగాన ఉండి నైజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య వ్యవస్థ అంతమొందించే వరకు అలుపెరుగని పోరాటాలు చేసాడని గుర్తు చేశారు. ప్రముఖ గాయని ఆమని మాట్లాడుతూ హైదరాబాద్ స్టేట్‌లో గ్రామగ్రామాన రైతాంగ పోరాటాన్ని పెను తుపానులా హెూరెత్తించిన విప్లవ వీరుడు, హైదరాబాదు సంస్థానంలో విధ్వంసం కాండతో నరమేధం సృష్టించిన రజాకార్ల ఆకృత్యాలను అరికట్టడానికి అజ్ఞాతంగాఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటుచేసి రావి నారాయణరెడ్డి చేసిన సాయుధ పోరాటం సమామరణీయం అన్నారు.

1951-52లో తొలి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థిగా నల్గొండ లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి నాటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ ఓట్లు సాధించి పార్లమెంటులో తొలి అడుగుపెట్టిన ఘనత రావి నారాయణరెడ్డి సాధించాడని చెప్పారు. తన 500 ఎకరాల సొంత భూములను పేదలకు దానం చేసి అణగారిన వర్గాలకు అండగా నిలిచినా రావి నారాయణరెడ్డి ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ మూర్తి, హైకోర్టు న్యాయవాది, ప్రముఖ గాయని తోట శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ డివిజన్ సారథి సొసైటీలో స్థల వివాదం..

- అమీర్పేట కార్పొరేటర్ సరళ పై చేయి చేసుకున్న ప్రత్యర్థులు
- బోరబండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన అమీర్పేట కార్పొరేటర్ సరళ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ డివిజన్ సారథి సొసైటీలో 216 గజాల స్థలంలో గత 20 సంవత్సరాలుగా స్థలముపై ఇరు వర్గాలు కోర్టుకు వెళ్లడం జరిగింది. గత నాలుగు సంవత్సరాల క్రితం నుండి ఖైరతాబాద్ ఎమ్మార్వో సిబ్బంది ఆ స్థలంలో ప్రభుత్వ బోర్డు అని ఏర్పాటు చేయటం జరిగింది. అయితే అనేకసార్లు బోర్డు ఏర్పాటు చేయటం గుర్తు తెలియని వ్యక్తులు బోర్డును తీసి పక్కన పడవేయటం, ధ్వంసం చేయటం జరుగుతుంది. అదే స్థలంలో లారీలు, ఆటోలు అక్రమంగా పార్కు చేస్తున్నారు. అయితే ఆదివారం అమీర్పేట కార్పొరేటర్(బి.జె.పి) సరళ తన అనుచరులతో వచ్చి మాకు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నామని స్థలము మాదే అని అక్కడ ఉండగా, మరొక వర్గం వారు ఈ స్థలము మాది మాకు కూడా కోర్టు ఆర్డర్ ఉందని అక్కడకు వచ్చి కార్పొరేటర్ సరళ వెంట వచ్చిన అతనిపై చేయి చేసుకొనటం జరిగింది. అడ్డు వచ్చిన కార్పొరేటర్ సరళపై కూడా చేయి చేసుకున్నాడు. వెంటనే బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడకు పోలీసులు ఎస్ఐ నాగోల్ మీరా మరియు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్ అక్కడకు చేరుకొని దాడి చేసిన వ్యక్తిని అదుపులోనికి తీసుకొని స్టేషన్కు తరలించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ నగర్ ఏసిపి వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను పోలీస్ స్టేషనుకు వచ్చి మీ వద్ద ఉన్న ఆధారాలు పేపర్లు పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఖైరతాబాద్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కూడా సంఘటన స్థలానికి పిలిపించి వివరణ కోరగా.. ఈ స్థలము ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశామని అనేకసార్లు బోర్డులు తీసి అక్రమంగా ఉంటున్నారని తెలిపారు. ఎమ్మార్వో ఆఫీస్‌లో ఎలాంటి ఆధారాలు ఎవరు చూపించలేదని ఏసీ పి.అధికారి ముందు బహిరంగంగా చెప్పడం జరిగింది. ఇరు వర్గాలను బోరబండ పోలీస్ స్టేషనుకు తరలించి కేసు విచారిస్తున్నారు.

జూన్ 2తో ముగియనున్న వేసవి శిక్షణ శిబిరం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున పేద విద్యార్థులకు క్రీడాకారులకు బోయిన్‌పల్లి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను జూన్ 2తో ముగిస్తాయని అసోసియేషన్ చైర్మెన్ జంపన ప్రతాప్ తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి బోయిన్ పల్లి క్రీడా మైదానంలో పిల్లలకు, యువకులకు వేసవి శిక్షణ శిబిరంలో పలు క్రీడాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరాన్ని ఆదివారం ఆయన సభ్యులతో కలిసి సందర్శించారు. గత 24 సంవత్సరాలుగా తమ అసోసియేషన్ తరపున బోయిన్ పల్లి క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పిల్లలకు శిక్షణతో పాటు ఆయా క్రీడలకు సంబంధించిన దుస్తులు, ట్రాక్ సూట్లు, క్రీడా పరికరాలు అందజేస్తామని ఆయన వెల్లడించారు. జూన్ 2న శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆయా క్రీడలకు సంబంధించి శిక్షణ ఇస్తున్న కోచ్‌లకు సన్మానంతో పాటు, క్రీడాకారులకు ఆయా క్రీడా పరికరాలను అందజేస్తామని జంపన ప్రతాప్ తెలిపారు. సాయిబాబా యాదవ్, కరణ్ సింగ్, యాదగిరి, ప్రభు కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కవితలు జీవిత చరిత్రను తెలియజేస్తాయి



- ప్రముఖ దిగంబర కవి నగ్న ముని

నవతెలంగాణ-బంజారా హిల్స్

కవితా సంపుటి నాది స్వప్నం కాదు అంటే కవితలు జీవిత చరిత్రను తెలియజేస్తాయనీ ప్రముఖ దిగంబర కవి నగ్న ముని తెలిపారు. ఆదివారం జరిగిన ఈ ఆవిష్కరణ సభలో ప్రముఖ దిగంబర కవి నగ్న ముని, సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఇంద్ర పాల శ్రీనివాస్ తాజా కవితా సంపుటి నాది స్వప్నం కాదు సమరం పుస్తకాన్ని అతడి చిన్న నాటి తెలుగు ఉపాధ్యాయులు వి. కష్ణయ్యకు ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ సభలో దిగంబర కవి నగ్న ముని మాట్లాడుతూ... ఇంద్ర పాల శ్రీనివాస్ ఒక నిర్భయ కవి అని, మహా కవి, గొప్ప కవి అనే స్థానాలను పక్కన పెడితే ఇంద్ర పాల శ్రీనివాస్ గొప్ప మహా కవి అన్నారు. ఏనుగు నరసింహ రెడ్డి మాట్లాడుతూ.. ఈ కాలపు అత్యద్భుత కవిని కండ్ల ముందర చూస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. అతని వాక్య నిర్మాణమే అత్యంత శక్తి వంతమైనదన్నారు. అసుర మాట్లాడుతూ.. ఇంద్ర పాల శ్రీనివాస్ నిరాలంకరణ కవి అని అనామకుడిగా ధర్మాగ్రహణ చేస్తున్న కవి అని నేటి సమాజానికి ఇంద్రపాల శ్రీనివాస్ లాంటి కవులు ఎంతో అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు దెంచనాల, మునాసు వెంకట్, ఏనుగు నరసింహా రెడ్డి, అంబటి సురేంద్ర రాజు, రమణ జీవి, తాడి ప్రకాష్, ప్రముఖ విమర్శకుడు సామిడి జగన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తిస్తేనే విద్యార్థులు భవిష్యత్తులో రాణిస్తారు



- తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంగం

నవతెలంగాణ-బంజారాహిల్స్

పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంగం రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ ఏడాది విద్యార్థులకు పురస్కారాలను అందజేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నివసిస్తున్న వీర శైవ లింగ బలిజ విద్యార్థులు విద్యార్థినిలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని పదిలో 9.0 జీపీఏ నుంచి 10జీపీఏ, ప్రైవేట్ పాఠశాలలో చదువుకొని 9.2, 10 జీపీఏ పొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించి సన్మానించనున్నట్లు తెలిపారు. జూన్ 9న బిర్లా ఆడిటోరియంలో జరిగే ఈ వేడుకలను అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరవుతున్నారని చెప్పారు. అర్హులైన విద్యార్థులు rvllbsssc2024 @gmail.com, 9550445747 నంబరుకు వివరాలు పంపించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ శివప్ప, శెట్టి శివ, శివకుమార్, శివచరణ్, రాచప్ప, సూర్యశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పాట ఉన్నంతకాలం బెల్లి లలితక్క బతికే ఉంటుంది

నవతెలంగాణ-ఓయూ

ప్రజాస్వామిక తెలంగాణకై గొంతెత్తి తన ఆటను తన పాటను తెలంగాణ విముక్తికి అంకితమై పనిచేస్తున్న బెల్లి లలితక్క ను నాటి పాలకులు నల్లదండు ముఠా అత్యంత పాషవీకంగా 17 ముక్కలుగా నరికి వేయబడి నేటికీ 25 ఏండ్లు గడిచింది. ఈ సందర్భంగా లలితక్క కలలుగన్న ప్రజాస్వామిక తెలంగాణ సాధనకై విద్యార్థి యువతరం ఆస్ఫూర్తిలో ముందుకు సాగాలని 25వ, వర్ధంతి సభను ఆదివారం రాత్రి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట బావ సారూప్యత సంఘాల, విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కాశీం, పరిశోధక విద్యార్థి కోట శ్రీనివాస్, బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాష్ అట్లాగే వివిధ విద్యార్థి నాయకులు, ఇడుగు రంజిత్,నామ సైదులు, శరత్ నాయక్, కంచర్ల బద్రి,ఉదయ్, సుమంత్, పెంచాలా సతీష్, శ్రవణ్ యాదవ్, విద్యార్థ నాయకులు పాల్గొన్నారు.

ఆస్కీలో త్వరలోనే ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు



నవతెలంగాణ-బంజారా హిల్స్

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆస్కిలో గేట్ నెంబర్ 2 లో ప్రధాన రహదారి ఎదురుగా సుల్తాన్ ఉలోమ్ కాలేజ్ వద్ద త్వరలోనే ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా పనులను ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ రహదారిలో అటు పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ వరకు ఒక్క పెట్రోల్ బంక్ లేకపోవడంతో ఈ రహదారిలో వాహన చోదకుల కష్టాలు గణనీయంగా తగ్గి వారికి చాలా వరకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ నుంచి చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మీదుగా యూసఫ్ గూడ పోలీస్ బెటాలియన్ కోట్ల విజయ భాస్కర రెడ్డి స్టేడియం వద్ద రెండు మూడు సంవత్సరాల క్రితమే ఓ ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ నాయకుడు సుధీర్ కుమార్‌కు కుటుంబ సభ్యుల నివాళి



నవతెలంగాణ-కల్చరల్

కాంగ్రెస్ నాయకులు సుధీర్ కుమార్ 22 వర్ధంతి సందర్భంగా కర్మాంఘాట్‌లోని వారి విగ్రహం వద్ద నివాళులు అర్పించి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వారి కుమార్తె రమ్యాతేజ , కుమారుడు శశిసుధీర్, అల్లుడుడాక్టర్ సుకినరెడ్డి, స్థానిక నాయకులు రమేష్ గౌడ్, శ్రీనివాస్ నాయుడు వినోద్ రంగినేని శ్రీనివాస్ తదితర అభిమానులు పాల్గొన్నారు. నీలోఫర్ హాస్పిటల్ వద్ద బసవతారకం హాస్పిటల్ దగ్గర కూడా కుటుంబ సభ్యులు అన్నదానం చేసారు.

ఘనంగా మా భగవతికా విశాల్ జాగరణ



నవతెలంగాణ-అంబర్‌పేట

భత్రి తెలి నవ యువక్ సేవా ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మా భగవతికా విశాల్ జాగరణ వేడుకలు కాచిగూడ భత్రి తెలి సంఘ్ భవన్‌లో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిగిన జై మాత పూజలు, భజనలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత సంతరించుకుంది. విద్యుత్ దీపాల కాంతులతో, అందమైన డెకరేష న్‌తో ఆ ప్రాంతమంతా చూపరులను ఎంతగానో ఆకర్షించింది. కళాకారుల నృత్యాలు, దేవతామూర్తుల అలంకరణలు, మహిళల ఆటపాటలు, యువతుల దాండి యా, కోలాటం అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, సందీప్, అనూప్, శ్రీకాంత్, జైకరణ్, అశ్విన్, ఉదయ్, నికేష్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'విజన్ ఐఏఎస్ అకాడమీ' 100కి పైగా నగరాల్లో యుపీఎస్‌సీ అభ్యాస్ ప్రిలిమ్స్ నిర్వహిస్తున్నాం...



- హైదరాబాద్, బ్రాంచ్ హెడ్ హరేకృష్ణ సింగ్

నవతెలంగాణ-ముషీరాబాద్

ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ టీచింగ్‌లో సంస్థ అయిన విజన్ ఐఏఎస్, భారత దేశంలోని 100కి పైగా నగరాల్లో యుపీఎస్‌సీ అభ్యాస్ ప్రిలిమ్స్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బ్రాంచ్ హెడ్ హరేకృష్ణ సింగ్ తెలిపారు. యుపీఎస్‌సీ ప్రిలిమ్స్ పరీక్ష యుపీఎస్-సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష ప్రయాణానికి నాంది పలికుతుంది. దీని ప్రాముఖ్యతను గుర్తిస్తూ, ఆబ్జెక్టివ్ థింకింగ్, రీజనింగ్ స్కిల్స్‌ను విశ్లేషించడంలో పెంపొందించడంలో ఔత్సాహికులకు సహాయ పడేందుకు అశోక్ నగర్‌లోని విజన్ ఐఏఎస్ అభ్యాస్ ప్రిలిమ్స్‌ను నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా విజన్ ఐఏఎస్, హైదరాబాద్ బ్రాంచ్ హెడ్ హరేకృష్ణ సింగ్ మాట్లాడుతూ' యుపీఎస్‌సీ అభ్యర్థులకు ఇది సంతోషకరమైన రోజు దేశవ్యాప్తంగా 100కి పైగా పరీక్షా కేంద్రాలలో అభ్యాస్ ప్రిలిమ్స్ మాక్ టెస్ట్ 3లో హాజరయ్యే అభ్యర్థులకు విజన్ ఐఏఎస్ తన తలుపులు తెరుస్తోందని తెలిపారు. అభ్యాస్ దేశవ్యాప్తంగా యుపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ లో రాణించాలనే లక్ష్యంతో వున్న అందరినీ ఏకం చేస్తుందన్నారు.

విశ్వకర్మ లెజండరీ అవార్డుల ప్రధానం



నవతెలంగాణ-ముషీరాబాద్

విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్స్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురు విశ్వకర్మ ప్రముఖులను విశ్వకర్మ లెజండరీ అవార్డు 2024తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఠాధీశ్వర్లు, జగద్గురు శ్రీ శ్రీకాంతేంద్ర స్వాములు మాట్లాడుతూ సమాజ హితం కోసం సేవ చేసే వారిని గుర్తించి అవార్డులతో సత్కరించడం అభినందనీయమన్నారు. ఇలాంటి అవార్డులు వారిలో మరింతగా ప్రోత్సాహాన్ని నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమీషన్ సభ్యులు తాలోజు ఆచారి, చర్లపల్లి జైలు డీప్యూటీ సూపరెండెంట్ దార్ల కాలిదాస్, తెలంగాణ సాహితీ అకాడామీ కార్యదర్శి నామోజు బాలాచారి, ఐఎన్పిఆర్ పబ్లిక్సేటీ సెల్ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ డాక్టర్ బి.నిలీమాకృష్ణమూర్తి, పుష్పగిరి విశ్వనాథం, దిలీప్చరి, దరువు అంజన్న, తాటికొండ రంగబాబు, జితేంద్రచారి, గణేష్ బాబు , విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరానికి ఏబీఆర్ఎస్ఎం కృషి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరానికి ఏబీఆర్ ఎస్ ఎం (అఖిల భారతీయ రాష్ట్రీయ శైనషిక్ మహ సంఘ్) కృషి చేసిందని జాతీయ సహాయ కార్యదర్శి గుంతా లక్ష్మణ్ అన్నారు. ఏబీఆర్ఎస్ఎం తెలంగాణ శాఖ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శాఖను బలోపేతం చేయాలని అందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. ఏలూరి యాదయ్య మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా విద్య ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ బలోపేతానికి చేసిన కార్ర్యమాలను వివరించారు. రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య కిషన్, ఉపాధ్యక్షులు డాక్టర్. కే.భాస్కర్, జగన్ వివిధ విశ్వ విద్యాలయాల ఆచార్యులు, ఇంజనిరింగ్ కళాశాల ఆచార్యులు, వివిధ కళాశాలల ఆచార్యులు, జాతీయ పరిశో ధన సంస్థల శాస్త్రవేత్తలు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షల శిబిరానికి స్పందన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నిత్యం బిజీగా ఉండే మానవ జీవితంలో మూడు నెలలకు ఒక్కసారైనా వైద్య పరీక్షలు చేసుకోవాలని కింగ్ కోఠి కామినేని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఐసాక్ సౌమిల్ తెలిపారు. కింగ్ కోఠి కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నాలుగు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. అబిడ్స్ లోని ఆఘాఖాన సొసైటీ కమ్యూనిటీ హాల్‌లో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బీపీ, షుగర్, బ్లడ్ చెకప్స్, బ్లడ్ ఇన్విస్టిగేషన్, కండ్లకు, డెంటల్‌కి సంబంధించిన పరీక్షలు చేసినట్లు వివరిం చారు. పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా ఫ్రీగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. బిజీ లైఫ్‌కి అలవాటుపడ్డ ప్రజలు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే మెడికల్ షాం కి వెళ్లి మాత్రలు తీసుకొని వేసుకుంటు న్నారని అది తాత్కాలిక ఉపశమనమేనని పరీక్షలు చేసుకొని వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం తీసుకోవాలని పిలుపునిచ్చారు. పని ఒత్తిడి, సరైన వ్యాయామం లేక చిన్న వయసులోనే జబ్బులు అతిగా వస్తున్నాయని తప్పనిసరిగా ప్రతిఒక్కరూ నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కింగ్ కోఠి కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫ్రీ హెల్త్ క్యాంప్‌లు నిర్వహి స్తున్నామని ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని డాక్టర్ ఐసాక్ సౌమిల్ కోరారు. ఈ హెల్త్ క్యాంప్ లో నిర్వాహకులు అనురాగ్ , శ్రీనాథ్ లతో పాటు లాబ్ టెక్నీషియన్లు అంజు, భార్గవి, సంకీర్తన, రజిత తదితరులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 253వ అన్నదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

రోడ్లు ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు అనాధలు మతి స్థిమితం లేని వారికి స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 253 అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ హాజరై మాట్లాడుతూ రోడ్లపైన దుర్భర జీవితాన్ని గడుపుతున్న అభాగ్యులందరికీ ఆశ్రయం కలిపించి ఆహారం వైద్యం అందించి స్వయం ఉపాధి కల్పించి నూతన జీవితాన్ని అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు కుషికోమల్, హరీష్ కుమార్, అఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను నేరవేర్చి సమైక్యస్ఫూర్తిని కాపాడాలి

- తెలంగాణ అడ్వకేట్ జేపీసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను నేరవేర్చి సమైక్యస్ఫూర్తిని కాపాడాలని తెలంగాణ అడ్వకేట్ జేపీసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ను ఆంధ్రప్రదేశ్‌కు మరో పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా ఉండాలని రాష్ట్రపతికి ఆర్డినెన్స్ ఇవ్వాలని సరైనది కాదని తెలిపారు. ఈ సందర్భంగా పులి గారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని ఇంకా విభజించాల్సిన సంస్థలు ఆస్తులు నిధులు హామీలను వెంటనే విభజించాల్సిన ఆవశ్యత ఉందన్నారు. సెక్షన్ ఫైవ్ ప్రకారం గత పది సంవత్సరాల నుండి ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఏపీకి ఉమ్మడి రాజధానిగా మరో 10 సంవత్సరాలు హైదరాబాద్ ఉండే విధంగా రాష్ట్రపతి ఓ ఆర్డినెన్స్ ఇవ్వాలనడం ముమ్మాటికీ సరైన పద్ధతి కాదన్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభు త్వం సమైక్య స్ఫూర్తితో రాజ్యాంగబద్ధంగా విభజించాల్సిన బాధ్యతను ఉదాసీన వైఖరి అవలంభించిందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి విభజన చట్టంలోని హామీలను నేరవేర్చి సమైక్యస్ఫూర్తిని కాపాడాలని కోరారు. ప్రభుత్వాలు రాజకీయ వైఖరి కారణంగా ఏపీ రాజధాని విషయం ఆలస్యం అవుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రెండు సంవత్సరాలలోనే సెక్రెటరీ కట్టింది రాష్ట్రంలో శాంతిని సమాజాన్ని కాపాడిందని తెలిపారు. మరో 10 సంవత్సరాలు ఉమ్మడి రాజధాని అంటే తెలంగాణ పౌర సమాజం అంగీకరించదన్నారు.

29, 30 తేదీల్లో బాల సాహిత్య సమ్మేళనం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఈనెల 29, 30తేదీల్లో హైదరాబాదులో పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో మాతృమూర్తి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది బాల సాహితీవేత్తలు, రచయితలు, తెలుగు ఉపాధ్యాయులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారని మూడేళ్లుగా పరిషత్తు బాల సాహిత్య వికాసం కోసం నిర్వహిస్తున్న పలు రకాల కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనాన్ని శాంతా- వసంత ట్రస్టు అధ్యక్షులు పద్మభూషణ్ గౌరవ స్వీకర్త డాక్టర్ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి, పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే ప్రారంభోత్సవంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి విశిష్ట అతిథిగా పాల్గొంటారని తెలిపారు. బడిలో తెలుగు భాష, బాల సాహిత్యం- పత్రికలు, కథ చెప్పే కళ, సంగీత, నృత్య, నాటక, చిత్రలేఖన, శిల్ప, జానపద కళల పరిచయం, 'బాల సాహిత్యం -ప్రమాణాలు', బాల సాహిత్యం- గ్రంథాలయాలు' మొదలైన ప్రత్యేక చర్చాగోష్ఠులు, సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. బాలల సమగ్ర వ్యక్తిత్వ వికాసం కోసం పరిషత్తు వెలువరిస్తున్న గ్రంథాల పరంపరలో తెలుగు 'భాషా సాహిత్య వైభవం', 'ఆరోగ్యం -విజ్ఞానం' గ్రంథాలతో పాటుగా పిల్లల కోసం పెద్దలు, పిల్లల కోసం పిల్లలు రాసిన కథల ఐదు సంపుటాలు ఈ సందర్భంగా ఆవిష్కృతం కానున్నాయని తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ రాధారెడ్డి, మోడల్ స్కూల్స్ సంయుక్త సంచాలకురాలు సరోజినీ దేవి అతిథులుగా పాల్గొంటారన్నారు.

పిల్లల కోసం పెద్దలు, పిల్లల కోసం పిల్లలు రాసిన కథలను సంకలనాలుగా వెలువరించనున్నట్లు పత్రికా ముఖంగా పరిషత్తు గతంలో ప్రకటించింది. పెద్ద లు రాసిన కథలు 256, పిల్లలు రాసిన కథలు 61 రాగా వాటిల్లో 97 పెద్దల కథలను, 31 పిల్లల కథలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. కథలకు బహుమతులు అందజేస్తామని చెన్నయ్య పేర్కొన్నారు.

ప్రయివేటు, కార్పోరేట్ విద్యాసంస్థల దోపిడీ ఆపాలి

- ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి
- నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.అశోక్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రయివేటు, కార్పోరేట్ విద్యాసంస్థల దోపిడీ ఆపాలని, ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.అశోక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. అశోక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పాఠశాల ఫీజుల నియంత్రణకు క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావాలని, అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడటం లక్ష్యంగా పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలలు ప్రతి విద్యాసంవత్సరంలో 10% నుండి 30% వరకు ఫీజులను పెంచుతున్నాయనీ, ప్రయివేట్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్య ఖర్చులను ఎదుర్కొంటున్న తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం దీని ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) తరహాలో ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ వేయాలన్నారు. ఇంతకుముందు పాఠశాలలు తమ ఫీజు నిర్మాణాలను పాలకమండలి ద్వారా నిర్ణయించడానికి అనుమతించారనీ, ఇందులో పాఠశాల అధ్యక్షుడు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది ప్రతినిధి, తల్లిదండ్రులు- ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు జిల్లా విద్యా అధికారి (డీఈఓ) నామినేట్ చేసిన పేరెంట్స్ ఉన్నారన్నారు. పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయడం వల్ల తల్లిదండ్రులకు ఎంతో కొంత ఉపశమనం కలుగుతుందనీ, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో మరింత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఫీజులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దేశం వ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలులో ఉందని ఎల్‌కేజీ ఫీజులు రూ.50 వేల నుండి లక్ష రూపాయల దాకా ఉన్నాయని, ఇంటర్నేషనల్ పాఠశాలల పేరుతో నర్సరీ చదివే విద్యార్థుల నుండి రూ.4 లక్షలు వసూళ్లు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 10,700 పైచిలుకు కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్ ఉండగా, వీటిలో దాదాపు 32 లక్షల మంది చదువుతున్నారు. కొన్ని సూళ్లకు మౌలిక సదుపాయాలు లేకపోయినా అధికారులు అనుమతులు ఇస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై 2017 మార్చ్ నెలలో ప్రొఫెసర్ తిరుపతి రావు నేతృత్వంలో కమిటీ వేసిందనీ, ఆ కమిటీ వివిధ రాష్ట్రాల్లోని స్కూల్‌లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందనీ, అందులో ఏటా 10 శాతం ఫీజు పెంచుకోవచ్చని ప్రతిపాదించిందనీ, అయితే ఫీజుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించిందన్నారు. స్కూల్ ఫీజుల పెంపును నియంత్రిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ చట్టం చేయాలని నిర్ణయించిందన్నారు. 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో 11 మంది మంత్రులతో ఫీజు నియంత్రణకు విధివిధానాలు రూపొందించేందుకు ఉప సంఘాన్ని నియమించిందనీ, ఈ కమిటీ కూడా ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్‌లో 10 శాతానికి మించి ఫీజు పెంచడానికి వీలు లేదని సిఫారసులు చేసిందన్నారు. వీటిపై ప్రత్యేక చట్టం చేసేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. కానీ ఆ ప్రయత్నం జరగలేదన్నారు. ప్రత్యేక చట్టం చేయాలని విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ అసోసియేషన్ నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వ పెద్దలు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. వాస్తవానికి ఏ విద్యా సంస్థనైనా ట్రస్ట్ పేరిట నడపాలనీ, దానికి ఒక గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలనీ, కార్పొరేట్ పాఠశాలల్లో నామమాత్రంగా గవర్నమెంట్ బాడీ చూపిస్తున్నా, అధికారం మొత్తం యాజమాన్యం చేతుల్లో ఉంటోందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లెనిన్, ఉపాధ్యకుడు నాగేందర్, శ్రీమాన్, సహాయ కార్యదర్శి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచండి

నవతెలంగాణ-అంబర్‌పేట



పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసిన తర్వాత బీసీ జనాభాకనుగుణంగా రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలు లేదని, ఇప్పటికే అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టి 50శాతం సీలింగ్‌పై పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేసిందన్నారు. అగ్ర కులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజులలో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారని ఆయన పేర్కొన్నారు. 50శాతం జనాభా గల పేద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా అని, ఇదేమీ న్యాయమని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42శాతం రిజర్వేషన్లు పెట్టవచ్చునని ఆయన తెలిపారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని, లేకపోతే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో గ్రామ స్థాయి నుంచి బీసీలు ఉద్యమిస్తారని ఆయన హెచ్చరించారు. విద్యా ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ సుచరితరెడ్డి
- సుందరయ్య పార్కులో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ సుచరితరెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సహకారంతో పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్, 9 స్టార్ హెల్త్ కేర్, జీజీ చారిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సుచరితరెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లుగా బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద ఉన్న 9 స్టార్ హెల్త్ కేర్ ఆసుపత్రిలో ఒక్కరూపాయిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉచితంగా రక్త, బీపీ, డెంటల్, ఆర్థోఫెడ్, ఫిజియో థెరపీతో పాటు వివిధ వైద్య పరీక్షలను సుమారు 500 మందికి ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆర్. వివేక్, ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామి గౌడ్, గంగాధరుప్తా, ఎస్.రమేష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రేష్ట, నవీన్, సురేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ జూ లాజికల్ పార్క్‌లో సందర్శకుల కిటకిట..





నవతెలంగాణ-ధూల్‌పేట్

నెహ్రూ జూ లాజికల్ పార్క్‌లో సందర్శకులతో కిటకిటలాడింది. రికార్డ్ స్థాయిలో సందర్శకులు జూను సందర్శించారు. వీక్ ఎండ్ కావడంతో స్కూల్ రీ ఓపెన్ సమీపిస్తుండడంతో చిన్నారులు పెద్దలు తేడా లేకుండా జూ పార్క్ సందర్శించి తిలకించారు. సుమారు 30,361మంది సందర్శకులు వచ్చారు. దీంతో జూ యాజమాన్యం అదనపు బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ టిక్కెట్ల బుకింగ్ సిస్టమ్‌ను ప్రసారం చేసింది. అదనపు డ్రింకింగ్ వాటర్ యూనిట్లు, షెల్టర్లు, మొబైల్ పెట్రోలింగ్ బృందాలు, ప్రధాన ద్వారం వద్ద అదనపు బుకింగ్ కౌంటర్లు, బ్యాటరీతో నడిచే వాహనాలు, టాయ్ ట్రైన్, సిబ్బంది అందరినీ సజావుగా నిర్వహించేందుకు కేటాయించిన నిర్దిష్ట పాయింట్లను అప్రమత్తం చేశారు. దీనితో పాటు సందర్శకులకు వన్యప్రాణుల సంరక్షణ సందర్శకులకు ఒక షార్ట్ మూవీని అవగాహన కల్పించారు. ప్రధాన ద్వారం వివిధ ప్రదేశాలలో పెంపకం కార్యక్రమాన్ని ప్రదర్శించారు.

ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా దయానంద్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా రంగారెడ్డి జిల్లాకు చెందిన శబాంకర్ దయానంద్ నూతనంగా నియ మితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ దయానంద్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని ఆయన వెల్లడించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న తనను గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నియమించిన ఐఎన్‌టీయూసీ నాయకులకు, అందుకు సహకరించిన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను అపహరించిన వారిని కఠినంగా శిక్షించాలి

- బీజేపీ ముషీరాబాద్ కో కన్వీనర్ గడ్డం నవీన్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాంనగర్ డివిజన్ పరిధిలో కొంతమంది దుండగులు అర్ధరాత్రి సమయంలో గోవులను అపహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ కో కన్వీనర్ గడ్డం నవీన్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గోమాతల మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్న దొంగలను పట్టుకోవాలని వారిని కఠినంగా శిక్షించి మరోమారు ఇలా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ సానుకూలంగా స్పందించి వారి కుటుంబాలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కేసు పై మేము కూడా సీరియస్‌గా ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అవసరమనుకుంటే నష్టపోయిన వారి కుటుంబాలకు నా వంతుగా కూడా సహకారాలు అందిస్తానని ఇన్‌స్పెక్టర్ తెలియజేశారు. ప్రజలందరూ ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలని అపరిచిత వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం తెలియజేయాలని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగుల మధు యాదవ్, వినోద్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రాకేష్, నవీన్, విక్రమ్, సాయి, రవి యాదవ్, మేకల సత్యనారాయణ, చింటూ, వివేకానంద, పసుపులేటి రాము, సురేష్, లడ్డు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


సెల్లార్ పార్కింగ్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ - నాగోల్

నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడలో ఉన్న రాజీవ స్వగృహ సహ భావన టౌన్షిప్‌లో ఏర్పాటు చేసిన సెల్లార్ పార్కింగ్‌ను ఆదివారం కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సహభావన టౌన్షిప్ ఏ బ్లాక్ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, సిద్దాల ఐలయ్య, మనోజ్, సహభావన టౌన్షిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ప్రసాద్



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సీనియర్ న్యాయవాది పసుపులేటి ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆదివారం నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. పసుపులేటి ప్రసాద్ రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు హెల్త్ కార్డు 5 లక్షల పరిమితితో న్యాయవాదుల తల్లీదండ్రులకు కూడా హెల్త్ కార్డు వర్తించే విధంగా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. జూనియర్ న్యాయవాదులకు రూ.5,000 స్టైఫండ్ కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చట్టసభల్లో ప్రవేశపెట్టే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తనను కన్వీనర్‌గా నియమించినందుకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌కు, సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఉప్పల



నవతెలంగాణ- నాగోల్

వనస్థలిపురంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆల్ ఇస్ వెల్ ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలు టాలెంట్ అండ్ మల్టీ టాలెంట్ అవార్డ్స్ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ మరియు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు దాదాపు 108 మందికి అవార్డ్స్ అందజేసినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అవని వండర్స్ ఇన్ ఫా డెవలప్మెంట్ ఎండీ వి.కుమార్, ఆర్గనైజేషనల్ కిశోర్ గుప్త, సతీష్, రంగారెడ్డి జిల్లా ఐవీఎఫ్ అధ్యక్షుడు చింతల రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్‌లో గాలివాన దుమారం

- పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల పాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఆందోళనలో ప్రజలు





నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

భారీ ఈదురు గాలితో కూడిన వానరావడంతో అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని గౌరెల్లి గ్రామంతో పాటు పలు ప్రాంతాల్లో, పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో విద్యుత్ స్తంభాలు, చెట్లు, హెూర్డింగ్‌లు, ఫ్లెక్సీలు నేలకూలాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఆందోళనకు లోనయ్యారు. ఉరుములు, గాలి దుమారంతో కూడిన వర్షాల వలన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలను కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ - తుర్కయంజాల్

ఇంజపూర్ సబ్ స్టేషన్ పరిధిలో నేడు (సోమవారం) ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు చెట్ల కటింగ్ కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి రంగనాయకుల గుట్ట ఫీడర్ పరిధిలో మైత్రి వనం కాలనీ, బ్రహ్మణపల్లి గ్రామం, బ్రహ్మణపల్లి ఏజీఎల్, కోహెడ ఏజీఎల్, తొర్రూర్ ఏజీఎల్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఏఈ రాములు కోరారు.

పాలకులు మారినా ఎక్కడి సమస్యలు అక్కడే..



- పలు కాలనీలలో డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు
- రోగాల బారిన పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రభుత్వాలు మారినా.. ప్రజాప్రతినిధులు మారినా కొన్ని కాలనీలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. మా సమస్యలను పరిష్కరించే నాయకులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు శ్రీరామ కాలనీ, బృందావన్ కాలనీలు ఏర్పడిన నాటి నుండి నేటి వరకూ డ్రయినేజీ వ్యవస్థ, రోడ్లు లేవని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న మట్టి రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. ఈ మురుగు నీరు గుంతలు ఉన్న చోట్ల నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఈగలు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. గతంలో పలు కాలనీలలో ప్రజలు డెంగ్యూ, మలేరియా తదితర రోగాలకు గురై మృతి చెందిన ఘటన ఎన్నో ఉన్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పరిష్కారం చేయటంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడుతున్నారు. కాలనీ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించాలని అనేక సార్లు స్థానిక కౌన్సిలర్‌కు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 17వ వార్డులో డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని, రోడ్లు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..



మున్సిపల్ పరిధిలోని శ్రీరాం కాలనీ, బృందావన్ కాలనీతో పాటు మరి కొన్ని కాలనీలలో రోడ్లు, డ్రయినేజీలు లేవు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో కాలనీవాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తాను. వాటితో రోడ్లు, డ్రయినేజీలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

జీహెచ్ఎంసీ కమిషనర్ వాణిరెడ్డి

తల్లితో సహా పిల్లలు అదృశ్యం



నవతెలంగాణ - చైతన్యపురి

తల్లితో సహా ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 11లో నివాసముండే సరిత(43), మృదుల్ (12), తరుణ్ (9)లు ఈ నెల 22వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లారు. బంధువులు ,స్నేహితులు, ఇరుగుపొరుగు వారిని సంప్రదించినా ఫలితం లేకపోవడంతో భర్త సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సరిత మెంటల్లి అన్ఫిట్‌గా ఉన్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తా



- కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నవతెలంగాణ - వనస్థలిపురం

త్వరలోనే బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ కాలనీ వాసుల సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాంధీ నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆదివారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, కరెంటు స్తంభాలు, వీధి దీపాలు, త్రీఫేస్ కరెంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే మీ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆరిఫ్, ట్రెజరర్ లక్ష్మీనారాయణ, అడ్వైజర్ ప్రభాకర్ రావు, రామచంద్రరావు, కార్యవర్గ సభ్యులు శశిధర్, ఆగయ్య అప్పారావు, రామకృష్ణ, జయంత్, గిరి, రామారావు, మస్తాన్, కాలనీ సభ్యులు డిబి చారి, రవీందర్ నాథ్, బుచ్చయ్య, నాగేశ్వరరావు, విక్రమ్ కుమార్, నారాయణ పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం సెక్రటరీ సురేష్ కుమార్, శానిటేషన్ ఎస్ ఎఫ్ ఏ ప్రకాష్ రెడ్డి, ఎలక్ట్రికల్ లైన్ మెన్ రామ్ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏ సమస్య ఉన్నా ఫోన్ చేయండి : సబితమ్మ



నవతెలంగాణ - ఎల్బీనగర్

మీ కాలనీలల్లో ఏ సమస్య ఉన్నా తనకు ఫోన్ చేయాలని.. 24 /7 మీకు అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. సరూర్ నగర్ డివిజన్‌లోని పోచమ్మ బాగ్ నార్త్ కాలనీవాసులు ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్ నగర్ డివిజన్ పోచమ్మ బాగ్ నార్త్ కాలనీ వాసులకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఒక ఎమ్మెల్యేగా ప్రజల సమస్య లను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముందు ఉంటానని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రజలకు 365 రోజులు అందుబాటులో ఉంటానని అని చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఏ ప్రభుత్వం ఉన్నా మీ కాలనీలల్లో ఏ చిన్న సమస్య ఉన్నా నేను ముందుంటా.. మీకు ఇంకా ఏ సమస్యలున్నా అన్నింటిని కూడా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ సమ్మేళనంలో సరూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్ కుమార్, మహేశ్వరం నియోజకవర్గ యూత్ వింగ్ మాజీ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు అంకి రెడ్డి, సుశీలా రెడ్డి, కేశవ రెడ్డి , ఇస్మాయిల్ గౌని శ్రీనివాస్ గౌడ్, వుత్తుపల్లి శ్రీనివాస్, రాజేష్ గౌడ్, రిషి, గోవర్ధన్ రెడ్డి, ప్రత్యూష్, ఆకుల అరుణ్ కుమార్, శేఖర్ రెడ్డి , గుండె నాగరాజు, పందుల రాజు, సాధిక్, జహీర్, సాజిద్, కిరణ్, గుఫ్రాన్, సాయి, సాలమ్మ, భాగ్య మహేశ్వరీ, మంగ, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మోహనా చారి, ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి, కోశాధికారి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

గత ప్రభుత్వ హయాంలో నాలా నిర్మాణ పనుల కోసం మంజూరైన ప్రత్యేక నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి.. త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని నాబిల్ కాలనీలో రూ.4కోట్ల ప్రత్యేక నిధులతో ప్రారంభించిన పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ నాలా నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఎస్ఎన్‌డీపీ రెండవ నాలా పనులను కూడా త్వరితగతిన ప్రారంభించాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో గల నబిల్ కాలనీలో నాలుగు కోట్ల రూపాయల నిధులతో ఎస్ఎన్‌డీపీ నాలా పనులను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన నాలా నిర్మాణ పనులు సక్రమంగా పూర్తికావడం లేదనే విషయాన్ని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని త్వరతిగతిన నాలా పనులను పూర్తిచేయాలని కోరారు. అనంతరం కాలనీవాసులను పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ సయ్యద్ అబ్దుల్లా సాది, మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి, డీఈఈ వెంకన్న, ఏఈ అయేషా, వివిధ వార్డుల కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కైసర్ భాం, మీడియా ఇంచార్జి సాంబశివ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





'వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి'

నవతెలంగాణ - సిటీబ్యూరో

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగా విజయ్ కుమార్ అన్నారు. సుప్రజ ఏ యూనిట్ ఆఫ్ దంతూరి హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో సింగరేణి అసోసియేషన్ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జీవితాల్లో బిజీగా ఉండి తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ వహిస్తున్నారని, దీని వలన చాలా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్రమం తప్పకుండా వివిధ రకాల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సింగరేణి కాలనీ అసోసియేషన్ వారికి మా హాస్పిటల్ నందు ఉచిత ఓపీలు, ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో 150 మందికి వివిధ రకాల ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసినట్టు తెలిపారు. మా హాస్పిటల్ నందు ఖరీదైన వైద్యాన్ని కూడా సామాన్యుడికి అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రాజేశ్వరరావు, మార్కెటింగ్ జీఎం అజయ్ కుమార్ గౌడ్, డాక్టర్స్ జనరల్ సర్జన్ శ్రీనివాస్, రాజేందర్, ఎలిజబెత్, ఏజీఎం మాధవ్, ఏజీఎం మహమ్మద్, ఏజీఎం రాజేందర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి సబితమ్మ పరామర్శ



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ పరిధిలోని సీతాహెూం నివాసి శివ రాజ్ మథుర్ కుమారుడు శ్రీకర్ మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మీర్‌పేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అర్కల కామేశ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, బొక్క రాజేందర్ రెడ్డి, మేకల రవీందర్ రెడ్డి, నాయకులు సిద్ధాల అంజయ్య, అండాలు, సుదర్శన్ రెడ్డి కాలనీవాసులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి రాఘవేందర్ రెడ్డి ఆర్థిక సాయం

నవతెలంగాణ- బడంగ్‌పేట్

అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబానికి మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న మనోహర్ కుటుంబానికి నేను అండగా ఉంటానని.. వైద్యానికి కావాల్సిన ఆర్థిక సహాయం అందజేస్తానని భరోసా ఇచ్చారు. నేటి సమాజంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేదలను మానవత హృదయంతో సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. మానవ సేవే మాధవ సేవగా భావించాలన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేల రూపాయలను ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరి రాకేష్, వినోద్ నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.





తన మూలాలు వెదుకుతూ...

కాశ్మీర్‌లోని అందమైన లోయలు, ఎత్తైన శిఖరాల మధ్య షాహిదా ఖనుమ్ నిశ్శబ్ద సాంస్కృతిక విప్లవానికి నాయకత్వం వహిస్తున్నారు. కనుమరుగవుతున్న తన జాతి సాంప్రదాయ కళలకు జీవం పోసేందుకు నడుం బిగించారు. కాశ్మీర్‌లోని గుజ్జర్ చేతివృత్తులను సంరక్షించేందుకు ఓ కేంద్రాన్ని ప్రారంభించి స్వదేశీ కళలను పునరుద్ధరించడంతో పాటు మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో పని చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

డిసెంబర్ 2022లో తన 25 ఏండ్ల వయసులో ఫిలాసఫీ అండ్ సోషల్ సైన్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆమె గుజ్జర్ కమ్యూనిటీ వారసత్వ కళను పునరుద్ధరించడానికి తన తండ్రి ఇంటిని కేంద్రంగా మార్చుకుంది. నూర్ సెంటర్ అని పిలవబడే ఆ కేంద్రం, కనుమరుగవుతున్న గుజ్జర్ల జీవనశైలి, వారికే ప్రత్యేకమైన రంగురంగుల ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికలు, డిజైనింగ్‌లకు కొత్త జీవం పోస్తోంది. గుజ్జర్లు రాజస్థాన్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ - కాశ్మీర్‌లో అక్కడక్కడ నివసిస్తున్నారు. వాస్తవానికి 2011 జనాభా లెక్కల ప్రకారం జమ్మూ - కాశ్మీర్‌లోని షెడ్యూల్డ్ తెగల జనాభాలో వారు 11.9శాతం ఉన్నారు. ఎప్పటి నుండే వీరిది సంచార జాతి. కాలక్రమేణా చాలా మందికి వ్యవసాయం, పశుపోషణ జీవనోపాధిగా మారింది. అయినప్పటికీ కొంతమంది మాత్రం సంచార జీవనశైలిని కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా జమ్మూ - కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లోని పర్వత ప్రాంతాలలోని పచ్చిక బయళ్ల కోసం తమ పశువులతో వలసపోతుంటారు.

ఖనుమ్ నూర్ సెంటర్

జనాభారీత్యా ఎక్కువ ఉన్నప్పటికీ ప్రభుత్వాలు వీరిని నిర్లక్ష్యం చేస్తున్నారు. భారతీయ చట్టాల ప్రకారం వారికి కొన్ని ప్రయోజనాలు, రక్షణలను కల్పించే షెడ్యూల్డ్ తెగ (ఎస్.టి)గా గుర్తించాలని వారు అడుగుతున్నారు. అయినప్పటికీ వారి వర్గీకరణ రాష్ట్రం నుండి రాష్ట్రానికి మారుతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తర కాశ్మీర్‌లోని బందిపోరా సమీపంలోని అరగామ్ గ్రామంలో ఉన్న ఖనుమ్ నూర్ సెంటర్, ఆ జాతికి చెందిన యువతులు తమ గుర్తింపును తిరిగి పొందేందుకు, పితృస్వామ్య సమాజంలో ఆర్థిక స్వాతంత్ర్యానికి బీజాలు వేసేందుకు విజ్ఞానం, నైపుణ్యాల కేంద్రంగా మారింది.

వ్యాపారం చేయాలని...

శ్రీనగర్‌లోని ప్రభుత్వ మహిళా కళాశాలలో చదువుతున్నప్పుడు ఆమె ఇద్దరు ఆడపిల్లలకు తల్లి. భారతదేశ సరిహద్దు భద్రతా దళాల (బి.ఎస్.ఎఫ్)తో కలిసి పనిచేసే తన భర్త ఆదాయానికి తనకు కూడా సహకరించాలని ఉద్యోగ ప్రయత్నం చేశారు. కానీ అవకాశాలు తక్కువగా ఉండడం, పని కోసం చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చేది. దాంతో ఏదైనా వ్యాపారం చేయాలనుకుంది. నిశితంగా పరిశీలించింది. ఆ క్రమంలో తన పాఠశాల ప్రాజెక్ట్‌లలో ఒకటి గుర్తుకొచ్చింది. అప్పట్లో ఆమె స్నేహితులతో కలిసి భోపాల్‌లోని ఒక సాంస్కృతిక కార్యక్రమంలో విభిన్న గిరిజన వారసత్వంపై ప్రదర్శన చేశారు.

తండ్రి సహకారంతో...

'మా సొంత మూలాల విషయానికి వస్తే ప్రస్తుతం చూపించేందుకు మా వద్ద ఏమీ మిగలలేదు. ఎందుకంటే యువతరం స్వదేశీ ఆభరణాలు, ఉపకరణాలు, దుస్తులు నుండి పూర్తిగా దూరమయ్యారు. అందుకే నేను ఈ పనిని ప్రారంభిస్తే రెండు విధాలుగా ప్రయోజనం అనుకున్నాను' అని ఆమె జతచేస్తున్నారు. వ్యాపారం ప్రారంభించే ముందు సాంప్రదాయ కళలు, హస్తకళలు, పూసల ఆభరణాల తయారీ, అల్లడం, ఎంబ్రాయిడరీ గురించి మరింత తెలుసుకోవడానికి ఖనుమ్ గుజ్జర్ కమ్యూనిటీలోని పెద్దలతో మాట్లాడారు. ఇందులో సోజ్నీ, నీడిల్-పాయింట్ ఎంబ్రాయిడరీ టెక్నిక్, లాస్కా, రంగురంగుల క్లిష్టమైన ఎంబ్రాయిడరీ వర్క్‌లు ఉన్నాయి. తండ్రి అబ్దుల్ మజీద్ సహాయంతో ఆమె నూర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 20 ఏండ్లలోపు మహిళలు, యువ తల్లులు వచ్చి కనుమరుగవుతున్న కళారూపం గురించి ఇక్కడ తెలుసుకోవచ్చు.

సొంత డబ్బుతో...

ప్రారంభంలో చిన్న పరిశ్రమల కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం ఇచ్చే రుణ పథకం నుంచి రూ.3 లక్షల రుణం తీసుకున్నారు. ఆమె గాయకురాలు కూడా. స్థానిక సాంస్కృతిక కార్యక్రమాల నుండి వచ్చిన డబ్బును ముడి పదార్థాలను కొనుగోలు చేయడానికి, శిక్షణ ఖర్చులకు ఉపయోగించేవారు. కమ్యూనిటీ సభ్యులలో నూర్ సెంటర్ గురించి ప్రచారం చేయడానికి సోషల్ మీడియా ఉపయోగపడింది. దాని రెండవ బ్యాచ్‌లో దాదాపు 50 మంది మహిళలు శిక్షణకు హాజరయ్యారు. ప్రతి రోజు ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ మధ్యలో శిక్షణ ఉంటుంది.

ఆర్థిక స్వతంత్రం

2023లో దీని మొదటి బ్యాచ్‌లో 45 నుండి 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారిలో 25 ఏండ్ల ప్రొఫెషనల్ డిజైనర్ కుల్సుమా కూడా ఉన్నారు. ఆమె ఖనుమ్ సెంటర్‌లో నైపుణ్యం పెంచుకునే అవకాశాన్ని పొందింది. 'గత నాలుగేండ్లుగా నేను అరగం సమీపంలోని చిట్టి బండి గ్రామంలో బోటిక్ నడుపుతున్నాను. నూర్ వద్ద నా డిజైన్లలో మన సంప్రదాయ శైలులను చేర్చి, వాటిని ప్రధాన స్రవంతిలో చేర్చే మార్గాలను నేర్చుకున్నాను. ఈ ప్రాంతంలో చాలా మంది మహిళలు ఇప్పుడు రెడీమేడ్ దుస్తుల కంటే కుట్టించుకోవడానికే ఇష్టపడతారు. వివాహం తర్వాత కూడా మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటానికి టైలరింగ్ విపరీతమైన అవకాశాలను తెరుస్తుంది. నేనూ ఈ మార్పులో భాగం కావాలనుకుంటున్నాను' అని కుల్సుమా అంటున్నారు.

బాధ్యత మాదే

ఖానుమ్ నిర్వహిస్తున్న మిషన్ యువతులు, మహిళలకు వారి కుటుంబాల్లో గుర్తింపుని అందిస్తోంది. సాంస్కృతిక వస్త్రాలపై ఇష్టాన్ని కలిగిస్తుంది. 'కమ్యూనిటీ సభ్యులు ఈ నైపుణ్యాలను నేర్చుకోవడానికి, వారి సంప్రదాయాన్ని పునరుద్ధరించడానికి వారి కుమార్తెలను పంపడానికి సంతోషంగా ఉన్నారు' అని ఖనుమ్ చెప్పారు. గత ఏడాది ఎన్‌జీఓ ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సహాయంతో ఆమె లడఖ్, రాంచీలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో తన పనిని ప్రదర్శించి జాతీయ వేదికపై గుర్తింపు పొందారు. మరో విద్యార్థి అయిన 24 ఏండ్ల తాహిరా మాట్లాడుతూ, నూర్‌లో శిక్షణ ద్వారా సాంప్రదాయ కమీజ్‌లకు ఆధునికతను జోడించడం నేర్చుకున్నాను. ఈ ఏడాది కోర్సు ముగియగానే వాణిజ్యపరంగా వస్త్రాలను రూపొందించాలని ఆలోచిస్తున్నాను. మన పూర్వీకులు సంప్రదాయబద్ధంగా ధరించే దుస్తులలో కొన్ని లైనింగ్‌లను జోడించి, కట్‌లను మార్చి చాలా చేయవచ్చు. ఇక్కడే ఫ్యాషన్ డిజైనింగ్‌ను తీసుకురావచ్చు. మేము ఈ చేతిపనుల సృష్టికర్తలం, సమర్థకులం కాబట్టి వాటిని సజీవంగా ఉంచే బాధ్యత మాపై ఉంది' ఆమె అన్నారు.







ఈ మూడూ పాటిస్తే...

చాలామంది రకరకాల అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ తరచుగా అస్పత్రుల చుట్టూ తిరుగుతుంటారు. కానీ అనారోగ్యం బారిన పడటానికన్నా ముందు తమ ఆరోగ్యం తమ చేతుల్లోనే వుందన్న సత్యాన్ని మాత్రం పట్టించుకోరు. దైనందిన జీవితంలో కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే, మన ఆరోగ్యం మన చేతుల్లోనే వుంటుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇంతకీ మన చేతుల్లోనే వున్న ఆ మూడు జాగ్రత్తలేంటో చూద్దాం...

మంచి నిద్ర:



నిద్ర కోసం ఒక ఆరోగ్యకరమైన సమయపాలన పాటించాలి. ఆ షెడ్యూల్ ప్రకారం నిత్యం నిద్రపోవాలి. రోజుకి కనీసం 8 గంటల నిద్ర అవసరం. 8 గంటలపాటు నిద్రపోవడం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరగడమేకాకుండా గుండె సంబంధిత వ్యాధులను దరి చేరనివ్వకుండా చేస్తుంది. అన్నింటికిమించి మనిషి మంచి ఉత్సాహంతో ఉండటానికి ఈ నిద్ర ఎంతో ఉపకరిస్తుంది.

చక్కటి పౌష్టికాహారం:



చక్కటి ఆరోగ్యానికి చక్కటి పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తుంది. ఫైబర్ అధికంగా వుండి, కొవ్వు తక్కువగా వుండే పదార్థాలు ఆహారంగా తీసుకోవాలి. ముఖ్యంగా శాఖాహారానికే అధిక ప్రాధాన్యత ఇస్తే మరీ మంచిది. ఒకవేళ మాంసాహారం తీసుకున్నా.. అవి వేపుడు చేసిన ఆహార పదార్థాలు కాకుండా ఉడకబెట్టినవి.. కోడి, చేపలు లాంటి తేలికపాటి మాంసాహారం మాత్రమే తీసుకోవాలి. తద్వారా అధిక మొత్తంలో కొవ్వు, క్యాలరీలు శరీరంలోకి చేరకుండా జాగ్రత్తపడవచ్చు. పచ్చి కూరగాయల ముక్కలు.. సలాడ్‌గా తీసుకోవడం ద్వారా శరీరానికి తగిన స్థాయిలో విటమిన్లు, ప్రొటీన్లు లభిస్తాయి.

వ్యాయమం:



నిత్యం 30 నుంచి 60 నిమిషాల పాటు వ్యాయామం చక్కటి ఆరోగ్యానికి ఎంతో అవసరం. అలా వారానికి ఐదారుసార్లయినా వ్యాయమం చేస్తే గుండె సంబంధిత వ్యాధులు మీ గుండెకి ఆమడదూరంలో వుంటాయంటున్నారు నిపుణులు. వివిధ రకాల వ్యాయమాలతో శరీరాన్ని ఎల్లప్పుడూ ఫిట్‌గా వుంచుకోవచ్చు.

నిన్న గుజరాత్..ఇపుడు ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

తెలియాల్సి ఉంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆసుపత్రి యజమాని డాక్టర్ నవీన్ కిచ్చిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతను ఢిల్లీలో మరిన్ని ఆస్పత్రులనూ నిర్వహిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. గాయపడిన శిశువులకు వేరే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరి పరిస్థితి అందోళన కరంగా ఉన్నట్టు సమాచారం. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీటీబీ ఆస్పత్రికి తరలించారు. కాగా, మంటలు ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బందికి ఘటనాస్థలంలో అనేక సమస్యలు ఎదురయ్యాయి. జనమంతా గుమిగూడి.. వీడియోలు తీసేందుకు ఎగబడటంతో సహాయక చర్యలకు విఘాతం కలిగింది. అదేవిధంగా.. నీటి లభ్యత లేకపోవడం, తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండటం కూడా అగ్ని మాపక సిబ్బందికి ఇబ్బంది కలిగించింది.

'ఆస్పత్రిలో శనివారం రాత్రి 11.30 సమయంలో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో రెండు భవనాలకూ వ్యాపించాయి. మొత్తం 12 మంది నవజాత శిశువులను హాస్పిటల్ వెనుక కిటికీలోంచి బయటకు తీసుకొచ్చాం. వారిలో ఏడుగురు మరణించారు. మరో అయిదుగురు చికిత్స పొందుతున్నారు' అని అధికారులు తెలిపారు. ఆస్పత్రిలోని ఆక్సిజన్ సిలిండర్ల పేలుడుతో మంటలు మరింత వేగంగా వ్యాపించినట్టు వెల్లడించారు.

ఈ ప్రమాదంపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. 'అమాయక శిశువులను కోల్పోయిన తల్లిదండ్రులకు అండగా ఉంటాం. ఈ నిర్లక్ష్యానికి కారణమైన వారెవర్నీ విడిచిపెట్టం' అని కేజ్రీవాల్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్టు చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ కూడా ఈ ఘటనపై సోషల్ మీడియాలో స్పందించారు.

పౌర సరఫరాలశాఖలో రూ.1100 కోట్ల కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం గతంలో సేకరించి, మిల్లర్ల దగ్గర ఉంచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు వీలుగా రేవంత్ సర్కార్ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించిందని గుర్తు చేశారు. ఈ యేడాది జనవరి 25న ఇదే అంశంపై ప్రభుత్వం ఒక కమిటీని వేసిందనీ, అదే రోజు మార్గదర్శకాలను జారీ చేసి, టెండర్లను ఆహ్వానించిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో క్వింటాలకు రూ.2,100కు ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి రైస్ మిల్లర్లు సుముఖత వ్యక్తం చేస్తే, దాన్ని తిరస్కరించిన ప్రభుత్వం గ్లోబల్ టెండర్ల వైపే మొగ్గు చూపిందని విమర్శించారు.

ప్రత్యేక నిబంధనల పేరిట కేంద్రీయ బండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందూస్తాన్, నాకాఫ్ అనే నాలుగు కంపెనీలకే టెండర్లు దక్కేలా తతంగం నడిపారని పేర్కొన్నారు. వీటిలో కేంద్రీయ బండార్ అనే సంస్థను గతంలో తమ ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టిందని వివరించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆ సంస్థ కోసం నిబంధనలను సవరించారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ సమక్షంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో జరిగిన ఓ అనధికారిక ఒప్పందం ప్రకారమే ఈ అవినీతి అంతా జరిగిందని కేటీఆర్ ఈ సందర్భంగా ఆరోపించారు. సీఎం కార్యాలయానికి ఖర్చులు, ఢిల్లీకి డబ్బులు పంపించాలనే కారణాలతో ప్రభుత్వాధినేతలు ఈ దందాలకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాల కుంభమేళా అని ఎద్దేవా చేశారు. 'అది కాంగ్రెస్ కాదు.. స్కాంగ్రెస్...' అంటూ దుయ్యబట్టారు. గల్లీలో దోచుకోవటం, ఢిల్లీకి సూట్‌కేసులు పంపటమే ఆ పార్టీ నేతల పని అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ అవినీతిపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కూడా స్వయంగా ఆరోపణలు గుప్పిస్తున్నా కేంద్ర ప్రభుత్వం గానీ, ఎఫ్‌సీఐ గానీ స్పందించకపోవటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా దీనిపై కేంద్రం, ఎఫ్‌సీఐ స్పందించాలనీ, లేదంటే ఈ కుంభకోణంలో బీజేపీ పాత్ర కూడా ఉందని భావించాల్సి వస్తుందంటూ కేటీఆర్ హెచ్చరించారు. ఇలాంటి స్కాములపై న్యాయపరంగా కూడా ముందుకెళతామని తెలిపారు.

వర్సిటీ వీసీల ఎంపికపై నిఘా

(మొదటిపేజీ తరువాయి)

కొందరు ఆశావహుల ఇంటికి కూడా వెళ్లి నేరుగా వారినే పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకొందరికి ఫోన్ చేసి గోప్యంగా నిఘా వర్గాలు వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఒకే వ్యక్తి గురించి వేర్వేరుగా దర్యాప్తు చేస్తున్నారని తెలుస్తోంది. అయితే కచ్చితత్వం గల వ్యక్తులను వీసీలుగా తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంత వరకు ఫలిస్తుందో? ఎలాంటి వీసీలు వస్తారో వేచి చూడాల్సిందే. ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిసింది. జిలాల్లో ఉన్న యూనివర్సిటీలకు వీసీల నియామకాల్లో జిల్లా మంత్రులు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. యూనివర్సిటీల్లో రాజకీయ ప్రాతినిధ్యం లేని.. నిత్యం పాఠాలు చెప్పి, విద్యార్థులను, ఉద్యోగులను, ప్రొఫెసర్లను కలుపుకొని పోతూ.. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూసే వారు, వివిధ సంస్థల నుంచి నిధులు తెచ్చుకునే సామర్థ్యం ఉన్న వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం జల్లెడ పడుతున్నది. వీసీలను ఈ ఏడాది జూన్ 5 నుంచి 10లోపు నియమించడానికి వీలుగా ఈ కసరత్తు ప్రారంభించింది.

వర్సిటీలకు పూర్తిస్థాయిలో పాలకమండలి(ఈసీ) కరువు

రాష్ట్రంలో యూనివర్సిటీలకు పాలకమండలి (ఈసీ) గడువు ఫిబ్రవరి 28తో ముగిసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, ఫైనాన్స్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, కమిషన్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఇలా ముగ్గురు ఎక్స్ అఫిషియో సభ్యులతో నడుస్తోంది. దాంతో పూర్తిస్థాయి పాలక మండలిని ఏర్పాటు చేయాలని పలువురు అధ్యాపకులు, విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వీసీలు ఉంటే పాలక మండలి లేదు.. పాలక మండలి ఉంటే వీసీలు లేరు.. కాబట్టి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి రాజకీయ వాసనలు లేని మేధావులు, విద్యావేత్తలను పాలక మండలి సభ్యులుగా నియమించి మండలి ఔన్నత్యాన్ని పెంపొందించాలని యూనివర్సిటీ వర్గాలు కోరుకుంటున్నాయి.

నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలి

- ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణా లోపం కారణంగా ఇంటర్ పరీక్షల్లో పలువురు విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చాయనీ, ఇది నిర్లక్ష్యపు మూల్యాంకనం కారణంగానే జరిగిందనీ, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ విద్యార్థికి లాంగ్వేజ్ సబ్జెక్టులో మొదట 21 మార్కులు వచ్చి ఫెయిల్ అయితే రీవెరిఫికేషన్‌కు అప్లై చేసుకోగా 91 మార్కులు వచ్చాయని తెలిపారు. మరో కామర్స్ విద్యార్థి ఆన్‌లైన్‌లో పేపర్ డౌన్‌లోడ్ చేసుకుంటే మొదట 97 మార్కులు వేసి మళ్లీ 77 కు మార్చినట్టు పేపర్‌లో ఉందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనం విషయంలో బోర్డు గతంలో అనేక తప్పిదాలు చేసిందని గుర్తు చేశారు. ఈ నిర్లక్ష్య వైఖరి కారణంగానే విద్యార్థులు ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా ప్రశ్నాపత్రాలు మూల్యాంకనం చేయడం ద్వారా నష్టపోయిన విద్యార్థులకు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా రీవెరిఫికేషన్ చేయాలన్నారు. విద్యార్థి రీవెరిఫికేషన్ కోరితే ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా ప్రశ్నాపత్రాల స్క్రూటినీ చేసిన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

(మొదటిపేజీ తరువాయి)

ధాన్యాన్ని ఎమ్మెస్పీ ధరకు కొన్న ఏకైక ప్రభుత్వం తమదేనని స్పష్టం చేశారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్ల కోసమే ఆ రెండు పార్టీలు మాట్లాడుతున్నాయని ఆరోపించారు. మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూనే, వారే మిలర్లను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. బయట ధాన్యం గురించి మాట్లాడి లోపల భూముల విషయం చర్చించే సంస్కారం తమది కాదని స్పష్టం చేశారు. మిల్లర్ల దగ్గర డబ్బులు తీసుకోవడం కాదు కదా, కనీసం వాళ్లను తాను ఇప్పటివరకు కలవలేదన్నారు. తనలాంటి నిజాయితీపరుడిపై ఇష్టమెచ్చినట్టు మాట్లాడటం సరైంది కాదని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సన్న బియ్యం ఒక్క గింజ కూడా కొనలేదన్నారు. టెండర్ నిబంధనల ప్రకారం ఒప్పుకుంటే ఎంత ధాన్యం అమ్మినా ప్రభుత్వం కొంటుందని స్పష్టం చేశారు. మిల్లర్లపై ఇంత కఠినంగా ఉన్న ప్రభుత్వం తమదేనని వివరించారు. తప్పు చేసిన మిల్లర్లపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎక్కువగా మాట్లాడితే పెద్ద లీడర్ అవ్వరు
ఏలేటికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సలహా

రాజకీయాల్లో ఎక్కువగా మాట్లాడితే పెద్ద లీడర్ అవ్వరనీ, వాస్తవాలు మాట్లాడితేనే అవుతారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సలహా ఇచ్చారు. 'మహేశ్వర రెడ్డికి ఇంత బుద్ధి వచ్చిందా? బీజేపీలోకి వెళ్లగానే వాళ్ల తప్పులు ఒప్పులుగా మారాయా? లీడర్ కావాలని కోరికతో నిజాలను దాస్తారా?' అని ప్రశ్నించారు. పేపర్లో పేరు వస్తే చాలు అన్న తీరులో వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. తడిచిన ధాన్యాన్ని కొన్న ప్రభుత్వం ఏదైనా ఉందా? సివిల్ సప్లయ్ శాఖ ఇంత అప్పుల్లోకి పోవడానికి కేంద్ర ప్రభుత్వం కారణం కాదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ధాన్యం సగటు ధర రూ. 1700 మాత్రమే, ఇప్పుడు రూ. 2022 ఉందన్నారు. మిల్లర్లు చేస్తున్న తప్పుకు ప్రభుత్వాన్ని బదనాం చేస్తారా? అని ప్రశ్నించారు. 'ఐదేండ్లలో కేసీఆర్ రుణమాఫీ చేయలేదు. మేం ఐదు నెలల్లో చేయబోతున్నాం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ ఇస్తున్నారా?' అని నిలదీశారు.

విద్యుత్ వినియోగం పెరిగింది

గతేడాది డిసెంబర్ కంటే ఈసారి విద్యుత్ వినియోగం మరింత పెరిగిందని, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. వినియోగం పెరిగినప్పటికీ కరెంట్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. కరెంట్ కోతలపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కలిసినా ఆశించిన సీట్లు రావట్లేదనే అక్కసుతో కాంగ్రెస్ సర్కారుపై అబద్దపు ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలకు ప్రభుత్వ పని తీరే నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం అభివృద్ధిలో మార్పు తెస్తోందనీ, ఆ మార్పుకు అడ్డు వస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. వారిలో కూడా మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ అనేక సార్లు కోరామనీ, వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. తమ ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామికంగా ఉందనీ, ప్రజలకు ఇస్తున్న పథకాలను కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పక్కదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఎంజీఎం ఆస్పత్రుల్లో గతేడాది 121 సార్లు కరెంట్ బ్రేక్‌డౌన్ అయిందన్నారు. ఎంజీఎం ఆస్పత్రుల్లో ఎలుకలు రోగుల చర్మాన్ని తిన్నాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖలో అడ్డగోలుగా అప్పులు చేసిందంటూ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నేడు పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. నియోజకవర్గ పరిధిలో4,63,839 ఓటర్లు ఉండగా, అందులో 2,88,189 మంది పురుషులు, 1,75,645 మంది మహిళలు, ఐదుగురు థర్డ్ జెండర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందు కోసం మూడు జిల్లాల పరిధిలో 605 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు జరుగనుంది. మొత్తం 52 మంది బరిలో నిలిచిన ఈ ఎన్నికలో ప్రధానంగా అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని భావిస్తున్నారు.

గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు.

పటిష్టంగా అమలు చేయాలి : ప్రజారోగ్య పరిరక్షణ ఉద్యమకారులు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు పెరగడానికి పొగాకు వాడకం ప్రధాన కారణం కావడంతో దానిపై నిషేధం విధించాలని చాలా కాలం నుంచి ఆరోగ్యరంగ నిపుణులు, సామాజికవేత్తలు కోరుతున్న సంగతి తెలిసిందే. క్యాన్సర్ కేసుల్లో ఓరల్ కేసులు గుట్కా, పాన్ మసాల ఉపయోగిస్తున్న వారిలో ఎక్కువగా ఉంటున్నాయి. వీటి వినియోగం వల్ల ఆయా వ్యక్తులు అనారోగ్యంపాలు కావడం, జీవితాన్ని కోల్పోవడమే కాకుండా కుటుంబాలపై ఆర్థికభారం పెరుగుతున్నది. ఒకవైపు చికిత్సకయ్యే ఖర్చు, మరోవైపు పని చేసే శక్తిని కోల్పోవడం, తద్వారా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని ప్రజారోగ్య పరిరక్షణ ఉద్యమకారులు పదే పదే హెచ్చరిస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిషేధం విధించగానే సరిపోదనీ, దాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.

దేశానికే ఆదర్శం : మాచన రఘునందన్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల పొగాకు నియంత్రణకు కృషి చేస్తున్న మాచన రఘునందన్ ధన్యవాదాలు తెలిపారు. గత 20 ఏండ్లుగా పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమలాంటి వారికి నిషేధం అమల్లో ఉంటే, మరింత ఎక్కువ మందిని ఆ వ్యసనం నుంచి బయటపడేసే వీలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సోనియాగాంధీ రావట్లే : ఏఐసీసీ కార్యాలయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ హాజరుకావడం లేదని ఏఐసీసీ సమాచారం ఇచ్చింది. వచ్చే నెల 2న నిర్వహించే ఈ వేడుకలకు సోనియాను ఆహ్వానిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆమెను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి లేఖ పంపించింది. కానీ, వేడుకలకు హాజరుకావడం లేదని సోనియా గాంధీ కార్యాలయం నుంచి హైదరాబాద్‌లోని గాంధీభవన్ సమాచారం పంపించారు. అయితే తన సందేశాన్ని పంపించనున్నట్టు సోనియా కార్యాలయం వెల్లడించింది. స్వరాష్ట్రం ఏర్పాటు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఆమెను సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు ఆహ్వానించారు. ముఖ్యఅతిథిగా వస్తారని కాంగ్రెస్ నేతలు భావించినప్పటికీ, వేడుకలకు రాలేనంటూ సోనియాగాంధీ లేఖ పంపడం గమనార్హం. వేడుకలకు ఇప్పటికే సీఈసీ షరతులతో కూడిన అనుమతినిచ్చింది. దీంతో సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించేందుకు సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. అతిథులు ఎండకు గురికాకుండా షామియానాలు ఏర్పాటు చేయనున్నారు. పండుగ వాతావరణాన్ని తలపించే విధంగా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు ముందుగా రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కును సందర్శిస్తారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పిస్తారు.





ఫైనల్లో తడబాటు

రన్నరప్‌తో సరిపెట్టిన సింధు
మలేషియా మాస్టర్స్ సూపర్ 500

కౌలాలంపూర్ (మలేషియా): భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి సింధుకు మళ్లీ నిరాశే ఎదురైంది. ఈ సీజన్‌లో తొలి టైటిల్ విజయం కోసం ఎదురుచూస్తున్న తెలుగు తేజం.. మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో ఆఖరు అడుగులో తడబడింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో పి.వి సింధు మూడు గేముల పోరాటంలో పరాజయం పాలైంది. సుమారు గంటన్నర పాటు సాగిన టైటిల్ పోరులో చైనా షట్లర్, రెండో సీడ్ జాంగ్ జి యు విజయం సాధించింది. 21-16, 5-21, 16-21తో పి.వి సింధు ఓటమి చెందింది.

కోల్‌కత నైట్‌రైడర్స్ తీన్‌మార్. ఆదివారం చెపాక్‌లో జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై గెలుపొందిన కోల్‌కత నైట్‌రైడర్స్ ముచ్చటగా మూడోసారి ఐపీఎల్ చాంపియన్‌గా అవతరించింది. 2012, 2014లో గంభీర్ కెప్టెన్సీ టైటిల్ కొట్టిన కోల్‌కత 2024లో గంభీర్ కోచింగ్ సారథ్యంలో టైటిల్ అందుకుంది. సన్‌రైజర్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. పరుగుల వరద పక్కనపెడితే.. కనీసం పోటీ ఇవ్వగల స్కోరు సాధించలేదు. కోల్‌కత పేసర్లు స్టార్క్, రానా, రసెల్ విజృంభించటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఐపీఎల్ ఫైనల్స్‌లో ఇదే అత్యల్ప స్కోరు. ఈ సీజనో కోల్‌కత చేతిలో హైదరాబాద్‌కు ఇది హ్యాట్రిక్ పరాజయం.

స్వల్ప లక్ష్యాన్ని కోల్‌కత బ్యాటర్లు ఆడుతూ పాడుతూ ఛేదించారు. వెంకటేశ్ అయ్యర్ (52 నాటౌట్), రెహ్మానుల్లా గుర్బాజ్ (39) పవర్‌ప్లేలోనే టైటిల్ విజయం లాంఛనం చేశారు. మరో 57 బంతులు ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన కోల్‌కత నైట్‌రైడర్స్ సన్‌రైజర్స్‌పై ఈ సీజన్లో మూడో విజయంతో పాటు ఐపీఎల్‌లో మూడో టైటిల్‌ను ముద్దాడింది.



కోల్‌కత తీన్‌మార్

- ఐపీఎల్ 2024 టైటిల్ నైట్‌రైడర్స్ వశం
- టైటిల్ పోరులో సన్‌రైజర్స్‌కు భంగపాటు
- హైదరాబాద్ బ్యాటర్ల అనూహ్య వైఫల్యం

హైదరాబాద్ 113/10, కోల్‌కత 114/2

నవతెలంగాణ-చెన్నై

కోల్‌కత నైట్‌రైడర్స్ సాధించింది. 2022, 2023 సీజన్లలో ఏడో స్థానానికి పరిమితమై కనీసం ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించని నైట్‌రైడర్స్ 2024 ఐపీఎల్ చాంపియన్స్‌గా అవతరించింది. ఆదివారం చెన్నై చెపాక్ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ 17వ సీజన్ ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన కోల్‌కత నైట్‌రైడర్స్ మూడోసారి టైటిల్ సొంతం చేసుకుంది. 114 పరుగుల ఛేదనలో కోల్‌కత బ్యాటర్లు అదరగొట్టారు. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ (39, 32 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) మెరువగా.. నం.3 బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్ (52 నాటౌట్, 26 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (6 నాటౌట్) ఆకట్టుకున్నాడు. 10.3 ఓవర్లలోనే కోల్‌కత నైట్‌రైడర్స్ లాంఛనం ముగించింది. రెహ్మానుల్లా, వెంకటేశ్ రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించి సన్‌రైజర్స్ ఆశలు ఆవిరి చేశారు. సునీల్ నరైన్ (6) నిరాశపరిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను కోల్‌కత పేసర్లు మిచెల్ స్టార్క్ (2/14), హర్షిత్ రానా (2/24), అండ్రీ రసెల్ (3/19) స్వింగ్, పేస్, స్లో బాల్స్‌తో వణికించారు. 18.3 ఓవర్లలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 113 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ పాట్ కమిన్స్ (24, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), హెన్రిచ్ క్లాసెన్ (16, 17 బంతుల్లో 1 ఫోర్), ఎడెన్ మార్‌క్రామ్(20, 23 బంతుల్లో 3 ఫోర్లు) చెప్పుకోదగిన పరుగులు సాధించారు. ట్రావిశ్ హెడ్ (0), అభిషేక్ శర్మ (2) విఫలమయ్యారు.

టాప్ ఫ్లాప్ షో : ఐపీఎల్ ఫైనల్లో టాస్ నెగ్గిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆ తర్వాత ఏదీ కలిసి రాలేదు. ఎర్రమట్టి పిచ్‌పై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సన్‌రైజర్స్ ఓపెనర్లను ఆరంభంలోనే కోల్పోయింది. అభిషేక్ శర్మ (2)ను మిచెల్ స్టార్క్ సూపర్ బాల్‌తో క్లీన్‌బౌల్డ్ చేయగా.. ట్రావిశ్ హెడ్ (0)ను తొలి బంతికే వైభవ్ అరోరా సాగనంపాడు. విధ్వంసక ఓపెనర్లు ఇద్దరూ ఆరు బంతుల్లో 2 పరుగులకే నిష్క్రమించగా సన్‌రైజర్స్ శిబిరం నైరాశ్యంలో కూరుకుంది. రాహుల్ త్రిపాఠి (9) దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించినా..మిచెల్ స్టార్క్ ముందు తలొంచక తప్పలేదు. ఓ ఫోర్, సిక్సర్‌తో ఆశలు రేపిన తెలుగు తేజం నితీశ్ కుమార్ (13) హర్షిత్ రానా ఓవర్లో వికెట్ పారేసుకున్నాడు. దీంతో 47/4తో సన్‌రైజర్స్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. టాప్-3 బ్యాటర్లలో ఎవరూ రెండెంకల స్కోరు అందుకోలేకపోయారు.

క్లాసెన్ ఆదుకోలేదు : ఈ సీజన్లో హైదరాబాద్‌ను క్లిష్ట పరిస్థితుల్లో నిలకడగా ఆదుకున్న హెన్రిచ్ క్లాసెన్ (16) సైతం ఈసారి నిలబడలేదు. ఎడెన్ మార్‌క్రామ్ (20)తో కలిసి క్లాసెన్ కాసేపు వికెట్ల పతనం ఆపాడు. దీంతో నెమ్మదిగా ఇన్నింగ్స్ గాడిలో పడినట్టే అనిపించింది. కానీ మార్‌క్రామ్ వికెట్‌తో కథ మళ్లీ మొదటికొచ్చింది. షాబాజ్ అహ్మద్ (8), ఇంపాక్ట్ ప్లేయర్ అబ్దుల్ సమద్ (4) సహా జైదేవ్ ఉనద్కత్ (4) నిరాశపరిచారు. పాట్ కమిన్స్ (24) రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో జట్టు స్కోరు వంద పరుగుల మార్క్ దాటించాడు. 18.3 ఓవర్లలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 113 పరుగులకు ఆలౌటైంది.

దీప పసిడి వెలుగు

జిమ్నాస్టిక్స్ ఆసియా చాంపియన్‌షిప్స్



తాష్కెంట్ : భారత స్టార్ జిమ్నాస్ట్ దీప కర్మాకర్ నవ చరిత్ర సృష్టించింది. 21 నెలల నిషేధం ముగించుకుని 30 ఏండ్ల వయసులో మళ్లీ వాల్ట్ విన్యాసం మొదలుపెట్టిన దీప కర్మాకర్ ఆసియా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం సాధించింది. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత్ నుంచి ఎవరూ స్వర్ణం సాధించలేదు. దీప కర్మాకర్ ఈ ఘనత సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా నిలిచింది. 2015 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం సాధించిన దీప కర్మాకర్.. ఈ సారి పతకం రంగు పసిడికి మార్చుకుంది. మెడల్ రేసులో ఎనిమిది మంది జిమ్నాస్ట్‌లు పోటీపడగా.. దీప కర్మాకర్ రెండు వాల్ట్ విన్యాసాల్లో సగటు 13.566 పాయింట్లు సాధించింది. నార్త్ కోరియాకు చెందిన జిమ్నాస్ట్‌లు కిమ్ సన్ (13.466), జో (12.966) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. 2016 రియో ఒలింపిక్స్ వాల్ట్ ఫైనల్లో నాల్గో స్థానంలో నిలిచి త్రుటిలో పతకం చేజార్చుకున్న దీప కర్మాకర్.. 2014 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. గత ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత జిమ్నాస్ట్‌లు అశీష్ కుమార్ (2006), దీప కర్మాకర్ (2015), ప్రణతి నాయక్ (2019, 2022) కాంస్య పతకాలు సాధించారు.

ఒసాక శుభారంభం

అల్కరాజ్, ఒస్టాపెంకో ముందంజ
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024

పారిస్ (ఫ్రాన్స్) : జపాన్ టెన్నిస్ స్టార్ నవొమి ఒసాక పునరాగమనంలో ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో 6-1, 4-6, 7-5తో లూసియ (ఇటలీ)పై మూడు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించింది. ఆరు ఏస్‌లు సంధించిన ఒసాక.. ఐదు బ్రేక్ పాయింట్లతో మెరిసింది. తొమ్మిదో సీడ్ జెలెనా ఒస్టాపెంకో వరుస సెట్లలో గెలుపొందింది. రోమానియ అమ్మాయి జాక్వలైన్‌పై 6-4, 7-5తో అలవోక విజయం సాధించింది. చైనా అమ్మాయి వాంగ్ యఫాన్ 6-3, 6-3తో మరియ టిమోఫెవపై వరుస సెట్లలో ఏకపక్ష విజయం నమోదు చేసింది. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ కార్లోస్ అల్కరాజ్ ముందంజ వేశాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో 6-1, 6-2, 6-1తో అమెరికా ఆటగాడిపై ఏకపక్ష విజయం సాధించాడు. ఆరో సీడ్ ఆండ్రీ రూబ్లెవ్ 6-2, 6-7(3-7), 6-3, 7-5తో డానియల్‌పై గెలుపొందగా..పదో సీడ్ దిమిత్రివ్ 6-4, 6-3, 6-4తో అలెగ్జాండర్‌ను చిత్తు చేశాడు. బ్రాండన్ నకషిమ 6-1, 6-7(6-8), 6-3, 6-2తో సహచర అమెరికన్‌పై సాధికారిక విజయం సాధించాడు.

మాస్ ప్రేక్షకులను మెప్పిస్తుంది


అంజలి

విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నుమూరి సహ నిర్మాతలు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈనెల 31వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో కథానాయిక అంజలి మీడియాతో ముచ్చటించింది. 'ఇందులో నేను రత్నమాల పాత్రని పోషించాను. ఈ పాత్ర చేయడం నాక్కూడా కొత్తగా ఉంది. ఇలాంటి పాత్ర చేయడం, ఈ తరహా సంభాషణలు నా నోటి నుంచి రావడం ఇదే మొదటిసారి. నా పాత్రను మలిచిన తీరు చాలా బాగుంటుంది. కృష్ణ చైతన్య ఈ కథ చెప్పినప్పుడు.. ఈ పాత్రకు నన్ను ఎంపిక చేయడానికి కారణం ఏంటని అడిగితే, మీరు ఈ పాత్రకు న్యాయం చేయగలరనే నమ్మకం ఉందన్నారు. ఆయన ఏ నమ్మకంతో చెప్పారో తెలియదు కానీ.. ఇంత మంచి పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉంది. ఈ పాత్రలోని వైవిధ్యమే నన్ను ఈ సినిమా చేయడానికి అంగీకరించేలా చేసింది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ పాత్రతో నా బంధం స్వీట్‌గా ఉంటుంది. మా పాత్రల పేర్లు కూడా ఒకేలా ఉంటాయి. ఆయన రత్నాకర్, నేను రత్నమాల. ఇద్దరినీ రత్న అని పిలుస్తారు. నా ఆహార్యం, నేను పలికే సంభాషణలు కొత్తగా ఉంటాయి. మనసులో ఏది అనుకుంటే అది బయటకు చెప్పే పాత్ర. రత్నమాల నా సినీ కెరీర్ లో గుర్తుండిపోయే పాత్ర అవుతుంది. ఇది అందరూ చూసి ఎంజాయ్ చేసే సినిమా. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది' అని అంజలి అన్నారు.

నవచిత్రం

ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్


ఐశ్వర్య మీనన్, కార్తికేయ

యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ పై హీరో కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న సినిమా 'భజే వాయు వేగం'. ఐశ్వర్య మీనన్ హీరోయిన్. హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ప్రశాంత్ రెడ్డి దర్శకుడు. ఈ నెల 31న ఈ సినిమా రిలీజ్ కానుంది. ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్‌ను ఐమాక్స్‌లో ఘనంగా రిలీజ్ చేశారు.

డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ,'ఇదొక మంచి ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్. ఒక కామన్ మ్యాన్ అసాధారణ సమస్యలో ఇరుక్కుంటే అందులో నుంచి ఎలా బయటపడ్డాడు అనేది అన్ని ఎమోషన్స్ కలిపి ఇంట్రెస్టింగ్ స్క్రీన్ ప్లేతో చూపిస్తున్నాం' అని తెలిపారు.

'నేను ఇప్పటిదాకా చేసిన సినిమాల్లో కథ విన్నప్పటి నుంచి ఎప్పుడు రిలీజ్ అవుతుందా మూవీ అని ఎక్కువగా ఎదురు చూసింది ఈ సినిమాకే. ఆరేళ్ళ నా జర్నీలో ఒక పర్ఫెక్ట్ మూవీతో నా అడుగు ముందుకు పడలేదని అనిపిస్తుంటుంది. ఆ వెలితిని భజే వాయు వేగం తీరుస్తుంది' అని హీరో కార్తికేయ చెప్పారు. హీరోయిన్ ఐశ్వర్య మీనన్ మాట్లాడుతూ, 'మా ట్రైలర్ మీకు నచ్చిందని అనుకుంటున్నాను. ఈ నెల 31న రిలీజయ్యే సినిమా కూడా అలాగే నచ్చుతుంది. స్పై సినిమా కంటే ముందు నేను సైన్ చేసిన చిత్రమిది' అని తెలిపారు.

మ్యూజిక్ షాప్ మూర్తి రిలీజ్‌కి రెడీ


అజయ్ ఘోష్, చాందినీ చౌదరి

అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఫ్లై హై సినిమాస్‌పై హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. శివ పాలడుగు ఈ మూవీకి కథ, కథనాన్ని అందించి దర్శకత్వం వహించారు ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన టీజర్, పాటలు ఆడియెన్స్‌లో మంచి బజ్‌ని క్రియేట్ చేశాయి.

ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాని జూన్ 14న విడుదల చేయబోతోన్నట్టుగా మేకర్లు ప్రకటించారు. ఇంకో మూడు వారాల్లో ఈ చిత్రం ప్రేక్షకులకు అద్భుతమైన ఎమోషనల్ ట్రీట్‌ను ఇచ్చేందుకు రాబోతోంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఓ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, బేబీ, డిజే టిల్లు' వంటి బ్లాక్ బస్టర్లను విజయవంతంగా పంపిణీ చేసిన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా ఈ చిత్రం గ్రాండ్ రిలీజ్ అవుతుండటంతో మరింతగా అంచనాలు పెంచేసినట్టు అయింది. ఈ చిత్రంలో అజయ్ ఘోష్ డీజే కావాలనుకునే మ్యూజిక్ షాప్ యజమానిగా కనిపించనున్నారు. చాందిని చౌదరి తన లక్ష్యాన్ని సాధించడానికి అతనికి సహాయం చేసే ఇన్‌స్పైరింగ్ రోల్‌లో కనిపించనున్నారు. ఆమని, అమిత్ శర్మ, భాను చందర్, దయానంద్ రెడ్డి కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్


తాన్వీ ఆకాంక్ష, శ్రీకమల్

దర్శకుడు కె.విజయ్‌భాస్కర్ స్వీయ దర్శకత్వంలో సరికొత్త ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఉషా పరిణయం' టైటిల్‌తో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉపశీర్షిక. విజయ్‌భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ పతాకంపైకె.విజయ్‌భాస్కర్ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ భాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా నటిస్తుండగా, తెలుగు అమ్మాయి తాన్వీ ఆకాంక్ష ఈ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం కాబోతుంది. శనివారం ఈ చిత్ర టీజర్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత విజయ్ భాస్కర్ మాట్లాడుతూ,'ఉషా పరిణయం ప్రేమకు నా నిర్వచనం. ఇదొక మంచి లవ్‌స్టోరీ. సినిమా లవర్స్‌కు ఫుల్‌మీల్స్‌లా ఉంటుంది. అన్ని ఎమోషన్స్ ఈ చిత్రంలో ఉన్నాయి. సంగీతంలో ధ్రువన్ విశ్వరూపం చూస్తారు. నా కూతురు శ్యామల ఈచిత్రానికి హీరో, హీరోయిన్‌కు కాస్ట్యూమ్ డిజైనర్‌గా కాకుండా నాకు ఈ ప్రొడక్షన్ విషయంలో ఎంతో హెల్ప్ చేసింది. కమల్ నేను అనుకున్న పాత్రకు నటుడిగా హండ్రెడ్ పర్సెంట్ న్యాయం చేశాడు' అని తెలిపారు. 'అందరి సపోర్ట్‌తో ఈ సినిమా కంప్లీట్ చేశాం. ఆర్.ఆర్. ధ్రువన్ ఈ చిత్రానికి మంచి సంగీతాన్ని ఇచ్చాడు' అని హీరో శ్రీ కమల్ చెప్పారు. హీరోయిన్ తాన్వి ఆకాంక్ష మాట్లాడుతూ,'అన్ని ఏజ్ గ్రూప్‌లకు నచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది' అని చెప్పారు.

నా ఐడియాని కాపీ కొట్టి బేబీ తీశారు



శిరిన్ శ్రీరామ్ కేఫ్ బ్యానర్‌పై అనురూప్ రెడ్డి, దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ప్రేమించొద్దు'. శిరిన్ శ్రీరామ్ దర్శక నిర్మాణంలో సినిమా రూపొందింది. పాన్ ఇండియా చిత్రంగా 5 భాషల్లో నిర్మించారు. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ని జూన్ 7న విడుదల చేస్తున్నారు.

ఈ క్రమంలో శిరీన్ శ్రీరామ్ తనకు దర్శకుడు సాయి రాజేష్ చేసిన అన్యాయం గురించి, తన కథను కాపీ కొట్టి బేబీగా తీయడం మీద మరోసారి స్పందించారు. అలాగే దీనికి సంబంధించిన సాక్ష్యాలను 'బేబీ లీక్స్' అంటూ పుస్తకరూపంలో తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ, 'రవి కిరణ్ అనే వ్యక్తిని 2015లో కలిశాను. తరువాత ఆయన ఫేస్ బుక్‌లో పెట్టిన పోస్ట్ చూసి ఓ పాయింట్ అనుకున్నాను. ఓ అమ్మాయిని ఇద్దరబ్బాయిలు కలిసి చంపారనే పోస్ట్ చూసి కథ అనుకున్నాం. దాన్ని ఓ బస్తీ అమ్మాయి పాత్రతో లింక్ చేసి కథ రాసుకున్నా. ఆ టైంలో నిర్మాత సాయి రాజేష్‌తో ఏడాది ప్రయాణం చేశాను. నాకు దర్శకుడిగా అవకాశం ఇస్తూ ఆయనే సినిమాను నిర్మిస్తానని అన్నారు. అయితే మరింత ఆలస్యం అవుతుండటంతో నేను బయటకు వచ్చేశాను. అప్పుడు మాకేం గొడవ జరగలేదు. అయితే నా కథను కాపీ కొట్టి 'బేబీ' అనే ఓ బూతు సినిమా తీశాడు. ఇది నా కథే అని సాక్ష్యాలు అన్నీ సంపాదించి లాయర్ నిఖిలేష్‌ని కలిశాను. కాపీరైట్ లీగల్ నోటీస్ పంపాం. ఫిబ్రవరిలో రాయదుర్గంలో కేస్ ఫైల్ చేశాను. ఆయన మీద 'బేబీ లీక్స్' అనే పుస్తకాన్ని కూడా రాశాను' అని తెలిపారు. 'నేను లై డిటెక్టర్ టెస్ట్‌కి సిద్ధం.. సాయి రాజేష్ సిద్ధమా?.. నేను సాయి రాజేష్‌ని పదేళ్ల క్రితమే బ్లాక్ చేశా. జూన్ 7న ప్రేమించొద్దు రాబోతోంది. శిరీన్ డ్రీమ్‌ను సాయి రాజేష్ నాశనం చేశాడు' అని రవి కిరణ్ చెప్పారు.

నేటి తరం ప్రేమకథ


నవదీప్

నవదీప్ నటించిన తాజా చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకుడు. ఈ చిత్రాన్ని నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ బాధ్యతలు తీసుకుంది. ఈచిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నవదీప్ మాట్లాడుతూ, 'అన్ని లాంగ్వేజ్‌లో రకరకాల కొత్త కంటెంట్‌తో సినిమాలు వస్తున్నాయి. అదే కోవలో తెలుగులో రాబోతున్న వైవిధ్యమైన, విభిన్నమైన సినిమా ఇది. ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించే సినిమా ఇది. నా పర్సనల్ లైఫ్‌లో నా ప్రేమకథలు, వాటిల్లో ఉన్న పాయింట్‌ను టచ్ చేశాం. ఈ కథ, ఈ పాయింట్ కనెక్ట్ అయితే వాళ్ల పర్సనల్ లైఫ్‌లో ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలని ఉంది. ఈ 20 ఏళ్ల కెరీర్ తరువాత నాలో ఉన్న కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ చేసిన సినిమా ఇది' అని తెలిపారు.

'ఇందులో నేటి యువతరానికి కావాల్సిన అంశాలున్నాయి. అందరికి రిలేట్ అయ్యే అంశాలు, కనెక్ట్ అయ్యే అంశాలున్నాయి. ప్రేమలో ఉన్న వారి రిలేషన్స్ ఎలా ఉన్నాయి?, కాంప్రమైజ్ అయితే తప్ప రిలేషన్స్ నిలబడవా? అనే ప్రశ్నకు నాకు దొరికిన పరిష్కారాన్ని కూడా ఈ చిత్రంలో చూపెడుతున్నాం' అని దర్శకుడు అవనీంద్ర అన్నారు.

హిట్ లిస్ట్ హిట్ ఖాయం



తమిళ డైరెక్టర్ విక్రమన్ కొడుకు విజయ్ కనిష్క హీరోగా, సముద్రఖని, శరత్ కుమార్, గౌతమ్ వాసుదేవ మీనన్ ముఖ్యపాత్రల్లో నటించిన సినిమా 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కే.కార్తికేయన్ దర్శకత్వంలో ఆర్.కె. సెల్యులాయిడ్స్ పై డైరెక్టర్ కె.ఎస్. రవికుమార్ నిర్మించిన చిత్రమిది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్ వేడుకలు ఘనంగా జరిగాయి.

నిర్మాత కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ, 'ఈనెల 31న ఈ సినిమాతో మీ ముందుకు వస్తున్నాం. కచ్చితంగా అందరికీ ఈ సినిమా నచ్చుతుంది అని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్న శ్రీనివాస్ గౌడ్, బిక్కం రవీంద్రకి కృతజ్ఞతలు. మంచి సినిమా చేశానని గర్వంగా ఉంది' అని హీరో విజయ్ కనిష్క చెప్పారు. తెలుగులో రిలీజ్ చేస్తున్న నిర్మాతలు మాట్లాడుతూ, 'తెలుగులో మమ్మల్ని నమ్మి రిలీజ్‌కి అవకాశం ఇచ్చిన కె.ఎస్.రవికుమార్‌కి ధన్యవాదాలు. ప్రేక్షకులు ఈ సినిమాని మంచి సక్సెస్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



పేదలపైకి దూసుకెళ్లిన బస్సు

- నలుగురు కార్మికులు మృతి

గోవా : దక్షిణ గోవాలో శనివారం అర్థరాత్రి ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న గుడిసెల్లోకి బస్సు దూసుకెళ్లడంతో నలుగురు వలస కార్మికులు మరణించారు. మరో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గోవాలోని వెర్నా ఇండిస్టియల్ ఎస్టేట్ వద్ద వలస కార్మికులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో నిద్రిస్తుండగా శనివారం అర్థరాత్రి 11 గంటల 30 నిముషాల సమయంలో ఓ బస్సు ఆ గుడిసెల పైకి దూసుకెళ్లింది. దీంతో నలుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గయపడిన మరో ఐదుగురిని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమన్నారు. బాధితులకు చికిత్స చేయడంలో వైద్య సిబ్బంది జాప్యం చేయడంతో క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అరెస్టు చేశామన్నారు.

చిన్నారుల మరణం కలచివేసింది : రాహుల్ గాంధీ

ఢిల్లీ : గుజరాత్ లోని గేమింగ్ జోన్ లో, అదేవిధంగా ఢిల్లీలోని ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముక్కుపచ్చలారని చిన్నారులు చనిపోవడం తనను కలచివేసిందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఉదయం ఆయన ట్వీట్ చేశారు. మతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారు తొందరగా కోలుకోవాలంటూ రాహుల్ ఆకాంక్షించారు. ఈ అగ్ని ప్రమాదాలపై ప్రభుత్వం నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా సహాయ కార్యక్రమాల్లో అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కాంగ్రెస్ కార్యకర్తలను అభ్యర్థించారు.

ఆర్మీ ఛీఫ్‌గా పాండే పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ : ఆర్మీ ఛీఫ్ జనరల్ మనోజ్ పాండే పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో నెల పాటు పొడిగించింది. పాండే పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. ఆయన 25 నెలల పాటు సేవలందించారు. ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా జనరల్ మనోజ్ సి పాండేని ఒక నెల పాటు అదే పదవిలో కొనసాగించేందుకు అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ ఆమోదం తెలిపిందని రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రటకనలో పేర్కొంది. దీంతో ఆర్మీ రూల్స్ 1954లోని రూల్ 16 ఎ (4) ప్రకారం ఆయన తన పదవిలో ఈ ఏడాది జూన్ 30 వరకు కొనసాగుతారని తెలిపింది. 1982లో కార్పస్ ఆఫ్ ఇంజనీర్స్ (ద బాంబే సాప్పర్స్) ద్వారా ఆర్మీలో చేరిన పాండే 40 ఏళ్లుగా సైన్యంలో సేవలందిస్తున్నారు. అత్యంత కీలకమైన అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో సరిహద్దు రక్షణకు సంబంధించిన ఈస్టరన్ ఆర్మీ కమాండ్‌గా ఆయన పని చేశారు. 2022లో 12 లక్షల మంది సైనిక బలగానికి అధిపతిగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

మహిళా ప్రొఫెసర్‌గా మభ్యపెట్టి ఏడుగురిపై లైంగికదాడి



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ఒక యువకుడు వాయిస్-చేంజింగ్ యాప్ ఉపయోగించి మహిళా ప్రొఫెసర్‌లా మభ్యపెట్టి ఏడుగురిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. సిధి జిల్లాలో ఈ దారుణం జరిగింది. ఈ కేసులో 30 ఏండ్ల కార్మికుడు బ్రజేష్ ప్రజాపతి, అతని ముగ్గురు స్నేహితులను పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశారు. లైంగికదాడి బాధితుల్లో ఒకరు మైనర్ అని పోలీస్ సూపరింటెండెంట్ రవీంద్ర వర్మ తెలిపారు. జిల్లాలోని మఝౌలీ పోలీస్ స్టేషన్‌లో ఐపిసి సెక్షన్ల కింద 376 (2) (ఎన్), 354, 506, 342, 366, 294 సెక్షన్ల కింద, అలాగే మైనర్ బాలికకు సంబంధించిన కేసులో పోక్సో చట్టంలో సెక్షన్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్కాలర్‌షిప్‌లు వచ్చాయనే పేరుతో విద్యార్థినులకు బ్రజేష్ ఫోన్ చేసేవాడు. వారిని మభ్యపెట్టడానికి యాప్ ఉపయోగించి గొంతు మార్చేవాడు. 'రంజన మేడమ్'గా పరిచయం చేసుకునేవాడు. స్కాలర్‌షిప్‌లు నగదు రావడానికి కొన్ని పత్రాలపై సంతకాలు కావాలని చెప్పేవాడు. తన కుమారుడ్ని పంపిస్తున్నాని, అతనితో రావాలని చెప్పేవాడు. ఇది నమ్మిన విద్యార్థినులు వద్దకు అతడే వెళ్లేవాడు. వారిని బైక్‌పై ఎక్కించుకుని ఏకాంత ప్రదేశానికి తీసుకుని వెళ్లి, లైంగికదాడికి పాల్పడేవాడు. వారి వద్ద నుంచి ఫోన్లు నగదు కూడా లాక్కొనేవాడు. ఈ కేసులో బ్రజేష్ ప్రధాన నిందితుడుగా, అతని స్నేహితులు సందీప్ ప్రజాపతి, రాహుల్ ప్రజాపతి, లువ్‌కుష్ ప్రజాపతి (24) అతనికి సహకరించేవారని పోలీసులు చెప్పారు. అత్యాచారం చేసే సమయంలో హెల్మెట్, చేతి తొడుగులు ధరించేవాడని, చేతులపై కాలిన గాయాల మచ్చలు ఉన్నాయని బాధితులు తెలిపారని, గాయాల మచ్చలతోనే అతన్ని గుర్తించి అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు.

పాపువా న్యూ గినియా ప్రమాదంలో 670 మందికి పైగా మృతి

ఐరాస అంచనా

న్యూఢిల్లీ : పసిఫిక్ దేశమైన పపువా న్యూ గినియాలో శుక్రవారం సంభవించిన కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో 670 మందికిపైగా మరణించి ఉంటారని ఐక్యరాజ్య సమితికి చెందిన సంస్థ అంచనా వేసింది. ఎన్గా ప్రావిన్స్‌లో పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ముందుగా 100 మందికిపైగా మరణించి ఉంటారని అధికారులు అంచనా వేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రమాదంలో 670 మందికిపైగా ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని 'అంతర్జాతీయ వలసల సంస్థ' ఆదివారం తెలిపింది. ఈ దుర్ఘటనలో యంబాలి గ్రామంలో 150కి పైగా నివాస గృహాలు సమాధి అయ్యాయని సంస్థ చీఫ్ సెర్హాన్ అక్టోప్రాక్ ఆదివారం తెలిపారు. గతంలో ఈ గృహాల సంఖ్య 60గా అంచనా వేశారు. 'ప్రస్తుతం 670 కంటే ఎక్కువ మంది శిథిలాల్లో ఉన్నట్లు భావిస్తున్నాం' అని అక్టోప్రాక్ మీడియాకు తెలిపారు. వీరంతా 20 నుంచి 26 అడుగుల లోతులో ఉండటంతో ప్రాణాలతో బయటపడే అవకాశం అతి తక్కువని చెప్పారు. ఆదివారం నాటికి కేవలం ఐదు మృతదేహాలను మాత్రమే వెలికితీసినట్లు సమాచారం. మరోవైపు.. ప్రాణాలతో బయటపడిన వారిని అధికారులు సురక్షితమైన ప్రదేశాలకు తరలిస్తున్నారు.



పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్బీకి 600 కిలోమీటర్ల దూరంలోని ఎన్గా ప్రావిన్స్‌లో స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ప్రజలు నిద్రలో ఉన్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో ప్రాణనష్టం భారీగా వాటిల్లింది. మూడు, నాలుగు ఫుట్‌మైదానాల విస్తీర్ణంలో కొండచరియులు విరిగిపడ్డాయి. ఒకవైపు మరిన్ని కొండచరియలు విరిగిపడే ముప్పు పొంచివుండటం.. మరోవైపు ప్రావిన్స్ రాజధాని వాబాగ్ నుంచి ఘటనాస్థలానికి చేరుకునే మార్గంలో రెండు తెగల మధ్య ఘర్షణల కారణంగా బాధితులకు సహాయక సామగ్రి చేరవేయడంలో ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. దీంతో సహాయక కాన్వాయ్‌లకు సైనికులు భద్రత కల్పిస్తున్నారు. శనివారం జరిగిన ఘర్షణల్లో ఎనిమిది మంది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. అలాగే 30 ఇళ్లు, ఐదు దుకాణాలు దగ్ధమయ్యాయని చెప్పారు.

ఆగని ఇజ్రాయిల్ దాడులు

- మరో 30 మంది గాజా పౌరులు మృతి
- చర్చల పునరుద్ధరణకు యత్నాలు

రఫా: అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ దళాలు రఫాతో సహా గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతున్నాయి. తాజా దాడుల్లో మరో 30 మంది పాలస్తీనీయులు చనిపోయారు. ఒక వైపు హమాస్‌పై యుద్ధం పేరుతో ఇజ్రాయిల్ యథేచ్ఛగా మారణ కాండను కొనసాగిస్తుండగా, వచ్చేవారం ఇరు పక్షాలమధ్య చర్చలు తిరిగి ప్రారంభించేందుకు మధ్యవర్తులు యత్నిస్తున్నారు. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్, అమెరికన్ గూఢచారి సంస్థ సిఐఎ అధిపతి, ఖతార్ ప్రధానితో జరిపిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల బోగట్టా. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఖతార్, ఈజిప్టు, అమెరికా ప్రమేయంతో కొన్ని కొత్త ప్రతిపాదనలను చర్చకు పెడతాయని ఈ వర్గాలు తెలిపాయి. చర్చల పునరుద్ధరణ పై హమాస్ ఇంతవరకు ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించి ఇంతకు ముందు కైరోలో జరిగిన చర్చల్లో మధ్యవర్తులు సూచించిన ముసాయిదా ఒప్పందానికి హమాస్ అంగీకరించినా, ఇజ్రాయిల్ మొండిగా తిరస్కరించింది. అంతర్జాతీయ న్యాయస్థానం గాజాపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని ఆదేశించడం, అంతర్జాతీయ నేర విచారణ కోర్టు (ఐసిసి) చీఫ్ ప్రాసిక్యూటర్ యుద్ధ నేరాలకు



పాల్పడుతున్న నెతన్యాహుకు అరెస్టు వారెంట్ జారీ చేయాలని కోరడం వంటి పరిణామాలతో ఇజ్రాయిల్, దానికి అతిపెద్ద మద్దతుదారుగా ఉన్న అమెరికా అంతర్జాతీయంగా మరింత ఒంటరిపాటుకు గురయ్యాయి.

ఇంకోవైపు లెబనాన్ నుంచి హిజ్బుల్లాలు, యెమెన్ నుంచి హౌతీలు ఇజ్రాయిల్, దానికి మద్దతు ఇస్తున్న పశ్చిమ దేశాలపై ప్రతీకార చర్యలకు పూనుకోవడంతో ఇది ప్రాంతీయ యుద్ధానికి దారి తీసేలా ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్, అమెరికా చర్చల పునరుద్ధరణకు అయిష్టంగానైనా అంగీకరించకతప్పని పరిస్థితి ఏర్పడింది. చర్చలకు ఒక వైపు అంగీకరిస్తూనే మరో వైపు గాజాపై బాంబు దాడులను తీవ్రతరం చేయడం యూదు దుర్హంకార నెతన్యాహు ప్రభుత్వ కపటత్వాన్ని తెలియజేస్తోంది. ఇజ్రాయిల్ గత 230 రోజులుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో పిల్లలు, మహిళలతో సహా మొత్తం 35,903 మంది పాలస్తీనీయులు చనిపోయారు. మరో 80,420 మంది గాయపడ్డారు. గాజాకు సంఘీభావంగా యెమెన్‌లోను, పశ్చిమ దేశాల్లోను ప్రదర్శనలు కొనసాగుతున్నాయి.

పాన్ మసాలా, గుట్కాలపై నిషేధం పొడిగింపు

తమిళనాడు ప్రభుత్వ నిర్ణయం

చెన్నై : పొగాకు లేదా నికోటిన్‌తో కూడిన గుట్కా, పాన్ మసాలా, ఇతర నమలగల ఉత్పత్తులపై నిషేధాన్ని తమిళనాడు ప్రభుత్వం మరో ఏడాది పొడిచింది. ఈ మేరకు తమిళనాడు ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఏడాది మే 23 వరకూ ఉన్న నిషేధాన్ని వచ్చే ఏడాది మే వరకూ పొడిగిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం పైన పేర్కొన్న ఉత్తత్తుల తయారీ, నిల్వ, రవాణా, పంపిణీ, అమ్మకాలపై నిషేధం విధిస్తునట్లు చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నిషేధాన్ని అమల్లోకి తెచ్చారు. ముందుగా ఈ ఉత్పత్తులపై నిషేధం విధిస్తూ తమిళనాడు ప్రభుత్వం 2018 మేలో నిర్ణయం తీసుకుంది. అయితే మద్రాస్ హైకోర్టు ఈ నిషేధాన్ని ఎత్తివేసింది. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మద్రాస్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

మరో విమానంలో భారీ కుదుపులు

12 మందికి గాయాలు

డబ్లిన్ : గాల్లో ఉండగానే మరో విమానంలో భారీ కుదుపులు చోటుచేసుకోవడంతో 12 మంది గాయపడ్డారు. దోహా నుంచి ఐర్లండ్ వెళు న్న ఖతర్ ఎయిర్‌వేస్‌కు చెందిన క్యుర్017 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో భారీ కుదుపులు చోటుచేసుకున్నాయని, టర్కీ మీదుగా వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని, అయితే షెడ్యూలు ప్రకారంగానే విమానం సురక్షితంగా డబ్లిన్ విమానశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం 1.00 గంటలకు ల్యాండింగ్ అయిందని సంబంధిత అధికారులు తెలిపారు. అయితే కుదుపులు కారణంగా 12 మంది గాయపడ్డారని, వీరిలో ఆరుగురు ప్రయాణికులు కాగా, మిగిలిన ఆరుగురు విమాన సిబ్బంది అని తెలిపారు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో ఇటీవలే ఇలాంటి కుదుపులు చోటుచేసుకోవడంతో ఒకరు చనిపోగా, మరో 20 మంది గాయపడిన సంగతి తెలిసిందే.

మతసామరస్యం చాటిన ముస్లింలు

కోయంబత్తూరులో వినాయక మందిరానికి భూదానం



చెన్నయ్ : తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లా పడియూర్ సమీపంలోని ఒట్టపాలయాంలో ముస్లింలు మతసామరస్యాన్ని చాటారు. స్థానికంగా హిందువులు వినాయకుడి మందిరం నిర్మించేందుకు సరైన స్థలం దొరకక ఇబ్బందులు పడుతున్న సంగతిని గమనించిన జమాత్ మసీదు నిర్వాహకులు మూడు సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందజేసి ప్రశంసలు పొందారు. ఆరు లక్షల రూపాయల విలువ చేసే ఈ స్థలాన్ని ఆర్ఎంజి రోజ్‌గార్డెన్ ముస్లిం జమాత్ మసీదుకు చెందిన ప్రతినిధులు మందిర నిర్వాహకులకు ఉచితంగా అప్పగించారు. హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంలో జమాత్ కృషిని స్థానికులు ప్రశంసించారు. జమాత్ ప్రతినిధులకు పూలమాలలు వేసి, భాజాభజంత్రీలతో ఘనంగా సత్కరించారు. భిన్నత్వంలో ఏకత్వమనే భారత విశిష్ట లక్షణానికి ఇది నిఖార్సైన ఉదాహరణ అని స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

తెలుగు మీడియా విశ్వసనీయత!

తెలుగునాట మీడియాకు విశ్వసనీయత తగ్గిపోయిందని ఓ పత్రికాధిపతి ఇప్పుడు గుండెలు బాదుకోవడం ఆశ్చర్యకరం. నిజానికి ఈ శతాబ్దపు తొలి దశాబ్దంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇందుకు బీజాలు పడగా రాష్ట్ర విభజన అనంతరం అది మరింత వెర్రితలలు వేసింది. రెండక్షరాల పత్రిక వచ్చాక మొదలైన మీడియా విభజన క్రమం ఆ తరువాత మరోవైపున 'ఆ రెండు పత్రికలు' అన్న పరిస్థితికి వెళ్లింది. అది ఎలక్ట్రానిక్ మీడియాకూ పాకింది. రాజకీయాల్లో ఎలాగైతే రెండు శిబిరాలుగా నిట్టనిలువునా చీలిన పరిస్థితి (బైపోలార్ పాలిటిక్స్) ఏర్పడిందో (విధాన ప్రాతిపదికన నిలబడే ప్రజాశక్తి వంటివి తప్ప) ప్రధాన మీడియాగా చెప్పబడేవన్నీ అలానే విభజితమయ్యాయి. ఒక పార్టీ కొమ్ము కాయడానికి వాస్తవాలను కప్పిపెట్టడం, అవాస్తవ ఆరోపణలను సైతం పదేపదే ప్రస్తావించడం వాటికి సర్వసాధారణమైపోయింది. చివరికి వాస్తవమేమిటో తెలుసుకోవాలంటే వాటిలో ఏ ఒక్క పత్రికనో చదివితే చాలదు అనే నిర్ధారణకు పాఠకులు వచ్చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే దాన వీర శూర కర్ణ సినిమాలో విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు ఎన్‌టి రామారావు గుక్కతిప్పుకోకుండా చెప్పిన 'ఏమంటివి ఏమంటివి... కురు వంశం ఏనాడో కులవిహీనమైనది' అన్న ప్రఖ్యాత డైలాగ్ గుర్తుకొస్తోంది. తిలా పాపం తలా పిడికెడన్న చందంగా ఈ పరిస్థితి ఏర్పడడానికి ఎవరు ఎంతవరకు కారణమో ప్రధాన మీడియా సంస్థలు, వాటి యాజమాన్యాలూ ఇప్పటికైనా పరిశీలించుకోవడం అవసరం. వారు తమ వైఖరులు సరిదిద్దుకుంటే తెలుగు మీడియాకు తప్పక విశ్వసనీయత పెరుగుతుంది. పాఠకులు, వీక్షకులూ ఆదరించడం తథ్యం!

కార్పొరేట్ మీడియా దుర్నీతి...

గుజరాత్ అభివృద్ధి మోడల్ అనీ, మోడీని ఎంతగానో ప్రస్తుతిస్తూ 2014 ఎన్నికలకు ముందు కార్పొరేట్ మీడియా సాగించిన హంగామా ఇంతా అంతా కాదు. అభివృద్ధి ఎజెండా అంటూ వారు ఊదరగొట్టిన తీరు మరువగలమా! అలాగే 2019 ఎన్నికలకు ముందు పుల్వామా ఘటనల ఆధారంగా ఉద్వేగాలు రెచ్చగొట్టడంలో మీడియా పాత్ర తక్కువేమీ కాదు. ముఖ్యంగా పుకార్లు ప్రచారం చేయడంలో సంఘ్ పరివార్ వాట్సాప్ యూనివర్సిటీ సృష్టించిన అరాచక అసంఖ్యాక పోస్టులు ఎందరి బుర్రలు ఖరాబు చేశాయో! ప్రస్తుత రాజకీయాల్లో కార్పొరేట్ మీడియా అదేవిధంగా సోషల్ మీడియా పాత్ర, ప్రభావం గణనీయంగానే



ఉంటోంది. గత రెండు సాధారణ ఎన్నికల్లో ఈ రెండు మీడియాలు లేకుండా మోడీ అండ్ కో గెలుపును ఎవరైనా ఊహించగలరా? ఆంధ్రప్రదేశ్‌లో కూడా వాటి ప్రభావాన్ని తీసి పారేయగలమా! అంతేకాదు.. పాలనా వ్యవహారాలకు సంబంధించి కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రభుత్వానికి చికాకు తెప్పించినవి కొన్ని కాగా మార్ఫింగ్ సైతం చేసి దుష్ప్రచారం గావించినవి అనేకం.

సిపిఎంపై అక్కసు...!

దేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తున్న బిజెపిని ఒంటరిపాటు చేసి ఓడించాలనీ, రాష్ట్ర రాజకీయాలు నిట్టనిలువునా చీలిపోయిన నేపథ్యంలో వైసిపి, టిడిపి రెండు శిబిరాలనూ వ్యతిరేకించి వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులతో ప్రత్యామ్నాయ శక్తులను సమీకరించాలని సిపిఎం నిర్ణయించుకుంది. అందుకు తన శక్తికొద్దీ కృషి చేస్తోంది. ఈ ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం మధ్య ఎలాంటి విభేదాలు పొడసూపకపోవడమేగాక ఇతర వామపక్ష శక్తులు కూడా సమన్వయంతో పని చేసిన విషయం గుర్తెరగాలి. అదేవిధంగా బిజెపికి వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ సమితి నేతలు నిర్వహించిన ఉమ్మడి సదస్సులు, చేపట్టిన ప్రచారం ప్రజలపై ముఖ్యంగా లౌకిక ప్రజాస్వామ్య భావాలు కలిగినవారిని ప్రభావితం చేశాయి. గడచిన పదేళ్లలో ఈ రాష్ట్రంలో జరిగిన ప్రజా ఉద్యమాలన్నిటిలోనూ సిపిఎం క్రియాశీలక పాత్ర వహించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల మొదలు అసంఘటిత కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలపై శ్రమజీవులకు వెన్నుదన్నుగా నిలిచింది. సామాన్యుల కోర్కెలను ఎల్లవేళలా ముందుంచింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి, పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కోసం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిలకడగా ఉద్యమాలు నిర్వహించింది. ఇంకా చెప్పాలంటే గతంలో చంద్రబాబు, ఇటీవలి ఎన్నికల సమయంలో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎవరున్నా వారి పర్యటనల సందర్భంగా సిపిఎం కార్యకర్తలు, నాయకులనే గృహ నిర్బంధం లేదా ముందస్తు అరెస్టు చేస్తున్నారంటే రెండు పాలక పార్టీలకూ వారంటే ఎంత కంటగింపో విదితమవుతోంది. అలాంటిదీ మీడియా గురించి విశ్లేషించే సందర్భంలో ఆ పార్టీ గురించి ఒక సబ్ హెడింగ్ పెట్టి మరీ 'ఉనికి కోసం వెతుక్కునే పరిస్థితి'లో ఉందని వ్యాఖ్యానించడం సబబేనా!

జర్నలిజం శాస్త్రీయం..

ఒక పర భాషా విశ్లేషకునిపై వ్యాఖ్యానిస్తూ 'ప్రజల నాడి పసిగట్టలేని జర్నలిస్టులు, విశ్లేషకులు తెలుగునాట ఉన్నారనే కదా దీని అర్థం!' అని పేర్కొనడం మనల్ని మనం కించపరుచుకోవడం కూడా అవుతుంది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని ఎవరైనా జర్నలిస్టు రాస్తే లేదా చెబితే 'అలా కాదు.. మేం చెప్పినట్టు చెయ్యండి' అంటూ వారి నోళ్లు నొక్కిన అగ్రశ్రేణి తెలుగు మీడియా సంస్థల యాజమాన్యాల నిజస్వరూపం తెలియనిదెవరికి? ముఖ్యంగా మీడియా రంగంలో ఉన్నవారికి..! జర్నలిజం శాస్త్రీయమైనది. వాస్తవ పరిస్థితులను వస్తుగతంగా పరిశీలించి, భూత భవిష్యత్ వర్తమానాలకు దాన్ని అన్వయించి విశ్లేషిస్తే అది తప్పక ప్రజామోదాన్ని ఆదరణనూ పొందుతుంది. అయితే, నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో పాలకవర్గాలు ప్రధానంగా ద్రవ్య పెట్టుబడి శక్తులు వాస్తవాలను ఎలా మసిబూసి మారేడు కాయ చేస్తున్నాయో ప్రముఖ జర్నలిస్టు నోమ్ ఛామ్‌స్కీ తన 'మాన్యుఫాక్చరింగ్ కన్సెంట్' గ్రంథంలో విపులంగా వివరించారు. ఆయన తెలుగువాడు కాదు.. అసలు ఈ దేశస్థుడే కాదు! కాని ఆయన చెప్పినవన్నీ అక్షర సత్యాలు.

మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే బైడెన్ విధానాలను రద్దు చేస్తా : ట్రంప్

వాషింగ్‌టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నవంబర్‌లో తిరిగి ఎన్నికైతే రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని త్వరగా ముగిస్తానని హామీ ఇచ్చాడు. "ఇతర ప్రజల యుద్ధాలకు" ఆర్థిక సహాయం చేయడం ద్వారా అమెరికా ప్రపంచ యుద్ధ సంభావ్యతను పెంచుతోందని రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి కానున్న డోనాల్డ్ ట్రంప్ వాదించాడు. అటువంటి నిధులను నిలిపివేస్తానని ఆయన వాగ్దానం చేశాడు. ప్రస్తుత నాయకత్వం కింద అమెరికా "విఫల దేశం" గా మారుతుందని, తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే "శాంతిని, స్థిరత్వాన్ని" పునరుద్దరిస్తానని శనివారంనాడు వాషింగ్‌టన్ డీసీలో లిబర్టేరియన్ పార్టీ జాతీయ సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ హామీ ఇచ్చాడు.

సరిహద్దు సంక్షోభాన్ని అంతం చేయడం, విదేశీ సైన్యాలకు నిధులు సమకూర్చడంపై అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేయటాన్ని ఆపడం, "అమెరికన్ సార్వభౌమాధికారాన్ని ప్రపంచ ప్రభుత్వాల చేతుల నుంచి రక్షించడం" వంటివి తనకు ప్రధాన ప్రాధాన్యతలని ఆయన పేర్కొన్నాడు.



"మేము అధ్యక్ష పదవిని గెలుచుకున్న కొద్దిసేపటికే నేను ఓవల్ కార్యాలయానికి రాకముందే, రష్యా, ఉక్రెయిన్ ల మధ్య జరుగుతున్న భయంకరమైన యుద్ధాన్ని ఆపుతాను. దానితో మేము ఇతరులు చేసే యుద్ధాలకు వందల బిలియన్ల డాలర్లు ఖర్చు చేయడం మానేస్తాము" అని ఆయన అన్నారు. "శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే జో బైడెన్ విధానాలను ఆపడానికి నేను కట్టుబడి ఉన్నాను" అని ట్రంప్ కొనసాగించాడు.

రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని ఎలా ముగించాలని యోచిస్తున్నాడో ట్రంప్ వివరించనప్పటికీ, అతను గతంలో హంగేరియన్ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్‌తో తనకు "వివరణాత్మక ప్రణాళిక" ఉందని, "24 గంటల్లో" యుద్ధాన్ని ముగిస్తానని ట్రంప్ చెప్పాడు. "అమెరికా డబ్బును అందించకపోతే, యూరోపియన్లు తమ స్వంతంగా ఈ యుద్ధానికి ఆర్థిక సహాయం చేయలేరు, ఆపై యుద్ధం ముగుస్తుంది" అని ఓర్బన్ ఈ సంవత్సరం ప్రారంభంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు.

ఖార్కోవ్ ప్రాంతంలో రష్యా దాడి చేస్తుండగా ఉక్రెయిన్ కోసం అదనంగా 275 మిలియన్ల సహాయ ప్యాకేజీని ఈ వారం ప్రారంభంలో అమెరికా వెల్లడించింది. అమెరికా సరఫరా చేసిన ఆయుధాలను ఉపయోగించి "రష్యన్ భూభాగంలోకి లోతుగా" గ్రీన్‌లైట్ దాడులు చేయవచ్చని సూచించింది. ఈ చర్య మాస్కో నుంచి విమర్శలకు దారితీసింది. ఐరోపాలో శాంతిని పునరుద్ధరించడానికి వాషింగ్‌టన్ ఆసక్తి చూపడం లేదని, "వివాదాన్ని పొడిగించడానికి, రష్యా, ఉక్రేనియన్‌ల ప్రాణనష్టం పెంచడానికి ప్రతీదీ చేస్తోంది" అని అమెరికాలోని రష్యా రాయబారి అనటోలీ ఆంటోనోవ్ అన్నాడు.

ప్రపంచ గమనం

ఉక్రెయిన్‌కు రష్యన్ డబ్బును ఇవ్వడానికి యూరోపియన్ యూనియన్ ప్రణాళికను నిరోధించిన హంగేరీ : ఫైనాన్షియల్ టైమ్స్



మాస్కో : స్తంభింపచేసిన రష్యన్ ఆస్తులపై వచ్చిన లాభాలను ఉక్రెయిన్‌కు అప్పగించే చట్టాన్ని హంగేరీ నిరోధించిందని ఫైనాన్షియల్ టైమ్స్ శనివారంనాడు రాసింది. ఉక్రెయిన్ వివాదం తీవ్రరూపం దాల్చినప్పుడు పశ్చిమ దేశాలు దాదాపు 300 బిలియన్ల రష్యన్ సార్వభౌమ ఆస్తులను స్తంభింపజేసాయి. యూరోపియన్ యూనియన్‌లో దాదాపు 280 బిలియన్లు చిక్కుకున్నాయి. చట్టపరమైన ఆందోళనల కారణంగా బ్లాక్ ఆస్తులను పూర్తిగా జప్తు చేయడం ఆపివేయబడినప్పటికీ, ఈ వారం ప్రారంభంలో ఉక్రెయిన్‌కు సైనిక సహాయాన్ని అందించడానికి ఆస్తుల నుంచి వచ్చే వడ్డీని ఉపయోగించడాన్ని యూరోపియన్ యూనియన్ ఆమోదించింది. వార్షిక ఆదాయం సుమారు 3 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు.

అయినప్పటికీ, హంగేరీ రాయబారి రష్యన్ వడ్డీ ఆదాయాన్ని ఉపయోగించి ఉక్రెయిన్‌కు వేగవంతమైన చెల్లింపులను వ్యతిరేకించాడని యూరోపియన్ రాయబారుల మధ్య అంతర్గత చర్చలతో సుపరిచితమైన వారు అందించిన సమాచారం ఆధారంగా ఫైనాన్షియల్ టైమ్స్ రాసింది. హంగరీని శాంతింపజేయడానికి యూరోపియన్ యూనియన్ ఒక ఒప్పందాన్ని ప్రతిపాదించింది. దాని ప్రకారం కూటమి నిధులలో దాని వాటా ఉక్రెయిన్ కోసం ఆయుధాలను కొనుగోలు చేయడానికి ఉపయోగించబడదు. ఉక్రెయిన్‌కు ఆదాయ బదిలీని వీటో చేయకూడదని బుడాపెస్ట్ అంగీకరించింది. అయినప్పటికీ, అవసరమైన చట్టానికి మద్దతు ఇవ్వడంలో విఫలమవడం ద్వారా నిర్ణయం అమలును నిలిపివేస్తున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ కథనం పేర్కొంది.మరోవైపు మాస్కో తన ఆస్తుల నుంచి లాభాలను ఉక్రెయిన్‌కు బదిలీ చేయాలనే నిర్ణయాన్ని చట్టవిరుద్ధమైన "చర్య" అని ఖండించింది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఈ చర్యను "ప్రమాదకరం" అని, వ్యాజ్యాలతో సహా అనివార్య పరిణామాల గురించి హెచ్చరించాడు.